

"విరహిణి"

[శ్రీయుత వై. సుబ్బారావుగారి త్రివర్ణచిత్రమునుండి ఎత్తిన ఛాయాపట చిత్రము.]

# పురాణపురుషా!

✠

దీనబంధూ! ప్రతిక్షణమును
మహాయుగముగా దోచుచున్నది.

ప్రతిదినమును దుర్దినముగా నగపడుచున్నది. ప్రతిరాత్రియు కాళరాత్రివలె భయపెట్టుచున్నది. ఇట్లెన్నెన్నియో సూర్యోదయసూర్యాస్తమయముల గ్రమియింప జేసితివి. అక్కటా! యీదీనహృదయమున నింక సౌఖ్యబీజమును నాటుటకు తావే లేదా? స్వామీ! బీజావాపనకు నేడే మంచిముహూర్తము....పుణ్యాలయా! కాల మనంత వేగమున నడచిపోవుచున్నది. దినములు, మాసములు, సంవత్సరములు ఒకదాని వెంట నొకటి పరుగెత్తుచున్నవి. నిత్యమును, రేపురేపని నీకృపావృష్టికై యెదురుజూచుచుంటిని. ఇంక నిట్లెన్నిదినములు గడుపగలను? నేను మాటిమాటికి 'భిక్షాం దేహి' యని యాచించుటదక్క నీనోట బ్రత్యుత్తరము వినజాలకున్నాను. అబ్బా! నీవెంతటి మానివైనను ఒక్కమాట నుడువగూడదా?... జగచ్ఛత్రూ! ప్రతిదినమును, ప్రతిక్షణమును నీకు మొర్రవెట్టుకొనుచుంటిని; కాలచక్రము గిర్రున దిరుగుచున్నది; ఒక్కొక్కదినమే జర్రున జారిపోవుచున్నది; సంవత్సరములు చుట్టివచ్చుచున్నవి; సంతోషదినములు స్వప్నవృత్తాంతములైనవి; సన్నుతులుమాత్రము చేయించుకొనుచున్నావు, మన్ననలకు సున్న జుట్టుచున్నావు. అక్కటా! యీయవధిలేని యాందోళన, వినుగులేని విన్నపము, విరామములేని విచారము, నే నెంత కాలము కొనసాగింపగలను? నీపాదసేవ చేసిచేసి చేతులగడికి కొనవలసినదేనా? అన్యాయ మన్యాయము.

✠

—పుతుంబాక శ్రీకృష్ణయ్య.

# పలనాడు

కలనాడుల కూటువ పెం
డలమానికమయి శశాంకు తలమానిన కీ
ర్తుల తీవకందమై తగు
పలనాడూ! నీదుకడుపు ఫలవంతముగున్.

నీ వీరత్వము నీమహత్త్వమును నిర్నిద్రప్రతాపంబు కృ
ష్ణావేణీతిలకంబు నిర్మలజలస్నాతప్రపూతాత్మమై
యే వేళం గలనాదగీతకలనా హేలావిలాసంబులం
గైవారించునుగాఁ బ్రదక్షిణపురస్కారంబు సద్భక్తితో.

రణరంగంబను పల్కు వీనులను జేరన్వచ్చునో లేదొ యూ
పున సౌవర్ణికకేళికాభ్రమరకంబు ల్గాలితోఁ దన్ని క్రూ
రనిశాతాసినికృత్తవైరిగళవిద్రావన్నవీనోష్ణలా
రుణరక్తప్లుతి నిన్నుఁ దేల్చెడి కుమారుంగంట నీకే తగున్.

వీరాగ్రాతుల గుండెగాలములఁ బృథ్వీకన్యకారత్నముల్
సారోదారత జోలవాడు సరసీజాతాక్షులంగాంచ మో
యేరీ దుష్కరమంత్రఖడ్గకృతి నూయేలంబలెన్ జోపు దు
ర్వారప్రాభవ నాగమాంబకడఁ జెప్పంజాలువా రిమ్మహిన్.

జగములఁగల శూరత్వం
బిగిరి కరుడుగట్టి నీవ యేర్పడితో? లే
కగణితపుణ్యఫలంబున
మగటిమి నీ గర్భజననమహిమం గనెనో?

దినదినమంతరించు నతిదీనుఁ జిరంతన జీవిఁ జేయు నీ
కనదభిధానమంత్రమణి గండరగండనిఁగా నొనర్చు నీ
వినుతపయస్సుధారసము పేదరిగుండెను నీ మహత్త్వపుం
దనువు దలంపనౌనె? పలనాడు! గ్రహింపుమ మన్నమస్సులన్.

—వడ్లమూడి వేంకటరత్నము.

# సూరిసిద్ధాంతం. ౨.

'డ్రాస్టిక్ స్టెప్స్! స్ట్రాంగ్ మెజర్స్!—' అన్నాడు సూరి.

'తెలుగు ఏడవ్వోయ్! ప్రతిదానికీ వెధవ ఇంగ్లీషు!'

'రైటో! అఘాయిత్యమైన మెట్లు! బలమైన కొలతలు!—'

'వద్దు! వద్దు! ఇంగ్లీషులోనే కానియ్యి.'

'నాకు తెలుగురాదంటే వింటావానువ్వు? నా సిద్ధాంత మేమిటంటే, ఎవడైనాకానీ కొంత అఘాయిత్యం, మొండితనం చెయ్యకుండా లోకాన్ని జయించలేడు!'

అది నిజంకూడాను. అసలు సూరి వాకింగ్ ఎన్సైక్లోపీడియా. (నాకూ సూరిదుర్గుణం అలవాటుపడ్డది. అట్లాఅని 'నడుస్తున్న విజ్ఞానసర్వస్వం' అంటేమాత్రం ఏమంతబాగుంది?) ఏవిషయమైనా అడగండి సూరి చెపుతాడు. సూరికి తెలుసు. ఆడవాళ్ళు తల్లోపెట్టుకునే సూదులదగ్గర్నించి కాస్మిక్ రేస్, మాడరన్ స్పిరిచువలిజంవరకూ వాడికితెలీని విషయంలేదు. అయితే వాడి స్ట్రాంగ్ పాయింటేమిటంటే 'గృహచ్ఛిద్రాలు.' ఆ పేరుతో వాడొకపెద్దగ్రంథం రాయటం ప్రారంభించాడు. అది పూర్తిఅయిన తరవాత అన్నిసంసారాలూ చక్కపడగలవు. అంతదాకా మీరంతా ఇదివిని తృప్తిపడవలిసిందే. (సూరిసిద్ధాంతం నిజంగా పనిచేస్తుందా అని అనుమానించేవారి కిప్పుడే ఒకముక్క చెప్పేస్తాను. నా పైసంపాదనవిషయం ఇంట్లోవాళ్ళకు అంతుపట్టనివ్వవద్దని సలహాఇచ్చి మాకొంపలో కాస్త శాంతి నెలకొల్పింది వీడే?)

'లోకంలో అనేకరకాల పశువులున్నారు. వాళ్ళను గురించి కథల్లోనూ, నాటకాలలోనూ చదువుతూనే ఉన్నాంకాని ఎదురుగావచ్చినప్పుడు చూసీచూడనట్టు ప్రవర్తిస్తున్నాం. ఎందుకు? చిన్నసంగతి చెబుతాను విను. నాస్నేహితుడిచెల్లెలొకపిల్ల ఉంది. అపిల్లభర్త మంచివాడేకాని దేబె. ఉత్తబేబయ్య. కాపురానికి పోయిందిమొదలు ఆఅమ్మాయిని కుక్కకన్న నీచంగా చూశారంటే నమ్ము. ఆపిల్లవెధవఆడబిడ్డ పనిమనిషిని చూసినట్టు చూసేది. బావగారు భార్యనుచూసినట్టు చూసేవాడు. మామగారు—అమితదురహంకారి—మీదపడి కొట్టేవాడు. మొగుడంతాచూస్తూ ఊరుకునేవాడురా! వాడిసైకాలజీ ఎటువంటిదో మరి! అపిల్లకు సహజంగా ఒళ్ళుమండేది. కాని ఏంచేస్తుంది. ముచ్చటగా మొగుడిచేత సింహాసనం ఎక్కించుకోవలిసిన రోజులలో చీవాట్లూ, చెప్పుదెబ్బలూ!

'చుట్టుపక్కలవాళ్ళంతా చూస్తూ ఊరుకున్నారా అంటావా? ఆయనకు ప్రోత్సాహంకూడా ఇచ్చారేమోనని నా అనుమానం ఆయన చాలాధనికుడు!

'అపిల్ల చాలాపౌరుషంకలది. అందుకని ఎవరితోనూ చెప్పుకోలేదు. మొగుణ్ణిచూస్తే ఉన్నగౌరవం బొత్తిగా పోయింది; కాలానిక్కట్టుపడి ఉంటున్నది. ఇట్లా జరుగుతుండగా అపిల్ల గర్భిణిగాఉండి ఆడపిల్లను ప్రసవించింది. అంతటితో అపిల్లకష్టాలు రెండింతలయినై. ఒరే! నే ఒక్కటేచెబుతున్నాచూడు! ఆడపిల్లపుడితే ఏడిచేవాళ్ళకుందే ఒక్కటేశిక్ష! అటువంటివాణ్ణి ఆడవాళ్ళంతా బహిష్కరించి దగ్గిరికి రానీకుండాఉంటేసరి! ముష్టి ఆచారలను అతిక్రమించలేక, ఆడపిల్లపెళ్ళి గొంతుకఉరల్లే చేసుకుని ఆడపిల్ల పుట్టిందని వలవలా ఏడుస్తారు.

'ఇట్లా కొంతకాలం గడిచిందమ్మా! మాస్నేహితుడి చెల్లెలు మరోఆడపిల్లను కన్నది! శిక్ష! ఏమంటావు? ఆరోజునించీ అపిల్ల పడ్డపాట్లు చెప్పటానికి వీలులేదు. ఈలోపల మాస్నేహితుడివైపువాళ్ళు చూచాయగా పిల్లకష్టాలనుగురించి విన్నారుకాని పిల్లనడిగితే నిర్లక్ష్యంగా ఏమీలేదు పొమ్మన్నది. కాని మాస్నేహితుడు మాత్రం కోపంవస్తే మనిషికాదు. వాడు చాలారోజులు కోపం ఆపుకున్నాడు. మళ్ళీ చెల్లెలు మూడోసారి

ప్రసవించటానికి వచ్చినపుడు ఆపిల్లను నిలవతీసి సంగతి యావత్తూ కనుక్కున్నాడు. ఇంకేముంది?—అప్పుడు నువ్వయితే ఏంచేస్తావురా?’

‘ఇంకా ఏంచేసేదేమిటి? ఆముసలాణ్ణీ కొడుకుణ్ణీ చిత్రవధ చేసొస్తాను!’

‘తప్పకుండా! నీతెలివితేటలు నాకుతెలుసును... సమయానికి నేను దేవుడల్లే వచ్చాను. (మానూరికి మాడెస్టీ అనేది ఏకోశానాలేదని ఇప్పుడే తెలుసుకోండి!) మా స్నేహితుడు కత్తులూ కటారులూ తీసుకుని ప్రయాణమౌతున్నాడు. వాడి ప్రయాణం ఆపి, వాణ్ణి మెల్లిగా సముదాయించి, వాడిచెల్లెలితో మాట్లాడాను. ఆపిల్లకు మొగుణ్ణిచూస్తే బొత్తిగా అభిమానం పోయింది. కాని మొగుడికి తన్నుచూస్తే ఒకవిధమయిన పిరికిప్రేమ లేకపోలేదన్నది. అంతే నాకు కావలిసింది. అప్పుడే మాస్నేహితుడిచేత బావమరిదికి ఒక ఉత్తరం రాయించాను. నీభార్య, మాచెల్లెలు, తిరిగి ఆడపిల్లను కని అప్రతిష్టపడలేక విషంతీసుకుని ఆత్మహత్య చేసుకోటానికి ప్రయత్నంచేసింది. కనుక్కున్నాం. డాక్టరు వచ్చి ఏదోమందిచ్చాడు. పిల్ల అపాయకరమైన స్థితిలో ఉంది’ అని.

‘ఆఉత్తరం అందినతరవాత ఆపిల్లమొగుడి అవస్థ వర్ణనాతీతం. అది చదువుతూనే మత్తువదిలిన తాచల్లే లేచాట్ట. తల్లినీ తండ్రినీ తిట్టాడు. అన్నమొహాన చేతులోఉన్న పుస్తకం విసిరేశాడు. తనభార్య బతక్కపోవాలి ఒక్కొక్కరి నెత్తురూ తాగి పేగులు మెళ్ళోవేసుకోకపోతే ఛీ! మాదిగాణ్ణేనని ప్రతిజ్ఞచేసి అత్తవారింటికి పరిగెత్తుకొచ్చాడు. తరవాత చెప్పేదేముంది? ఆ కాపరం కుదటపడ్డది అతనిప్రతిజ్ఞ మళ్ళీమళ్ళీ విన్నతరవాత మాస్నేహితుడిచెల్లెలు భర్తమీద అభిప్రాయం మార్చుకుని చాలాప్రేమగా ఉండటం మొదలుపెట్టింది. ఇప్పుడాపిల్ల ఆరుగురాడపిల్లలనుకన్న దింతవరకు. అత్తగారూ మామగారూ తమ కసలు మగపిల్లలే అక్కర్లేదన్నట్టు నటిస్తారు, చిన్నకొడుకు చెవివేటుదూరంలో ఉన్నంతకాలం.’

‘నువ్వు చాలా తెలివికలవాడివిరా, నూరీ! అందరికీ అంత అఘాయిత్యంగా ఉత్తరం రాయటానికి దమ్ముంటుందంటావా?’

‘నన్నేం చూశావు? నాతల్లోనించి దూరిపోయినవాడున్నాడు అఘాయిత్యానికి. (ఇంకోడిగొప్ప ఒప్పుకునేగుణంకూడా ఉంది నూరిదగ్గిర. ఏమాటకామాటే!) పార్వతీశమని. మహాఅందంగా ఉండేవాడు. అతనికి వేలువిడిచిన మేనమామ ఒకడుండేవాడు. ఆయన్ను పార్వతీశంతాత దగ్గిరికి తీసి పెంచటంవల్ల వేలువిడిచిన లక్షణాలేమీ కనిపించకుండా పోయినై. ఆయన కో కూతురున్నది, శారద అని. అందరూ వద్దువద్దంటుంటే ఆపిల్లకు తండ్రి ఎనిమిదోఏట పెళ్ళిచేశాడు, నాకింకా సంవత్సరానికి మారకంఉంది కన్యాదానఫలం దక్కాలి అట్లాఅని. ఆయన కొంచెం చాదస్తమ్మొగుడులే మొదటినించీ! కన్యాదానఫల మాబాగాదక్కింది! శారద మొగుడు పెళ్ళయిన ఆరునెలల్లోనే చచ్చి ఊరుకున్నాడు. అబాయిలూ, దిబాయిలూ! అందరూఆయన్ను అడ్డమైనతిట్లూ తిట్టారు.


‘మొగుడుపోయిన తరవాత మూడునాలుగేళ్ళ కా పిల్ల రజస్వలా అయింది. తనతోటివాళ్ళంతా ఒకరొకరే కాపరానికి పోతుంటే ఆపిల్లకు చాలాదుఃఖంగా ఉండి, తనకూడా తిరిగి ఎందుకు పెళ్ళిచెయ్యరని తండ్రినీ తల్లినీ అడగటం మొదలుపెట్టింది. అటువంటి పనిచేస్తే తనకు రౌరవాదినరకాలు రావటమేకాకుండా తన్ను యావన్మందీ బహిష్కరించి వెలిపెడతారు కనక తను అటువంటి పనిచెయ్యటం కల్లోవార్తఅని తండ్రి ఖచ్చితంగా చెప్పేశాడు.

‘శారద కిదంతా ఉన్మత్తప్రేలాపనల్లేనూ సంధిమాటలల్లేనూ ఉండి తనబావ కోఉత్తరంరాసింది. నేను చూశాను కూడాను.

‘ఏం, బావా! నన్ను పెళ్ళిచేసుకున్నవాళ్ళూ, చేసినవాళ్ళూ రవరవనరకానికిపోతారా? మానాన్న అంటున్నాడు. ఇదంతా నిజమేనా? నీకు రవరవనరకమంటే భయమేనా? ఎందుకంటే నాకేం భయంలేదు. నువ్వెప్పుడూ ఇక్కడికి రావేం? ఈసారి శెలవలకు వస్తావా? తప్పకుండా రా బావా. చాలారోజులుంద్దూగాని. ఏం

నేను పూలుపెట్టుకుంటే ఎంతబాగుంటుందనుకున్నావు. మరి మాఅమ్మ పెట్టుకోనీదుగా. అంచేత మా అమ్మ చూడకుండా పెట్టుకుంటాను. తప్పక రా బావా. ఇట్లు, నీ ప్రియురాలు, శారద.'

'ఇదంతా తెలిసి రాసిందనటానికీ వీల్లేదు; అజ్ఞానంలో రాసిందనటానికీ వీలులేదు. మొత్తానికి ఆ ఉత్తరంచూసి పార్వతీశం ముగ్ధుడైనాడు. ఎట్లానైనా శారదను చేసుకోవలసిందే ననుకున్నాడు. అతనికి వేలు విడిచిన మేనమామగారింట్లో తనకు కలిగే ఇబ్బందులు స్పష్టంగా తెలుసును. వాటన్నిటికీ సిద్ధమై మరీ బయలుదేరాడు.




'వాకిట్లో బావనుచూడగానే శారద 'ఓ! బావొచ్చాడే, అమ్మా!' అంటూ కేకలుపెట్టి నాట్యం చెయ్యటం మొదలుపెట్టింది. అయితే అంత సంతోషంలోకూడా తనురాసిన ఉత్తరంచూసి వచ్చాడన్నమాట బయటపెట్టలేదు. ఆసంగతి గమనించాడు పార్వతీశం. కాని అతను శారదవంక కఠినంగా చూశాడు. శారద నిర్ఘాంతపోయింది. ఈచర్య ఆపిల్లకర్థంకాలేదు. అతను తనతో మాట్లాడినప్పుడల్లా కసురుతూ మాటలాడటం చూసి ఇంకా ఆశ్చర్యపడ్డది. ఆమధ్యాహ్నం అతను అత్తతోను, మామతోనూ రహస్యంగా 'శారదాం మరీ మితిమీరుతున్నది. దాని కలుసిచ్చి పాడుచేస్తున్నారు. ఈడొచ్చిన మొగాళ్ళతో అది అట్లా పూసుకుపూసుకు తిరగటం ఎంత అప్రతిష్ట!' అన్నమాటలు వింటే శారదకు గుండెపగలవలసిందే. తనతో బావ సరిగా మాట్లాడకపోయ్యేటప్పటికి శారద మొహం ఇంతచేసుకునిదిగులుగా ఒకమూల కూర్చున్నది. బావకు కోపంవచ్చిందనుకున్నది.

'రెండుగంటలకు శారదతండ్రి స్కూలుకు వెళ్ళాడు. మూడుగంటలకు తల్లి పురాణంచదివేచోట కూర్చుని నిద్రపోబోయింది. శారదా, బావా మిగిలారు శారద కోపంగా బావదగ్గిరికొచ్చి, 'ఏం, బావా! నా మీద అంతకోపం వచ్చింది. నాతో మాట్లాడవా?' అంది. పాపం పార్వతీశానికి కళ్ళనీళ్ళపర్యంతమయింది.

'ఓ,సి, పిచ్చిదానా! నాతో అట్లామాటలాడితే మీఅమ్మ కోప్పడదుటే?' అన్నాడు పార్వతీశం.

'అయితే నన్నుచూస్తే నీకు కోపంలేదన్నమాటే!' అంది శారద మొహం అంతచేసుకుని.

'ఎంతమాత్రంలేదు. నువ్వువెంటనే వెళ్ళి తల్లో పూలుపెట్టుకురా!' శారద దొడ్లోకి పరిగెత్తుకుపోయి తలలోపూలు అడ్డదిడ్డంగా కుక్కుకొచ్చింది.

'మొహాన కుంకంబొట్టు పెట్టుకో!' శారద బొట్టు పెట్టుకుంది.

'నాకోచిన్నముద్దుపెట్టూ!...బావనుకాదూ?' శారద ముద్దుపెట్టుకోనిచ్చింది. పార్వతీశం కొసరుకింద గట్టిగా శారదను కాగిలించుకున్నాడు.

'నన్ను పెళ్ళిచేసుకుంటావా, శారదాం?'

'ఎట్లా? నాన్న ఒప్పుకోడు!'

'మాబాగా ఒప్పుకుంటాడు. నీకు ముట్టునెల ఎప్పుడు? పిచ్చిసిగ్గులుపడి నాప్రయత్నం పాడుచెయ్యి!

విదియ నాటికా? అయితే ఆనాటికి బయట ఉండను!'

'ఎట్లా?' అంది శారద రహస్యంగా.

'ఎవరితోనూ—మీ అమ్మతో చెప్పకుండా గడిపెయ్యలేవూ మూడురోజులూ?'

'ఇంట్లో కలవనా?'

'మరేమీ ఫరవాలేదు ఒక్కసారికి. నేనావిషయం బాగాచదివాను. డాక్టర్ల నడిగాను. ఏమీతప్పులేదు.'

'తరవాత?'

'నేను చేస్తాను. మనంపెళ్ళిచేసుకుంటే అంతా మన నోట్లో ఉమ్మేస్తారు. ఇష్టమేనా? నేను నిన్న ఎప్పుడూ ఇంత ఆపేక్షగా చూడకపోవచ్చును. అది కూడా ఇష్టమేనా? నేను నిన్ను కొట్టవచ్చును. ఏం? భేష్!'

మళ్ళీ ఇంకోముద్దుపెట్టుకుని శారదమొహంమీద కుంకం తుడిచి తలలోపూలు లాగేసి, 'నేను మళ్ళీ నీతో చెప్పేవరకూ నాతో మాటలాడకు. సరేనా?'

'సరేకాని, నేను పూలుపెట్టుకుంటే బాగాలేను, బావా?'

'చిలకల్లే ఉన్నావు! లేకపోతే నేను ముద్దుపెట్టుకుంటానా? నాతో మాట్లాడకు, మతిమరుపుదానా!'

'చెప్పేదేముంది? పార్వతీశంవేసిన అస్త్రం అమోఘంగా పనిచేసింది. ఏకాదశి గడిచింది, ద్వాదశి గడిచింది. శారద వాకిటఉండలేదు. తల్లీ దండ్రీ రహస్యంగా మథనపట్టం మొదలుపెట్టారు. చాటుగా శారదను పరీక్షచేశారు. ఆపిల్ల ఏప్రశ్నకూ సమాధానం చెప్పలేదు. భ్రూణహత్యామహాపాతకం చెయ్యవలిసివస్తుందా ఏమిట్రా భగవంతుడా! ఈ అపవాద భరించట మెట్లాగని శారదతండ్రి వాపోవటం మొదలుపెట్టాడు.

'సనాతనధర్మాన్నిగురించీ, మతాచారాలనుగురించీ, విధవావివాహాలుచెయ్యటంయొక్క బుద్ధితక్కువను గురించీ ఇన్నిరోజులనించీ పార్వతీశం ఇస్తున్న ఉపన్యాసాలు మేనమామమనసున నాటి ఆయన కతన్ని చూస్తే మంచిగురి ఏర్పడ్డది. ఈవిషయం అతని సలహా అడగవలిసిందే ననుకున్నా డాయన.

'చాలాసేపు విషయం అర్థంకానట్టు నటించాడు పార్వతీశం. తరవాత మండిపడి మామను తిట్టటం మొదలు పెట్టాడు.

'మీచనువులూ, ఆపేక్షలూ నాకర్థంకావు. మీ నూక్కాలుపిల్లల కళ్ళన్నీ ఈ ఇంటిమీదనే ఉంటున్నై. అటువంటప్పుడు ఎంతజాగ్రత్తగా ఉండాలి? అయ్యయ్యో! ఎంత అపకీర్తి! ఎంతపాపం! శిశుహత్యచేసి నరకానికి పోతావా? చెయ్యక అపవాదుపడతావా? రౌరవాదిమహానరకాలు—'

'మామగారిశరీరం కంపించి ముచ్చెమటలు పొయ్యటం మొదలుపెట్టింది. 'ఉండరా! నాయనా! నాకీ ఆపదతప్పే ఉపాయంచెప్పు! నీయింట కుక్కనైపుట్టి నీరుణం తీర్చుకుంటాను!'

'అవకతవక పనులన్నీచేసి ఉపాయంఅడిగితే ఏం చెప్పను. నావల్లకాదు' అన్నాడు పార్వతీశం.

'శారద తల్లిదండ్రుల అవస్త వర్ణనాతీతం. పార్వతీశం వాళ్ళను కొంతబాధపడనిచ్చి 'ఒక్కఉపాయం లేకపోలేదు,' అన్నాడు.

'ఏమిటది? ఏమిటది?' అన్నారు శారద తల్లిదండ్రులు ఏకగ్రీవంగా.

'ఎవరికైనాఇచ్చి వెంటనే పెళ్ళిచేస్తేసరి! అపవాదు తప్పుతుంది. నరకంఎట్లాగూ తప్పదు.'

'ఎవరు చేసుకుంటారు?'

'దాన్ని గుంటూరు తీసికెళ్ళి ఎవరికైనాచూసి అంటగడతాను.' ఈ ఏర్పాటుకు అంతా వప్పుకున్నారు. శారదకూడా.

'శారదనుతీసుకుని పార్వతీశం గుంటూరువెళ్ళాడు. పదిహేనురోజుల కతనిదగ్గిర్నించి ఉత్తరంవచ్చింది.

'మామగారికీ, అత్తగారికీ నమస్కారములు. ఎంత వెతికినా శారదకు మొగుడు దొరకలేదు. ఇక తప్పక నేనే చేసుకున్నాను. అందుకోరకు మీరు నాకు చాలా కృతజ్ఞులై ఉండవలెను...చెప్పటం మరచిపోయినాను. ఇవాళే శారద వాకిటఉంది. రౌరవనరకంవిషయం మీకిక ఏమాత్రం భయం అవసరంలేదు.'

'ఒక్కసంగతిమాత్రం చెప్పాలి. వాళ్ళిద్దరూ ఈ నాటికీ చాలా అన్యోన్యంగా ఉంటున్నారు—మనలో చాలామందికి చాతకానివిద్య!'

'కనక ఉంటారు!' అన్నాను.

'అవును! లేకపోరు!' అన్నాడు సూరి.

—కొడవటిగంటి కుటుంబరావు.

# వలపుటలుక

[సత్యాకృష్ణుల నడుమ నడచిన 'నెయ్యపుఁగిన్క' వృత్తాంతమును ముక్కుతిమ్మనార్యుడు తన ముద్దు పల్కులతో తెలుగువారికి తెలిపియున్నాడు. ఒకానొక ప్రణయినీప్రణయుల నడుమ నడచిన 'వలపుటలుక' 'యైహికానందప్రవాహపూరకమైన శృంగారరసము' చిప్పిలునట్లు క్రిందికావ్యమున ప్రస్తరింపబడినది.

మ. కులుకుంగుబ్బలు సోఁగకన్నుఁగవ తళ్కుంజెక్కులున్ మోవి సొం
పులుఁజూపింపక వేఁగ మవ్వలికి మోమున్ద్రిప్ప నేమాయె ని
వ్వలతేవే నెఱిగుంపులుం బిఱుదులున్ వామాక్షి! చాల్ మాను రో
ట్టెలమున్ రేవును, సున్నమున్ మొదలుం గంటే? వింటివే! యొచ్చటన్.

మ. వరబింబాధరమున్ బయోధరములున్ వక్త్రాలకంబుల్ మనో
హరలోలాక్షులు జూప కవ్వలిమొగంబై నంత నేమాయె నీ
గురుభాస్వజ్జఘనంబు గ్రొమ్ముడియు మాకుం జాలవే గంగ క
ద్దరి మే లిద్దరి కీడునుం గలదె? యుద్యద్రాజబింబాననా!

అను చాటువులలోఁగల పచ్చితన మింపుగానము. కాని ఆచాటువులందలి నాయకులవలె ఇందలి నాయకుడును నాయికను ప్రార్థనామృదూక్తులతో అనునయించుచున్నాడు. తిక్కన కల్పించిన 'అల్పకోపసుందరం బైన మోము' అను పదమువలెనే ఈకవి కల్పించిన 'కుపితవృత్తివిలాసము' అను పదము ప్రసాదభావనిష్యందిని యైయున్నది. కృష్ణశాస్త్రిగారిచే సృష్టింపబడిన ఒక నాయిక నేత్రములు 'అర్థముకాని భావగీతములు'—ఇందలి నాయిక దృఙ్మాలిక 'మాటలకూరుపులేని మంజుభావాల మనోహరమ్మయిన పద్యము.' ప్రార్థించియు, బ్రతిమాలియు ఇందలి నాయకుడు 'అన్యోన్యచుంబనాశ్లేషణముల బరవశత' నొందియున్న జంటనుజూపియు నాయికను ప్రలోభపెట్టుచున్నాడు.

—సంపాదకుడు.]

కాటుక రేకలం బెళుకుఁగన్గొనలన్, దిలకమ్ము మోమునన్
నీటుగ సంతరించి రమణీయములైన వినీలకేశముల్
పాటనసేసి నాదరి కలంకృతవై యరుదెంచి నిల్చి నీ
వేటికి మాటిమాటికి సఖీ! కనుఁగొందువు నాకనుంగవన్ ?

మృదుపాదమ్ములపై నటించు వసనోర్మిశ్రేణులన్ సర్ది పై
రెదపై జాఱిన పయ్యెదన్ గరములన్ శృంగారమేపారఁ దీ
ర్చెద వేలా, కరభూషణావళులుఁ, గాంచీకింకిణీమాలికల్,
పదమంజీరము, లుజ్జ్వలద్యుతిమయప్రాలంబికల్ మ్రోఁగఁగన్.

వాలిన రెప్పలన్ మఱలఁ బైకొకయించుక యెత్తి యొక్క దృ
జ్మాలిక నర్థవంతముగ మాటలకూరుపు లేని మంజుభా
వాల మనోహరమ్మయిన పద్యముగా విరచించి నాదు నే
త్రాల హృదంతరాళముల వ్రాసెదవేటికి ముగ్ధబాలికా!

నావదనమ్ముఁ జూచి తెలినవ్వులు నింపెదవేల నీదు కె
మ్మోవిపయిన్ లతాంగి! నవముగ్ధముగా, జఘనమ్ములంటి సొం

పై వదులై రహించు జడయల్లికపొందికలోనఁ గమ్మనె
త్తావులు జల్లు మల్లెలు మిథస్స్ఫురణన్ ననుఁ బల్కరింపఁగన్.

నీకనుదోయిచూపులకు నీచిఱునవ్వులకున్ మదీయవీ
క్షాకమనీయహాసములు కాంతులు సేసితివేమొ కాన్కగాఁ
గైకొన; యత్నపూర్వకముగాఁ గనుఱెప్పల, మోవి, దాటఁగా
నీ కవి యేనడాఁపఁగఁ జెలీ! వహియించితివేమొ కోపమున్ ?

ఏమి కతమ్మొ యల్కవహియించి గిరుక్కన నొక్కమాఱు నె
మ్మో మటు త్రిప్పివైచెదవు, భ్రూయుగభంగము, నవ్వులేని యా
కోమలకంపితాధరము, కొంచెము రాగముఁ బూను నేత్రముల్,
ప్రేమవతీ! యొకానొక నవీనవిలాసము నీకుఁ గూర్పఁగన్.

వంచిన నెమ్మొగమ్ము నతివా! పయికెత్తవు, వాలుఁజూపు నొ
క్కించుకయున్ మఱల్పఁజన వీడెస; వ్రేళులతోడఁ గేలఁగీ
లించిన గాజులట్టె కదలించెదు, బొట్టనవ్రేలు నేల నా
డించెదు, క్రొత్తయందము ఘటించెదలంకృతరమ్యమూర్తికిన్.

కమ్మనిపూవులన్ వదులుగా విరచించిన నీలవేణి యం
దమ్ములదాన! నీయధరితమ్మగు మోమిటు త్రిప్పవద్దు, నె
య్యమ్మున మీఁదికెత్తి నయనాంచలవీక్షల నట్టె యొక్కమా
ఱిమ్మెయి నిల్పి నీకుపితవృత్తివిలాసము నాకుఁ జూపుమా.

రాగవతీ! యొకింత యపరాధ మొనర్చినవాఁడనేమొ కే
ళీగతి, నీ వినోదకృతలీలకు నీదుహృదంతరంబునం
దాఁగని కోప మూనఁదగునా? కరుణన్ సయిరించి యియ్యెడన్
రాఁగదె యొక్కమాఱు కనరాదె విలోలవిలోకనంబులన్ ?

అపరాధం బొనరించినందులకు శిక్షార్హుం డితండౌట వీ
నిపయిన్ నీ సిళితావలోకనశరానీకంబు వర్షించి యీ
వపువున్ దావక బాహుశృంఖలలచే బంధించినం జాలదే ?
కుపితాంగీ! యటు మోము వెట్టుకొన నీకుం గూడునే యిత్తఱిన్ ?

* * *

యువతి! యాదెసఁ గనుఁగొను మొక్కసారి;
యొక్కప్రియురాలు నొక్కప్రియుండుఁ, బ్రేమ
లీల నన్యోన్యచుంబనాశ్లేషణములఁ
బరవశత నెట్లు మోదముం బడయువారొ ?

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

# ఎద్దడినీళ్లు

వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనేభయంవేస్తూంది.
వ్రాస్తే వ్రాత కోభాగ్యం అనుకుంటే ఒకముక్క వ్రాయవచ్చును.
కళ్ళల్లోకంటూ ఎటుచూచినా, చెవుల్లోకల్లా ఎటువిన్నా వేడిగాడుపే.
"నీ కలా యుండాలని నాకోరికే. నీ వలాయుండాలని నాకోరికే."
ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వాని యూహ.
"ఏం తిరిగి పట్టుకొచ్చేవు? వెఱ్ఱిముండాకొడకా!" అంది యువతి.
"నీ యవ్వనం తగులబెట్ట చావలేకపోయేవు అనాడు" అన్నాడు లోపలికి వెళ్ళి.
"ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతినిబ్బరంగా.
ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

ఒక ధర్మచావడి - ఒక యేఱు - అవే మన యీ కథకు గావలసినవి. మిగతాయూరంతున్నా యెక్కడున్నా మనకక్కర్లేదు. ఆ రెండూ మీ రానవాలు పట్ట గలిగినారా అంటే ఊరేదో తెలిసిపోయిందన్నమాటే. ఊరెంతుందో బోధపడ్డాదన్నమాటే. ఏమాఅంటే మన యీకథకు నాయకీనాయకులు ముష్టివాళ్ళు. వాళ్ళకు వేరే ఇల్లూవాకిలీ లేదు. ధర్మచావడిలోనే బస. వాళ్ళకు మంచినీళ్ళకు ఆదరువు వేరే నుయ్యా, చెరువూ ఏమీలేవు. దూరాన్నే ఓపుంతమ్మటే పోగా తగిలే పోల్నాటి సెలయేరే ఆధారం. ఆయేటికీ యీచావడికీ మధ్యజరిగిన కథయిది. రెండోకంటివాడెఱుగనిదీ.

పుంతలో మొదటో వేపచెట్టు, ఆవేపచెట్టుదాటి ఓ మలుపుతిరిగితే మరో వేపచెట్టు. అంతే చెట్లు. ఎక్కడన్నా బ్రహ్మదండిపొదలు. పుంతంతా గులకరాయీ, గండ్రిసుకా, కాలం మండువేసంగి. వేళ మట్ట మధ్యాహ్నం

వాళ్ళిద్దరూ పుంతమ్మట పోతూవున్నారు. వాళ్ళనగా బిచ్చగాడూ, బిచ్చకత్తే. వాళ్ళకు పేర్లు లేవా అంటారేమో? బిచ్చగాళ్ళను బిచ్చంవేసీ వెయ్యడంలో పొమ్మనమనడమేగాని నీపేరేమిటి నీయూరేమిటి అనే వాకబు నాకెప్పుడూలేదు. నాకేకాదు. ఎవరికీవుండదనే నాయూహ. మన మేభాగ్యవంతుణ్ణయినా కలుసుకున్నామా అంటే వాని పుట్టుపూర్వోత్తరమంతా వాళ్ళవల్లా వాళ్ళవెనకాతలే నడిచేవాళ్ళవల్లా తెలిసికొంటేనేకాని తోచదు. ముష్టివాళ్ళనుగురించి ఆలా తెలిసికుందామని వుండదు. ఎంచేతో? అది లోకప్రకృతి అనుకోవాలి అంతే. లేకపోతే మనుష్యతత్వం అనుకోవాలి.

బిచ్చగాడూ బిచ్చకత్తే పుంతమ్మటే పోతూవున్నారు. బిచ్చకత్తె బుజాన్ని ఒకకుండవుంది బిచ్చగానిబుజాన్ని ఒక గడ్డపాఱవుంది. బిచ్చకత్తెకాళ్ళను తాటిపుట్టలువిఱిచికుట్టిన ఒక ఆకజోడు ఆకారంలాంటి జోడువుంది. బిచ్చగాడికాళ్ళని ఎవరికాళ్ళనో అరిగిపోయి పారేయగా దొరికిన పాతచెప్పులజోడొకటి వుంది. మిగిలిన వస్తువాహనాలు, వస్త్రలాంఛనాలూ దాన్నిబట్టి యూహిస్తేనే మంచిది. వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనేభయం వేస్తూంది.—

వాళ్ళ నలావిడిచిపెట్టి ఒకడుగు ముందుకుపోదాం—ఒక అయినింటియువతి. పచ్చని శరీరచ్ఛాయ. పదారువన్నెకడాని ననుకరిస్తూవుంది. ఒంటిమీద ఒల్లె వీపుయొక్క సౌష్ఠవం చూపిస్తూవుంది. చేతుల కంక

హాలు, పోచీలు. కాళ్ళను కడియాలు, అందెలు. మెళ్ళో కంటె, వానా, పుస్తెలు బుజాన్నోయిత్తడిబిందె. ఇత్తడి బిందెలో ఒక ఇనపగరిటె. ఇనపగరిటె నల్లగా పైకి తనయొక్క మొన చూపిస్తూవుంది. ఆమె కాళ్ళని జోడూలేదు. ఆమెనెత్తిని గొడుగూలేదు. వెనుక చూపులేదు. వెడుతూవుంది ఏటివంకకే ఈపెనుగులించి వ్రాయనక్కరలేకుండానే చెప్పవచ్చును భాగ్యశీల అని. వ్రాస్తే వ్రాతలో భాగ్యం అనునంటే ఒక ముక్క వ్రాయవచ్చును. ఆమె యౌవనం బరాబరికి అప్పుడే వచ్చియుంటుందని వ్రాస్తే వ్రాయవచ్చును. తీంద్రపు ఎండనే తియ్యనిచూపులు. వడగాడుపునే చల్లని యూరుపు. ఆపె కనక ఆమార్గాన్ని ముందునడుస్తూవుండక పోతే బిచ్చగాడూ బిచ్చకత్తె దారిలో ఆపాటికే శోషిల్లిపోయియుందురనుకోవాలి.

బిచ్చగాడామెను చూస్తూ అన్నాడు తనపెళ్ళాంతో 'ఓలేవు పోలీ! నీళ్ళుంటాయె, యేటిలో నీళ్ళుంటాయే. నేను తవ్వక్కరలేదనుకుంటానే' అన్నాడు. బిచ్చకత్తెఅంది 'ఏం?' అని. 'ముందు మనలాగే వెడుతున్నారుకదా జనం. నీళ్ళు లేకపోతే వెడతారనా నీయూహ?' అన్నాడు బిచ్చగాడు. 'అందాకా చేరే శక్తి ఉండొద్దు? మనకు ఉండొద్దు మనకు?' అంది బిచ్చకత్తె.

ఇంకా కొంచెంవడిగ్గానడుస్తున్నారు పేదజంపతులు. 'మన ముసిలిబాపనయ్యగారి పడుచుభార్యగారల్లే వున్నారే. మంచినీళ్ళుకావాలంటే సర్వం గొల్లకందా గొల్లకిటమ్మసేత పోయించుకోరాదంటే. ఇందాకా యీయెండలో నడచిరావడం ఎందుకే.—ఆలాఅమాటికొస్తే మనమేనయాం. కాళ్ళ కేచినుగుల్జోడో ఏతాటిపీచో ఆధారంచేసుకొని నడుస్తున్నాము. ఆవిడ చిందులు తొక్కవలసివస్తోందే. ఇసకలో గండ్రిసకలో అయ్యోపాపం! నిలవనీడైనాలేదే. మనిద్దఱం ఏదన్నా ఉల్లభంలాగపడితే బాగుండిపోనే. నాకు చాలాజాలేసిపోతూందే, పోలీ! నాకు చాలాజాలేసిపోతూంది.' అన్నాడు బిచ్చగాడు.

పోలికాళ్ళను తాటిపుట్టజోడు వడప తెగిపోయింది. పోలికి వడకొట్టింది. పోలి క్రిందపడిపోయింది. పోలి యొక్క బుజాన్నివున్నకుండ నేలబడి చితికిపోయింది. బిచ్చగాని కేమి చేయడానికి తోచలేదు కేకవేసిముందు పొయ్యేమనిషిని వెనక్కిపిలిస్తేమాత్రం లాభం ఏమిటి? ఆవిడబుజాన్ని వున్నది ఉత్తబిందె. ఆవిడ పోయేది ఏటికే. పోని తిరిగి ఆవిడవచ్చేదాకా కనిపెట్టుకూర్చుంటాడా బిచ్చగాడు? కూర్చుంటే ఆలోపునే నాలికార్చుకుపోయి పోలి ప్రాణంపోతుందేమో. పోనీ పటుగెట్టుకెడతాడనుకుందాం. దేనితోనీళ్ళు పట్టుకువస్తాడు? కుండ పగిలిపోయింది. కళ్ళల్లో కంటూ ఎటు చూచినా, చెవుల్లోకళ్ళా ఎటువిన్నా వేడిగాడుపే— ముందుకు రెండడుగులువెళ్ళి రెండడుగులు వెనక్కివచ్చి పోలికేసి ఓమాటు చూచి మళ్ళీ ముందుకుసాగినాడు, ఎండిన సెలయేటి యిసక మిలమిలామంటూ ఇగ బారెడు లెక్కలో అనేటట్టుంది.

బ్రాహ్మణయువతి, యెండిపోయిన యేటియిసుకలో ఆయుదయంతీసిన చలమ మధ్యాహ్నానకెండిపోయిన కారణంచేత గరిటెతో యింకా తవ్వుతూ నీళ్ళయూట కోసం ఎదురుచూస్తూవుంది. చాలా వేడిగావుంది. చెమ్మటతోపాటు అదోవిధమైన మైకంకూడా కప్పివేస్తూ వుంది ప్రతిజీవరాశిని.

'పోలీ!' అని ఒక ఏసతో ఒకగట్టికేక వేసినాడు పిలిచినట్టుగా బిచ్చగాడు. బిచ్చగాడి బుజాన్నివున్న గునపం వాడిబుజాన్ని ఆలాగేవుంది. 'పోలీ' అని ప్రతిధ్వనించింది అంతరాళం. బ్రాహ్మణయువతికి పైప్రాణాలు పైకెగిరిపోయాయి. బిచ్చగాడనుకొన్నాడు— పైకి నాటకరంగస్థలంమీద స్వగతమంత గొంతెత్తి- 'నీ కలాయుండాలనినాకోరికే-నీవలాయుండాలని నా కోరికే - ఆలావస్తువుపెట్టుకుని ఆలావర్చస్సు గలిగి ఆలా యౌవనం వెల్లిగక్కుతూ ఆలా నివ్వుండాలని నాకోరికే - కాని నీజీవితం నాజీవితం భగ్నములైపోయినాయి. యీనాడు నీకు మంచినీరం మోసికొని పోవడానికి కుండకూడా లేకపోయెనే?' అని పెద్ద

పెట్టున నేడ్చినాడు.

బ్రాహ్మణయువతి గుండెలో రాయిపడింది. 'భగవానుడా! ఇంత ముసిలిభర్త కొసయూపిరితో నున్నాడు. బిందెడు మంచినీళ్ళా వుదయం తెచ్చిన వుదయమే అయిపోయినయి సగంనీళ్ళు బిందెలోనే ఆర్చుకొనిపోయినవనవచ్చును. దాహము దాహమనువాని కింత దాహమిచ్చుటకైనా నోచకుండ వీ డీబిందె నెత్తుకొని పోడుగదా?' అని నేమేమో కోచి నిలువునా నిశ్చేష్టురాలై నిలుచుండిపోయింది. కొంతసేపు బిచ్చగాడు నిశ్శబ్దంలో లీనమైనట్టుండిపోయినాడు. ఆలోపున బ్రాహ్మణయువతి ఊటేన నీటిలో తన బిందెడుంచి [illegible] పైకితీసిగట్టున పెట్టుకొన్నది.

'ఆనీళ్ళా ఆబిందె నే నెత్తుకొనిపోయి నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. తల్లీ!' అన్నాడు. 'తీసికోమంది' ఇల్లాలు. 'ఆవస్తువులు కావా' లన్నాడు బిచ్చగాడు. వలిచి అక్కడపెట్టింది ఆవిడ. లేకపోతే చంపేస్తాడనే భయం—ఆమెకు.—ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వానియూహ. వాడు వాటిని తీసికొంటూ ఒకచూపుమాత్రంగా ఆయువతికేసిచూసి ఆపిల్ల బెదరిపోతూవుంటే వెఱ్ఱినవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు.



భైక్షుకదంపతులూ ఆబిందే ఆవస్తువులూ తిరిగి ఎవరికీ ఎక్కడా పట్టుపడలేదు. కాని దొంగఎవడో ఆవిడ వస్తువులూ బిందే బలాత్కారంగా తీసికొనిపోయినాడని శెల్లడైంది.

.............................................

కొన్నాళ్ళకు ముసిలిమొగుడు అరుగుమీద కూర్చొనియుండగా బిచ్చగాడువచ్చి 'స్వామీ! మీ ఆవిడ ఆనాడు నాకిచ్చిన బిందే, వస్తువులు' అన్నాడు. 'ఏం తిరిగి పట్టుకొచ్చేవు, వెఱ్ఱిముండాకొడకా!' అంది యువతి అప్పటికి కొంచెం ఆరితేరిన గొంతు కవబట్టో ఇంటనుండబట్టో—'నాపోలి చచ్చిపోయింది. నాపోలి చచ్చిపోయింది. ఇంకెవరికి?' అని ఏడుస్తూపోయినాడు బిచ్చగాడు.

వృద్ధభర్త కేమనడానికీ పాలిపోలేదు. 'నీ దుర్వ్యసనం తగులబెట్టి చావలేకపోయేవు ఆనాడు.' అన్నాడు లోపలకువెళ్ళి. 'ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు' అంది ఆమె అతినిబ్బరంగా.—

ముసిలిబాపనయ్య కుళ్ళికుళ్ళి చనిపోయినాడు. కాని ఆమెకు వర్చస్సు మాఱలేదు.—

కొన్నాళ్ళకు నడుమవీధిలో మంచినీళ్ళనుయ్యి తీయించేరు సర్కారువారు. నూతిప్రతిష్ఠయిననాటిరాత్రే ఆ బాపనవితంతువు అందులోపడి మృతిజెందింది. ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

—కవికొండల వెంకటరావు, బి.ఏ. బి.ఎల్.

# బమ్మెర పోతరాజు

ఘోరతరాధిబాధలకుఁ గుందక చిత్తము రామచంద్రుపైఁ
జేరిచి, యాంధ్రవాఙ్మయవిశేషము లన్నిఁటినేర్చి వాక్సుధా
ధారలచేత; నీశ్వరకథామహిమంబుల వన్నెఁబెట్టు నీ
పారకవిత్వవైఖరి బ్రశంస యొనర్చెదఁ బోతనాగ్రణీ!

ఒకయెడ దైవభక్తి, మఱియొక్కెడ నవ్యకవిత్వరక్తి, యిం
కొకయెడ భావయుక్తి, యిఁకనొక్కెడ మంజులపద్యసూక్తి అ
త్యకలుషలీలఁ జెల్వలర నొనొకా భాగవతంబు వ్రాయు నీ
కొకనికెగాక యన్యునకు నుద్వని పోతన సత్కవీశ్వరా!

తెలుఁగుంగైతలఁ బ్రోత్తపోకడల నుద్దీపింపఁగాఁ జేసి ప
ల్కులఁ దేనెల్ చిలికించి కబ్బపుమెఱుంగుల్ చక్కఁగా దీర్చి నీ
వలె నెవ్వండు రచింప శక్తుఁడగు నద్వైతార్థసందర్భసూ
క్తిలతాబంధురమైన భాగవతముఁ దెల్గించి వెల్గింపఁగన్.

లలితవసంతర్తుకలకంఠకామినీ
మధురగానంబుల మచ్చరించి
సాంద్రశరత్కాలచంద్రాతపస్విన్న
కైరవగంధంబు చూఱలాడి
తరుణీమనోహరతరళతరాపాంగ
శితసాయకములతోఁ జెలిమిచేసి
సంధ్యాసమారంభసంఫుల్లదంభోజ
మకరందధారల మాటుపఱచి

శ్రావ్యము, ప్రసన్నగరిమ, భాషాపటుత్వ
మతులితస్వాదుభావంబునను పదమున
వెలయఁగాఁ జేసి కబ్బముల్ సలుపునేర్పు
తనరు ని న్నెన్నవశమె? పోతనకవీంద్ర!

కృతి నిమ్మటంచుఁ బ్రార్థించు భూపాలుర వైరాగ్యదృష్టితో వదలివైచి
ఘోరదారిద్ర్యసంకులజీవితాంభోధి నెనలేనిముదమున నీఁదివైచి
భాగవతంబను పాయసపాత్రంబు సోదరాంధ్రులకయి చూఱవిడచి
జీవితంబంతయు శ్రీరామసేవకై పరమార్థముగ సమర్పణమొనర్చి

వాఙ్మయక్షేత్రమునఁ గావ్యఫలము లమృత
సదృశము లొసంగినట్టి కర్షకుఁడ వీవు

సుకవివా ? నీవు సజ్జనస్తుతచరిత్ర
అమలసద్గుణసాంద్ర ! పోతనకవీంద్ర !

నిను నాస్థానకవీశ్వరుండని కడుం బ్రేమించె రాముండు, పా
వనవాత్సల్యపయోధి భారతి నినుం బ్రార్థించె బాష్పాప్లుతాక్షియై,
వనజాతాక్షుఁడు కృష్ణమూర్తి నిను సంభావించె నీభాగ్య మే
మనవచ్చున్ గవిసార్వభౌమ! గుణగణ్యా! పోతరాజాగ్రణీ!

చూచినపోల్కి నెచ్చో దైవరూపంబు
    లభివర్ణనము జేయునట్టి నేర్పు
ముక్తపదగ్రస్తములు యమకంబులు
    సహజంబుగాఁ గూర్పుశక్తిగరిమ
భక్తిరసంబునఁ బరమావధిస్థాన
    మంచితంబుగను బాలించుశక్తి
దారిద్ర్యమయజీవితంబున నానంద
    సామ్రాజ్యమేలు నుత్సాహగరిమ

లలితకవితావిలాసైకలక్ష్యమైన
మధురసుకవిత్వతత్త్వనిర్మాణకలనఁ
బోలుచు నిన్నెద నాదర్శముగఁ దలంచు
ననఘుఁడే ధన్యతరుఁడు పోతనకవీంద్ర !

నీదు జితేంద్రియత్వమును నీకవితాకలనంబు నీ ప్రభా
వోదితశాంతవృత్తియును నున్నతి నీకు ఘటించె సద్రసా
పాదితతావకీననిరవద్యకవిత్వసుధాభిషిక్తులై
మోదమునొందు మానవులు ముట్టుదురొక్కొ త్వదన్యకావ్యముల్.

అరుదుగ నాంధ్రవాఙ్మయమహాచరితంబున స్వర్ణవర్ణవి
స్ఫురితమొనర్పఁగాఁదగును పోతన ! తావకదివ్యనామ మా
దరమున నీదు భాగవతదామక మాంధ్రసరస్వతీగళాం
తరమున గంధబంధురసుధల్ చిలికించుత సర్వకాలమున్.

తెలుఁగుం జదివినదానికి
ఫలమేమనఁ బోతరాజు భాగవతంబున్
దెలిసికొని చదువుటొక్కటె
ఫల మన్యము వేఱులేదు పరిశోధింపన్.

—శేషాద్రిరమణకవులు.

# పఠనాలయాలను గురించి

పఠనమందిరాలు స్థాపించడం, పఠనమందిరాలకు జనంపోవడం చాలా ఎక్కువయింది. కొన్ని సంవత్సరాలక్రింద పఠనమందిరాలు అరుదుగాగల మనదేశంలో నేడు ప్రతిగ్రామానికి ఒక పఠనాలయము, అక్కడికి పఠనమందిరంబాపతు పైకం ఖర్చుచేసి తెప్పించినవో లేక ఏయిద్దరు ముగ్గురు దాతలు తెప్పించి దానంచేసినవో కొన్ని పత్రికలురావడం ఏర్పాటయింది. దానితో అక్కడ ప్రతిరోజూ కొందరుచేరడం, ప్రస్తుతరాజకీయాలమీద, సాహిత్యంమీద విమర్శనలు చేయడం అలవాటయింది. ఈ నూతనమైన మార్పువల్ల దేశానికి లాభమేమైనా ఉన్నదా? అని ప్రశ్నిస్తే ఎక్కువ లాభమేమీ కనపడదు. భ్రాంతిగా లేదనడానికి వీలుండదు. అభిమానమైనపత్రికలు, అంటే కులపత్రికలు కమ్మకులపత్రిక అనీ, బ్రాహ్మణపత్రికఅనీ, వైష్ణవపత్రికఅనీ, పూజారిపత్రికఅనీ ఉంటే అలాంటివాటికి రాజపోషకులగానో, పోషకులగానో చేరి వాటికి చేయూతఇచ్చే పఠనాలయాలు ఉన్నవి. అంతేగాని పత్రికల్లో ఉన్నది చదివి ఆచరణలో పెట్టుదామనే వాళ్ళే ఈయుగంలో చాలాతక్కువ. మహాత్ముడి "యంగుఇండియా" చదువుతూకూడా "ఇంగ్లీషు ఎంత బాగుంది? ఆయనమాట ఎంత తూచివేస్తాడు? అక్కడ ఆమాటకుబదులు మరోమాటవేసి అంతఅర్థం, అంత శక్తి తెప్పించడానికి వీలులేదుగదా!" అని మెచ్చుకోవడమేగాని, కట్టుకనే గ్లాస్గోమల్లులు, ట్వీల్లుషర్టులు, జపానుగుడ్డలు మానేసి ఖద్దరుకట్టుకుందామనే ఆలోచనలేని పెద్దమనుష్యులు చాలామందిఉన్నారు పేపర్లు చదవడం, వెంటనే- బూడిదగుంటలోకుక్కవతు- ధర్మపన్నాలు ఉచ్చరించడం, ఇల్లుచేరగానే ఆమాటలు మరచిపోవడమేమాను. ఇది చాలామంది నిత్యకృత్యం.

ఈవిషయం ఏలాఉన్నా పఠనాలయాల్లోకి వచ్చే జనం నానాటికి ఎక్కువైపోతున్నది. ఆవిషయం ఒప్పుకోక తప్పదు. ఈసంగతి గమనించే పట్టాలలో పెద్దలు చేరి ఉచితపఠనాలయాలుకూడా స్థాపించారు.

పట్నాలలోఉండే పఠనాలయాల్లో రెండురకాలున్నాయి. కొన్నిటిలోకి మెంబర్లుమాత్రమే రావచ్చు. "ఇతరులు లోనికిరాకూడదు." మెంబర్లుమాత్రం సాయంత్రం 3 గంటలకేవచ్చి రాత్రి పదకొండుగంటలదాకా కూర్చుని చీట్లపేక, బిల్లియర్డ్సు, చదరంగం ఆడుకుంటారు. పేపర్లజోలికిమాత్రం పోరు. కానీ మెంబర్లుకానిఇతరులు ఆపేపర్లు చదవకూడదు. అసలు లోపలికే రాకూడదు. తెలియక ఏపల్లెటూరిపంతులన్నా పట్నంవచ్చాంగదా పేపరుచూద్దామని లోపలికి వస్తే ఏబంట్రోతో కనబడి "అయ్యా మీరెవరి గెస్టండీ" అంటాడు. ఎవరిగెస్టూ కాదంటే "అయ్యా! దయచేయండి" అని మర్యాదగా చెప్తాడు. వెళ్ళితేనే సరి. లేక పత్రికచూడాలనే ఆదుర్దాకొద్దీ, వచ్చాంగదా పత్రిక హెడ్డింగులన్నా చూసిపోదామని నుంచుంటే వాడు—కాదు కాదు-ఆయన "ఏమయ్యా! వెళ్ళు. చెప్పితే జ్ఞానంలేదూ" అంటాడు.

అదృష్టంబాగుండి ఏబంట్రోతూ కనబడకుండా ఉంటే బల్లదగ్గరకువెళ్ళి పత్రికకోసం వెతకడానికి వీలవుతుంది పత్రికమాత్రం కనపడదు. నిరాశచెంది ఇటూ అటూచూస్తే ఏ మెంబరుకాళ్ళక్రిందో ఉంటుంది ఆంధ్రపత్రిక అని పెద్దక్షరాలు బయటికి కనబడుతూ. ఆయన ఈపేపరుసంగతే తెలియకుండా "వజ్‌నోస్" అనో "టుహార్ట్సు" అనో అరుస్తుంటాడు. పోయి అడిగితే బాగుండదని తిరిగి రావలసిందే.

ఈలాంటి పఠనాలయాలలో మెంబర్లు—అందరూ చక్రవర్తులలాగా ఉండడానికి వీలులేదుగనుక—ఏ ప్రభుత్వానికో శాసనకర్తల మనుకుంటారు. బంట్రోతు సాయిబుమీదా, గుమాస్తాఉన్నచోట గుమాస్తామీదా వీరి అథార్టీ చెప్పడానికి వీలులేదు. ఏమంటే వాళ్ళు పోషిస్తున్నారు వాళ్ళని. ఇందులో ఏ మెంబరుకుకోపం వచ్చినా వాళ్ళపని సున్నే. క్లబ్బుప్యూనుచేతనే తమ

యింట్లో పనిచేయించుకునే మెంబర్లుకూడా ఉంటారు. ఆపఠనాలయము నాలుగుగోడలమధ్యనే వాళ్ళ ప్రభుత్వము గనుక ప్రొద్దున 5 గంటలు లగాయతు 11 గంటలవరకు, సాయంత్రం 3 మొదలు పదివరకు గుమాస్తానూ, బంట్రోతునూ వేధించుకు తినేవారు కొంత మంది. సమయానికి మెంబరు కేక వేయగానే వీళ్ళిద్దరిలో ఎవరైనా హాజరుకాకపోతే "వీళ్ళకు తీరనిపని ఉంటే ఇంకోగుమాస్తానూ, బంట్రోతునూ వేయించరాదుటయ్యా!" అని పురమాయింపు. తానిచ్చే రూపాయకు ఎంతమంది జవాన్లు, ఎంతమంది గుమాస్తాలు వస్తారనో?

కర్మంజాలక ఈమెంబర్లలో ఎవరికైనా ఉద్యోగం లేక, పోనీ కనీసం గౌరవోద్యోగమైనా లేక, డబ్బు పుష్కలంగా ఉన్నట్లయితే, ఆయనకు క్లబ్బులోనే తప్ప తోచేపోదు. ఆయన ఉన్నంతసేపూ ఇంటిదగ్గర పెళ్ళాంబిడ్డలమాట మరచిపోయి గుమాస్తా, బంట్రోతు కూర్చోవలసిందే. అందులో ఎప్పుడైనా తోచినప్పుడు పండుగమామూలు ఇచ్చే స్వామికూడానూ. ఆయన్ను గురించి వాళ్ళిద్దరూ ఏమన్నా అనుకుంటే ఎవళ్ళూ లేనప్పుడు మాత్రమే.

కొంతమందికి క్లబ్బుసొమ్ము సొంతసొమ్ము. "అరే ప్రొద్దుగూకంగానే హిందూ మాయింట్లోపడెయ్యి." ఆయన కోర్టుమునసబు. మిగతా ప్లీడరు మెంబర్లు నోరెత్తలేరు. మరికొందరు పేపర్లు కావాలెనని తీసుకొనిపోయి దేనికో ఉపయోగించుకుంటారు. ఒకాయన అలాగే పేపరు కావాలెనని తీసుకుపోయినాడు. రెండవరోజున ఆపేపరు మరెవరికో కావలసివచ్చి కబురుచేస్తే వెళ్ళి వచ్చిన జవాను "అయ్యా! వారి అబ్బాయి పుస్తకాలకు అట్టవేసుకున్నారటండి" అని కబురు తెచ్చాడు.

రెండవరకం ఉచితపఠనాలయాలు. వాటిలో గుమాస్తాఉండేవి కొన్ని, లేనివి కొన్ని. గుమాస్తా లేకపోతే పత్రికలేఉండవు. అంతా చీకాకు. వారంరోజుల నాటి పత్రికలన్నీ బూజుపట్టి పడిఉంటవి. గుమాస్తా ఉన్నచోట ఆయనే ప్రభువు, ఆయనపైవారి తనిఖీ అంటూ సహజంగాఉండదు గనుక. పేపరున్నదంటానికి, లేదంటానికి ఆయనే దిక్కు. ఆయన ఎంతచెప్పితేఅంత. విన్నన్న చెప్పింది వేదం. ఒకొక్కప్పుడు ఆయన్ను పిలిచిన పిలుపులుగూడా ఆయనకందవు. ఏ ఆత్మీయులతోనో, స్నేహితులతోనో వినోదంగా మాట్లాడుతూ ఉంటాడు. ప్రక్కన్న నిలుచున్నమనిషి కనపడదు ఆయనకు. నిలుచున్న పెద్దమనిషి నిలుచోని, నిలుచోని కాళ్ళునొప్పెత్తి తిరిగి రావలసిందే.

కొన్ని ఉచితపఠనాలయాలలో ఉచితగ్రంథాలయాలు ఉంటవి. అడిగినపుస్తకంమాత్రం ఉండదు. ఎవరో పట్టుకొనివెళ్ళిఉంటారు. ఓపట్నంలో గొప్ప ఉచితగ్రంథాలయమే ఉంది, మునిసిపాలిటీవారి అజమాయిషీలో. దానిలోకి వెళ్ళి కేటలాగు తిరగవేస్తుంటే మంచి పుస్తకంపేరు కనబడ్డది. దాన్ని తీసుకుందామని గుమాస్తాగారికోసం చూస్తే ఆయనకుర్చీలో లేరు. ఆ హాలంతా చాలాసేపు కలేవెతికాను. కనబడలేదు. బయటికివచ్చిచూశాను. కాంపౌండు అవతల షికారుచేస్తూ స్నేహితుడితో మాట్లాడుతున్నాడు. వీధిలోకి వెళ్ళి అడగడం బాగుండదని చాలసేపు అలాగే కూర్చొని ఈపత్రిక ఆపత్రిక తిరగవేస్తూ ప్రతినిముషమూ ఆయనగారు లోపలికి వస్తాడేమోనని చూచాను. అరగంట అయింది. రాలేదు. పోనీ మనంఅడిగితే రాకపోతాడా? మళ్ళీ పఠనాలయము మూసేవేళయింది అని ఆయన దగ్గరకువెళ్ళి "పుస్తకం కావలె నండీ" అన్నాను.

"బజారులో ఉన్నాయా?" అన్నాడా ప్రభువు.

"తమరులోపలికి దయచేయకూడదూ?"

"వస్తారులే వెళ్ళండి" అని ఆప్రభువు అక్కడే నుంచున్నాడు మాట్లాడేవాడు లేకపోయినా. నాకు కొంచెం ఒళ్ళుమండింది. వచ్చేది మీరు ఎంతమంది అండీ? అని అడుగుదామని నోటిదాకా వచ్చిందిగాని ఆయనకూ నాకూ తగాదాఅయితే ఆయనకువచ్చే మర్యాదలోపంలేదు (మర్యాదఉంటేగా లోపించడానికి) గాని నాకుమాత్రం మర్యాదలోపంకలుగుతుందని మానివేశాను. మళ్ళీలోపలికి వెళ్ళి ఆయనగారికోసం కాచుకుని కూర్చున్నాను. ఆయన అలాగే సిగరెట్టుకాల్చుకుంటూ షికారుచేస్తున్నాడు. అరగంటఅయినా ఆ

ప్రభువుకు దయరాలేదు. ఒకంతకు ఆయన కనుగ్రహం వచ్చిందేమో లోపలికి వచ్చాడు. వచ్చి "పుస్తకం గావలసింది ఎవరికండీ" అన్నాడు కోపంగా. నేను వెళ్ళి నెంబరు, షెల్ఫు చెప్పాను. పుస్తకంకోసం గుమాస్తా వెతుకుతూనే ఉన్నాడు "టయిమయిందయ్యా ఇప్పుడేమి చదువుతావు!" అంటూ. ఇంతలోనే బంట్రోతు వచ్చి "తలుపులు వేస్తాను. అయ్యా! అందరూ లేవండి" అన్నాడు. "పుస్తకం అక్కర్లేదు లెండి" అని నేనూ బయటికివచ్చాను "ఈగుమాస్తాగారు చదువుకోవడానికి వచ్చేవాళ్ళను తనకు పరమశత్రువులుగా ఎందుకు ఎంచుకుంటాడా?" అని ఆలోచించుకుంటూ.

కొన్ని పఠనాలయాలలో, అవి మెంబర్లవల్ల నడపబడుతున్నా, ఇతరులనుకూడా నియమితసమయాలలో రానిస్తారు. అటువంటివి కొద్ది. అవి మొదట ఉచితపఠనాలయాలగా ఉండి తరువాత అభివృద్ధిచెంది, బిల్డింగులు అవీ సంపాదించుకుని, అందువల్ల మెంబర్లు, అట్టహాసము, గుమాస్తాలు అవసరమయి, పూర్వపు వాసన పోగొట్టుకో లేక ఇతరులనుగూడా రానిస్తూఉంటవి.

ఇతరులను రానీయడం బలవంతబ్రాహ్మణార్థం కావడంచేత అక్కడజరిగే చర్య మాత్రం చాలావిచిత్రం. మెంబర్లు గుమాస్తామీద అథార్టీచేయడం అంతటా మామూలే. ఆగుమాస్తా ఈమెంబర్లక్రింద అణిగిఉండి, ఇతరులు సాయంత్రం ఎప్పుడువస్తారా? అని కాచుకొని ఉంటాడు వాళ్ళమీద తన అథార్టీ చూపించడానికి. ఏమాత్రం అవకాశంవచ్చినా "అక్కడ కూర్చోకూడదండీ, ఇక్కడ నుంచోకూడదు. టైమయింది. ఉండకూడదు" అని జబర్దస్తీ చేస్తుంటాడు.

చదవాలెనని ఆదుర్దాతో అప్పుడే స్వరాజ్యపత్రిక తీసుకుంటాము చేతులోకి. ఇంతలోకే ఏమెంబరో బిల్లియర్డ్సు రూములోనుంచి కేకవేస్తాడు "సాహెబ్! స్వరాజ్య పట్టుకు రావోయి" అని.అప్పుడే మనచేతులోనించి సగంజారుతుంది పేపరు. సాయిబు దాన్ని సాంతంగా తీసుకుపోతాడు.

ఈవిధంగా ముఖ్యమైనవీ, ఆరోజువచ్చినవీ, అన్నీ తలాఒక మెంబరుదగ్గర ఉంటవి — చదివినా, చదవకపోయినా. సాధ్యమైనంతవరకూ, అనగా వారి శక్తిలో ఉన్నంతవరకూ చదవరు. ఆపత్రికలు చీట్లపేకా, బిల్లియర్డ్సూ చూస్తూఉంటవి. ఇహ ఇతరులు కూర్చోవడానికి నిర్ణయింపబడ్డ బల్లమీద నెలరోజుల క్రిందటి కృష్ణాపత్రిక; రెండురోజులనాటి దినపత్రికలూ; అహింస, సెట్టిబలిజ, నెలరోజులనాటి కాంగ్రెసు, చినిగి ఏకాగితానికి ఆకాగితం విడిపోయిన తాతలనాటి టైమ్సు ఆఫ్ ఇండియా ఉంటవి. ఏరోజువచ్చినా అవే మనకు కనబడతవి.

నిజానికి మెంబర్లు డబ్బు ఖర్చుపెట్టుకుంటూ పత్రికలు ఇతరులకు చదువుకోవడానికి ఇవ్వడమంటే కష్టమే. వాటిని చదివినా, చదవకపోయినా, అవి వాళ్ళకు ఉపయోగపడకపోయినా అవి వాళ్ళదగ్గర ఉండడమే న్యాయం. "లా" క్షుణ్ణంగా తెలిసిన ఈరోజుల్లో అసంగతికాదని ఎవరూ అనరు. అలాంటి పఠనాలయాల్లోకి ఇతరులువచ్చే ఏర్పాటు మానివేస్తే బాగుంటుందేమో? వాళ్ళు రావచ్చునని, వాళ్ళని వేధించడంకంటె?

ఒకగొప్ప పఠనాలయంలో కొన్నిపత్రికలు మెంబరేతరుల దృష్టిపథంలోనే పడవు. కృష్ణాపత్రిక, జన్మభూమి, ఎంగుఇండియా, భారతి మొదలయినవి గుమాస్తాగారి డ్రాయరులో ఉంటవి. మెంబర్లు అడిగితే ఏలాగు ఇవ్వకతప్పదు గనుక అవి దాచిపెట్టింది మెంబర్లుకానివారికోసమే అయిఉంటుంది. చదువవలసినవీ, చదువతగినవీ గుమాస్తాగారి డ్రాయరులోనూ, ఆరోజు వచ్చినవి మెంబర్లకుర్చీలక్రిందనూ ఉంటే ఇతరులను లోపలికి రానీయడంలో అర్థంలేదు. ఆఫార్సు ఎంతత్వరగా మానేస్తే అంతమంచిది.

అక్కడికి సామాన్యంగా వచ్చేవారి కెవరికీ ఎంగు ఇండియా అవీ వస్తాయనితెలియదు. ఒకానొకరి కెవరికయినా తెలిసిఉండి గుమాస్తాదగ్గరకువెళ్ళి "ఎంగు ఇండియా ఇస్తారా?" అంటే "పత్రికలన్నీ పోతున్నాయండీ. ఇవ్వడానికి వీల్లే"దంటాడు ఆయన. అవ్వి ఇవ్వడానికి వీల్లేకపోతే, ఇతరులు చదువుకోవలసింది నెలరోజులనాటి పత్రికలా? పోతవని భయంఉంటే

దస్కత్తు చేయించుకుని పేపర్లు ఇవ్వరాదా? వాళ్ళు ఆహాలులోనే కూర్చొని చదువుకుంటూంటే జాగ్రత్తగా చూస్తుండకూడదా? ఆ పేరు చెప్పి పేపర్లు దాచుకుంటే వచ్చే ఉపయోగం బోధపడకుండా ఉంది. దాచుకుంటే పేపర్లు పోకుండా ఉంటవనా? అసలు తెప్పించకుండా ఉంటే ఎడిటరుగారి ఆఫీసులో చెక్కు చెదరకుండా ఉంటవే? అయినా చదువుకోవచ్చే ఇతరులంతా పేపర్లు దొంగిలించనే వస్తారా?

ఈ ఇతరులు గుమాస్తాగారి ఆగ్రహానుగ్రహాలకు పాత్రులు కావాలె. అడిగిన పేపరు ఆయన సంతోషంగా ఉంటే ఇస్తాడు. ఏ మెంబరో ఆయన మీద కేకలు వేస్తున్నప్పుడు అడిగితే "వీల్లేదండి" అని కసురుతాడు. పేపర్లు ఆయన స్వార్జితమనే ఆయన అభిప్రాయం పాపం! ఇవ్వవలసివచ్చినప్పుడు ఎందుకివ్వవలసివచ్చిందా అని ముక్కుతూ, మూలుగుతూ ఇవతల పడేస్తాడు.

చదువుకోడానికి వచ్చే మనుష్యుల్లో కూడా చాలా రకాలుంటారు. ప్రతివాళ్ళకూ ఇతరుల చేతిలో పేపరు తన చేతిలోకి వెంటనే రావలెననే కోరికే. కొంతమంది పత్రికలో కాగితాలు విడివిడిగా ఉంటే పత్రిక చదవలేరు. 24 పుటలూ వాళ్ళ చేతిలో ఉంటేనే పత్రికా పఠనం నడుస్తుంది. ఒకసారి ఒక సాటి ఉద్యోగస్థుడు పత్రికాపఠనం చేస్తున్నాడు. చేతిలోది "హిందూ." "ఒక కాగితం ఇస్తారా?" అన్నాను. "చదవడం కానీయండి" అన్నాడు. పేపరంతా ఇవ్వమని అడిగానను కున్నాడేమోనని "కాదండీ! ఒక కాగితం చాలు ఇవ్వండీ" అన్నాను "వీలులేదండి,. నే చదవడం కానీయండి" అన్నాడు. "మీరు చదువుతున్న కాగితం అయ్యేలోగా చూచి ఇస్తాను. పైకాగితమన్నా ఇవ్వండి." అని అన్నాను తిరిగి నేను.

అంతటితో ఆయనకు అగ్గెత్తికొచ్చింది కాబోలు "పత్రిక అంతా మీరే చదవండి. తరువాతనే నేను చదువుతాను" అని సత్యాగ్రహసూచనలు కనబరచి అమాంతంగా పేపరు నావైపు విసిరి పారవేశాడు. ఈతగాడా నాకెందుకని "మీరే చదవండి" అన్నాను, సత్యాగ్రహానికి వెరచి.

కొంతమంది పేపరు మొదలుపెట్టితే ఆంధ్రపత్రిక మొదలుకొని కా. నాగేశ్వరరావుచే ముద్రింపబడి ప్రకటింపబడియె వరకు ప్రత్యక్షరం చదివితేగాని పత్రిక వదలరు. కాగితాలు విడిగా ఉండి, కాగితాలితరులకు ఇచ్చేవాళ్ళయితే ఇబ్బంది లేదుగాని పత్రిక అంతా కట్టి ఉంచేమాత్రం చాలా ఇబ్బంది. ఆ చదివేవాళ్ళకు ప్రక్కన మనుష్యులు వేచి ఉన్నారనే సంగతే బుర్రకెక్కదు ఎంతమాత్రం. ఉమ్మిడి రామయ్యసెట్టి నగల ప్రకటన, అమృతాంజనం ప్రకటన చూస్తూ కూర్చుంటారు. అచ్చంగా పేపరు చదవడానికి అంత అలస్యమెందుకూ? ప్రకటనలసహితంగా కంఠస్థం కావలెనాయను.

ఒక పఠనాలయంలో సాయంత్రం నాలుగు గంటల తరువాత "ఇతరులు" రాకూడదు. నాలుగులోగా రావచ్చు. కాని నాలుగుగంటలవరకు ఆంధ్రపత్రిక గుమాస్తాగారిదగ్గరే ఉంటుంది. ఆయన పాపం! అట్టే చదువుకున్నవాడు కాదు. అందువల్ల ఆ పేపరు చదవడానికి చాలా కాలం కావలె. అందులోనూ ప్రతికాలమూ చదివితేనేగాని తృప్తిపడని ఘటం. ఆయన ఓర్పుకూ, ఉత్సాహానికీ వగైరాలకు మెచ్చుకోవలసిందేగాని ఎవ్వరు లేనప్పుడు చదువుకోవచ్చుననే ఆలోచన ఆయన బుర్రలో ఏమూలగానైనా ఎందుకు ప్రవేశించలేదా అని మాత్రం విచారించవలసి ఉంటుంది. ఆయన ప్రత్యక్షరమూ కతేబలుక్కుని చదివి ఆ పత్రిక పూర్తిచేసేసరికి పత్రిక కోసం కూర్చున్న మనుష్యులు నాటుకొని మొక్కలు మొలవవలసిందే. అందుకు ఒప్పుకున్నా నాలుగు గొట్టంగానే ఆ "ఇతరులను" బయటికి తోలుతారు.

ఒకసారి ఓ ఊరు వెళ్ళాను. ఆ సెలవుల్లో పల్లెటూళ్ళలో ఉండడంచేత కృష్ణాపత్రిక చూడడమే పడలేదు. అక్కడ పఠనాలయం ఉంది. దానికి నా స్నేహితుడే కార్యదర్శి. ఇద్దరమూ అక్కడికి వెళ్ళేసరికి ఒక వైదిక బ్రాహ్మడు - బొర్రా ఆయనా చూడ ముచ్చటగా ఉంటాడు - కృష్ణాపత్రిక చూస్తున్నాడు. కొంచెంసేపు కాచుకొని కూర్చొని పత్రిక అయ్యేటట్టు లేకపోతే షికారుకని మేమిద్దరమూ నా స్నేహితుడి పొలాలకు వెళ్ళాము. ప్రొద్దుగూకి మేం తిరిగి పఠనాలయం దగ్గరకు

వచ్చేసరికి ఆశాస్త్రిగారు కృష్ణాపత్రిక సగంమాత్రం చదివారు. పేపరు రేపిస్తాలే అని నాస్నేహితుడంటే ఇంటికి చేరాము. దోవలో నాస్నేహితుడు ఆశాస్త్రిగారు ప్రతిపేపరూ శ్రద్ధగా చదువుతాడనీ, పత్రిక రోజులో సగం ఆయన అధీనంలో ఉంటుందనీ, ఆమాత్రం చదివే వాళ్ళయినా లేకపోవడంచేత అదే కొంచెంనయమనీ అన్నాడు.

మరోసారి మరోపఠనాలయంలోకి వెళ్ళాను. అప్పుడే టైమ్సు ఆఫ్ ఇండియాపత్రిక వచ్చింది. ఇంతలో ఒకమెంబరు ఆపత్రికఇటుతేవోయి అన్నాడు జవాన్ను. ఆయనచుట్టూ చాలామంది గుటకలుమింగుతూ కూర్చున్నారు. ఆయన ఎకాయెకి ప్రకటనలుతీశాడు. అందులో క్రాస్‌వర్డుపజిలు, దాని ప్రకటన చదవడం మొదలుపెట్టాడు. లోపలబొమ్మలు పనికిరాలేదు ఆయనకు. చదవడంచూస్తే మాటమాటకలిపి మెల్లెగా చదువుతున్నాడు. ఆయనకు కావలసిన ప్రకటనలన్నీ చదివి ఆయన మనకు పత్రికఇచ్చేసరికి తిరిగి పత్రికవచ్చేరోజు అవుతుందని అనిపించింది నాకు. అదయినా ఆయన ఈ వారంరోజులూ నిద్రాహారాలుమాని ఆ ప్రకటనలు మాత్రం చదివితే. ఆయన్నుచూస్తే నాకు నవ్వు ఆగింది కాదు. ఎరిగిఉన్న గుమాస్తాఉంటే ఆయనదగ్గరకు వెళ్ళి "ఆయన ఏంచదువుకున్నాడు? ఏంఉద్యోగం?" అన్నాను. ఆయన "ఉద్యోగంలేదు, పాడూలేదు. ధర్డుఫారం తప్పాడు. డబ్బుంది. మమ్మల్ని వేపుకుతింటున్నాడు. పగలురాత్రిభేదం లేదు. ఎప్పుడూ ఈక్లబ్బులోనే మకాంచేస్తానంటాడు. పేపరుచదవడం మొదలుపెట్టితే కాచుకొనికూర్చున్నవాళ్ళు కూర్చున్నబల్లలకు అంటుకొని పోవలసిందే. ఏమిచెప్పను భాగోతం?" అన్నాడు.

ఈ అన్నిరకాల మనుష్యులలోనూ ఏమాత్రమో మార్పుజరిగితేతప్ప స్థితిగతులు అధ్వాన్నంగా ఉండక తప్పదు. ఈవిషయమై పనిచేసే పెద్దలూ, చిన్నలూ, పాఠకులూ, పఠనాలయస్థాపకులూ, మెంబర్లూ, ఇతరులూ, జాగ్రతవహించవలెనని హెచ్చరిస్తున్నాను.

— మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, బి.ఏ.

# గ్రంథరచనవలన రాబడి

శేషాద్రిరమణకవుల పేరు విననివారుండరు. వారు వయసున నలుబదియైదు వత్సరములకు మించియుండక పోయినను ఇప్పటికి దాదాపు ముప్పదివత్సరములనుండి ఆంధ్రసారస్వతమున కమూల్యమగు సేవ చేయుచున్నారు. అంత చిన్నతనమునుండి పనిచేయుచున్నను స్వతంత్రజీవనమును గడుప వీలగురాబడి వారికి పుస్తకరచనవలన గలుగకుండుటచే అన్నదమ్ము లిరువురును ఉపాధ్యాయవృత్తి నవలంబింపవలసిన వారైరి. ఇట్టిది పాశ్చాత్యదేశములందేగాక భారతదేశమునందలి సంయుక్తపరగణాలలోను, వంగదేశమునను గూడ జరుగ ననుటకు వీలులేదు.

## మిల్టన్

పొరుగింటి పుల్లకూర రుచియన్నట్లు ఉదాహరణములకుగూడ ఆంగ్లసారస్వతస్థ విషయములు చదువరులలో నెక్కువమందికి అభిమానకలితములగుచో నచ్చెరువుండ జాలదు. ఆంగ్లసారస్వతమునకు షేక్స్పియరు భాస్కరతుల్యుడు; మిల్టను సోమనిభుడు. మిల్టను రచితములలో 'స్వర్గభ్రష్టత' (పేరడైస్ లాస్టు) ఉత్తమకావ్యము. ఆంగ్లేయులు తమవలసరాజ్యములను చివరకు భారతదేశమును విడువనొల్లుదురుగాని మిల్టను రచితములను విడువ నిచ్ఛగింపరు. అట్టియుత్కృష్టకావ్యమును అంధుడగు మిల్టను సంవత్సరములకొలది కష్టించి రచించెను. దాని నచ్చువేయించుటకు శక్తిచాలక కాపీరైటువిక్రయింప యత్నించి బేరముకాకపోవుటచే విసికి వేసారి యొట్టకేలకు అయిదుపౌనులకమ్మెను. కష్టించి పనిచేసిన మిల్టను దారిద్ర్యమున జచ్చెను. ఆకావ్యామృతమును చవిచూచి ప్రజలు నేటికిగూడ పరవశులగుచున్నారు.

## ఫిరదౌసీ

పారశీకకవివర్యుడగు ఫిరదౌసీ చరిత్రముగూడ నిట్టిదే. దండయాత్రలచే ప్రసిద్ధికివచ్చిన గజినీమహమ్మదు ఫిరదౌసీకవిని పిలిపించి షానామాయను గ్రంథమును లిఖింపజేసెను. అతనికిత్తునన్న మొత్తమును సుల్తానీయకుండుటచే కవి విరక్తుడై యేలికను నిందించెను. సుల్తానాగ్ర

హించి యతనినిపట్టి చంప ననుజ్ఞయిడెను. కాని ఫిరదౌసీ రహస్యముగ పారిపోయి తనచివరరోజులను దుఃఖపూరితముగ గడపెను. సుల్తాను తనతప్పును గ్రహించి ఫిరదౌసీకి వాగ్దానముచేసిన ధనమునంతను బంపెను. కాని కవి యాసమయముననే మరణించెను. సదుద్దేశములు సకాలమున కార్యరూపమును దాల్చినచో నీ విశాలప్రపంచమున ననుదినము సంభవించు దుఃఖము లెన్ని నివారింపబడగలవో గదా

## జొనాథన్ డెర్వుడ్

మొన్నమొన్ననే చనిపోయినాడు 'జొనాథన్ డెర్వుడ్' అతనిరచనలను మొదటలో లోక మాదరింపలేదు. దారిద్ర్యముచేతను, ఆకలిచేతను, ఆశాభంగముచేతను అతనిశరీరము చివికిపోయెను. ఇపు డతని పుస్తకములకు గిరాకీవచ్చెను. అందువలన నతనిరాబడి హెచ్చినది. కాని ఆడబ్బు అతని కారోగ్యమునుగాని, ఆనందమునుగాని ఈజాలకపోయెను. చదువరులుమాత్ర మనుదినము నానందపూరితు లగుచున్నారు.

## బెర్నార్డుషా మున్నగువారు

నోబెలు బహుమానము నేటేట పేరుగాంచిన కవిపుంగవుల కిచ్చుచున్నారు. ఈ మొత్తము పెద్దదే. కాని ఆకవులు అజ్ఞాతవాసమునబడి కట్టగుడ్డయును, తినదిండియును లేక రచనాకుతూహలాయత్తచిత్తతతో పనిచేసిన కష్టపుదినములలో వారిని దిలకించినవారు లేరు. ప్రజలు మెచ్చుకొని గ్రంథస్వీకారముచే రచయితలను ధనవంతులను జేయునపుడే యీ బహుమాన మీయబడుచున్నది. ఇందుమూలమున వారికి పేరు హెచ్చుటేగాని అవసరములను దీర్చుట జరుగుటలేదు. ఈవిషయమునే ఊది చెప్పుచు జార్జి బెర్నార్డుషా నోబెలు బహుమానము నందుకొన నిరాకరించెను. "నాకు డబ్బవసరమైనపుడు మీరాదరింపలేదు. ఇపుడు మీడబ్బు నాకవసరములేదుగాన మీ బహుమానమును స్వీకరింపజాలను" అని యత డనెను.

అవును. అతనికి నోబెలు బహుమానపు 10,000 ల పౌనులు నేల? అతనికి పుస్తకములవలన సాలునకు 50,000 ల పౌనుల రాబడిగలదు. ఇది ఆంధ్రులకు నమ్మ టకు వీలుగా దోపదేమో! హెచ్. జి. వెల్సుకుకూడ సాలునకు 30,000 పౌనులకు మించినరాబడి గలదట. మొన్నమొన్ననే చనిపోయిన ఎడ్గారువాలేసు కూడ అగణితధనార్జనాపరుడే. థోమస్ హార్డి, సర్ హాల్కేను, మేరీకొరేలీ, ఆర్నాల్డు బెన్నెటు, జాన్ గాల్సువర్దీ మొదలగు నవలారచయితలందరును ఏటేట వేలకొలది పౌనుల నార్జింపగలవారే. కాని వీరందరి జీవితారంభమును సుగమమని యెంచరాదు. ఆర్నాల్డు బెన్నెటు తాను రచించిన (ఇఫ్ వింటర్ కమ్సు) అను నవలను చంకను బెట్టుకొని పెక్కుమంది గ్రంథప్రకాశకుల యొద్దకు గొంపోయెను. వారందరును దానిని ప్రచురింప నిరాకరించిరి. కాని యతడు హతాశుడు గాలేదు. అదే ప్రజ్ఞావంతుని లక్షణము. చివరకతడు నేటి యాంగ్ల నవలారచయితలలో మేటియని ఖ్యాతిగాంచెను.

## చిలకమర్తి లక్ష్మీనరసింహము

ఆంధ్రు లీవిషయమున వెనుకబడియున్నారు. నేటికన్న పాతికసంవత్సరముల క్రిందట తెలుగుకవులకు ప్రోత్సాహ మెక్కువగనుండెడిది. శ్రీయుత చిలకమర్తి లక్ష్మీనృసింహముగారు మొదట రచించిన రామచంద్రవిజయము సాంఘికనవల. శ్రీయుతులు ఆంధ్రభీష్ములగు న్యాపతి సుబ్బారావు పంతులుగారు ఆరోజులలో నవలారచనకు పోటీబహుమానము నేర్పరచిరి. దానికి రామచంద్రవిజయముగూడ బంపబడెను. పరీక్షాధికారులు దాని నుత్తమగ్రంథముగ నెంచి పారితోషికమునిచ్చిరి. కావున శ్రీ లక్ష్మీనృసింహముపంతులుగా రారంభముననే జయపతాకము నెత్తి బయలుదేరిరి. అయినను వీరికిగూడ సాలునకు రు 3000 లకు మించి రాబడి యెప్పుడును లేదు. వారి గయోపాఖ్యానముమాత్రము దాదాపు లక్షప్రతు లమ్ముడుపోయి యుండును. గాల్సువర్దీ, బెరార్డుషా, మేరీకొరేలి మొదలగు వారి గ్రంథములు కోట్లకొలదిగ నమ్ముడువోవుచున్నవన్నచో మనలోగల నీరసభావము వ్యక్తముకాగలదు.

## వీరేశలింగముపంతులు

వీరేశలింగముపంతులుగారు మొదటినుండియు జయపథమున బోయిరి. నేటికిగూడ వారి సంపుటములపై

ప్రతిసాలున రు 1500 లకు తక్కువగాని రాబడియుండును. తిరుపతివెంకటకవులుగూడ పలువురు పాఠకులను సేకరించినారు. వారి భారతనాటకములను తెనుగువారు నిత్యనవత్వముతో పఠించుచున్నారు.

### శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి

వ్యాసభారతము సాంధ్రీకరింప నడుముగట్టినవిఖ్యాత పండితవర్యుడు కవిసార్వభౌముడు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు పదునైదువత్సరములపాటు దరిద్రదేవతతో హోరాహోరీని పెనగులాడవలసి వచ్చెను. ఇది యేయితరదేశములోనైన నగుచో నతడు ప్రభుత్వబిరుదముచే సన్మానింపబడుటేగాక ప్రజలచే బ్రహ్మరథము బట్టించుకొని యుండుననుటలో నత్యుక్తిలేదు. 1920-25 ప్రాంతములలో శాస్త్రిగారు సూర్యచంద్రుల కాటపట్టగు జీర్ణగృహమున పుత్రశోకాతురులై డబ్బుకొరకు తపముకొనుచు చీమవలె నెమ్మదిగ నిశ్చయముగ తనుభాషాంతరీకరణకార్యమును సాగించుట చూచినపుడు వారిపట్టుదలకు, ఓర్మికి నాకచ్చెరువు జనించెడిది. కృష్ణదేవరాయాది మహారాజుల ప్రాపున హేమపాత్రాన్న మారగించిన తెనుగుకన్య శ్రీశాస్త్రిగారి జీర్ణపత్రమున మోటువస్తువులకై చేయిచాచుట వారి పూర్వపుణ్యఫలము.

మంగిపూడి వెంకటశర్మగారుగూడ పేరొందినవారే. కాని రాబడి పేరుకుతగినంతలేదు. ఇటీవల వైద్యము చేయుటగూడ ప్రారంభించిరి.

### మొక్కపాటి నరసింహశాస్త్రి

'బారిష్టరు పార్వతీశము'ను రచించిన మొక్కపాటి నరసింహశాస్త్రిగారు హాస్యరసప్రధానుడు. వీరిగ్రంథము రసపూరితము. కాని ప్రథమభాగము సరిగా నమ్ముడు వోవనందుకు ద్వితీయభాగమును ముద్రించుటకు జంకిరి. చేతిచమురు భాగవతమా! గుణముగల గ్రంథముల నాదరించు చదువరులు లేనపుడు వాఙ్మయ మభివృద్ధి గాంచు టెట్లు?

### పానుగంటి లక్ష్మీనరసింహారావు

కాళ్ళకూరి నారాయణరాయని గ్రంథములకు చలామణిగలిగినది. కాని వాఙ్మయమున వానికిగల విలువ విచార్యము. అవి పామరులను రంజింపగలవిగాన నమ్ముడు వోవుచున్నవి. శ్రీయుత పానుగంటి లక్ష్మీనృసింహారావుగారి నాటకములు మిక్కిలి సమర్థములయ్యును తగినంత యమ్మకమును గలిగియుండలేదు. అయినను వారికిగల రాజాశ్రయముచే కడుపులోనినీరు గదలకుండ గూర్చుని సాక్ష్యుపన్యాసములచే ఆంధ్రావని నలరింపుచున్నారు.

### వడ్డాది సుబ్బారాయుడు మున్నగువారు

వడ్డాది సుబ్బారాయుడుగారు గూడ గ్రంథరచనచే కష్టనష్టము లొందలేదు. వార్ధక్యమును మనశ్శాంతితో గడుపుట కనువగు పరిస్థితులను గలిగించుకొను నవకాశమును తెనుగుపాఠకులు వారికి చాలకాలముక్రిందటనే గల్పించిరి. వారి భక్తచింతామణి దాదాపు నలుబదిపునర్ముద్రణములనొంది వన్నెకెక్కినది.

లలితకవితావిలసితుడగు శ్రీరాయప్రోలు సుబ్బారాయని కావ్యములలో నెద్దియునుగూడ పునర్ముద్రణము నొందినట్లు గన్పింపదు. వేదుల సత్యనారాయణశాస్త్రికి తన పద్యములను పుస్తకరూపమున వెలువరించుటకు ధైర్యమైనను లేకపోయినది. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షము' గాని, 'ఊర్వశి—ప్రవాసము' గాని మొదటిముద్రణపు ప్రతులైనను పూర్తిగ నమ్ముడు వోయినట్లు, గన్పింపదు.

కొందరు తాము రచించిన గ్రంథముల నచ్చొత్తింపలేక—వానిపై పెట్టుబడిడబ్బులైనను వచ్చునను నాశలేక - చమటలోడ్చి రచించిన తమపుస్తకముల నితరులకు సమస్తమైన హక్కులతో నిచ్చివేసి ప్రతిఫలముగ నూరు నూటయేబది ప్రతులను మాత్రము గొనుచున్నారు. ఇది రచయితకు ప్రోత్సాహకరమును గాదు, పాఠకునకు గౌరవప్రదమును గాదు.

తెనుగున పుస్తకరచనమువలన గలుగు రాబడిచే గ్రంథకర్త జీవయాత్ర గడుపగలుగు శుభదినములు వచ్చినగాని ఆంధ్రసారస్వతము సర్వతోముఖమగు వికాసమునొందజాలదు. అట్టి శుభదినము లెపుడు వచ్చునో కదా!

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

చిత్రకారుడు :

శ్రీపాద దుర్గారావు,

రామారావు ఆర్టు సొసైటి.



పాదపూజ

ఉ. ...............దపస్విపదాబ్జయుగంబు మీఁద నీ
లాలకజాలముల్పెరయ నాయలికుంతల మ్రొక్కి...

# పది పెద్ద గ్రంథాలయములు

### ౧ లెనిన్‌గ్రేడ్ గ్రంథాలయము

లెనిన్‌గ్రేడ్ రష్యాదేశపు రాజధాని. జనాభా 16 లక్షలు. ఇచ్చటి గ్రంథభాండారమున 4,832,948 పుస్తకములు ; 331,000 కరపత్రములు గలవు.

### ౨. పారిస్ గ్రంథాలయము.

పారిస్ ఫ్రాన్సుదేశపు రాజధాని. జనాభా 50 లక్షలు. ఇచ్చటి పుస్తకాలయమున 40 లక్షల అచ్చుపుస్తకములు ; 20 వేల చీనాభాషా గ్రంథములు ; 125 వేల వ్రాత పుస్తకములు ; 205,000 ప్రాచీన నాణెములు ; 30 లక్షల శాసనములముద్రలు.

### 3. లండన్ గ్రంథాలయము

లండను ఆంగ్లదేశపురాజధాని. జనాభా 80 లక్షలు. ఇచ్చటి గ్రంథభాండారమున 32 లక్షల అచ్చుపుస్తకములు; 53,650 వ్రాతవి; 85 వేలు ఛార్టులు ; 18 వేలు సీలుముద్రలు; 120 వేల ప్రాచ్యదేశపు అచ్చుపుస్తకములు; 16,400 ప్రాచ్యలిఖితపుస్తకములు.

### ౪. బెర్లిన్ గ్రంథాలయము

బెర్లిన్ జర్మనుదేశపు రాజధాని. జనాభా 40 లక్షలు. ఇచ్చటి గ్రంథాలయమున 2,287,281 అచ్చుపుస్తకములు; 59,147 లిఖితపుస్తకములు; 416,415 గ్రంథకర్తల హస్తములతో వ్రాయబడినవి; 371,821 మాప్‌లు; 210,000 చిత్రపటములు మొదలగునవి.

### ౫. వియన్నా గ్రంథాలయము

వియన్నా అస్ట్రియాదేశపు రాజధాని. జనాభా 1,890,000. ఇచ్చటి గ్రంథాలయమున 1,250,000 పుస్తకములు; ఒకలక్ష కరపత్రములు; 110,000 దేశపటములు; 2 లక్షలు చిత్రపటములు.

### ౬. ఆక్సుఫర్డు : గ్రంథాలయము

ప్రపంచప్రఖ్యాతినందిన విశ్వవిద్యాలయముగల ఆంగ్లదేశపు పట్టణము. ఇచటి పుస్తకాలయమున 1,250 వేల పుస్తకములు 15 లక్షల సారస్వతవిషయకగ్రంథములు; 40 వేల వ్రాతపుస్తకములు గలవు.

### ౭. మాడ్రిడ్ గ్రంథాలయము.

మాడ్రిడ్ స్పెయిన్ దేశపు రాజధాని. జనాభా 825 వేలు. ఇచటి పుస్తకాలయమున 1 210,520 గ్రంథములు; 30,172 వ్రాతవి; 20,470 డాక్యుమెంట్లు.

### ౮. కోపెన్ హేగన్ గ్రంథాలయము

కోపెన్ హేగన్ డెన్మార్కుదేశపు రాజధాని జనాభా 712 వేలు. ఇచటి గ్రంథాలయమున 850 వేల అచ్చుపుస్తకములు; 30 వేల వ్రాత పుస్తకములు గలవు.

### ౯. ఆమ్‌స్టర్‌డామ్ గ్రంథాలయము.

ఆమ్‌స్టర్‌డామ్ హాలెండుదేశపు రాజధాని. జనాభా 760 వేలు. ఇచ్చటిపుస్తకభాండాగారమున 8 లక్షల పుస్తకములుగలవు.

### ౧౦. బ్రుసెల్సు గ్రంథాలయము

బ్రుసెల్సు బెల్జియము రాజధాని. జనాభా 802 వేలు. ఇచటి గ్రంథభాండాగారమున 8 లక్షల పుస్తకములు; 34,610 ప్లానులు; 31,200 వ్రాతవి ; 267,700 ప్రింట్లు ; 54 వేల ప్రాతనాణెములు, ముద్రలు.

# * నేనూ, మా కాంతం

## (గ్రంథవిమర్శనము)

ఆంగ్లనవలారచయితలలో అతిప్రసిద్ధులు థామస్‌హార్డీ 'వెసెక్సు' అను ప్రదేశమును, హాల్‌కెయిన్ తాను పలువత్సరములు నివాసస్థానముగా చేకొనిన 'అయిలెండు ఆఫ్ మాన్' అను ప్రదేశమును తమనవలలలో పెక్కింటికి రంగస్థలములుగా నొనర్చియున్నారు. ఆధునికాంధ్రకథకులలో ఉన్నతస్థానము నాక్రమించుచున్న మునిమాణిక్యం నరసింహారావుగారు 'కాంతం' అను పేరుగల ఒక గృహిణికుటుంబమును తమ రచించిన పెక్కు కథలకు మూలస్తంభముగ నొనర్చిరి.

వా రీనడుమ ప్రచురించిన 'కాంతంకథలు' తెలుగువారికి బాగుగా పరిచయమైయున్నది. ఇపు డీ 'నేనూ. మా కాంతం' ఆంధ్రుల కందింపబడుచున్నది.

ఇందు ఏడుచిన్నకథలు కలవు. అన్నికథలకును కాంతము నాయకురాలని చెప్పుటకు వీలులేదు 'నవ్వటాలకు' అనుకథలో ఆమె చిట్టచివరను కాని మనకు కనిపింపదు. 'సీత మొగుడు' అను కథయందు కాంతము సమీరుడు కథచెప్పుచుండగా వినుచు కథాప్రారంభమున, కథాంతమున ఒకటి రెండు సారులు మాత్రము పెదవివిప్పును. 'సీలికొండలు' అను కథయందు 'కాంతం' మగనికి కమల అను నామెవృత్తాంతము చెప్పుకథకురాలై కానవచ్చుచున్నది. మిగిలిన కథలయందు ఆమె నాయకురాలై ప్రత్యక్షముగనే పాఠకులకు పొడగట్టును.

కాంతము మగనిపేరు వెంకటరావు. ఉద్యోగము ఉపాధ్యాయత్వము. 'మీరు కూడా, కవులు కామాలే?' అని తన భార్య చేత అనిపించుకొన్నవాడు. ఆతని దృష్టిలో ఆమె 'మహా మొండి. సాహసి.' కాబట్టి ఆతడు కాంపొజిషన్ పుస్తకాలు దిద్దుటమాని ఆమెచెప్పుకథ వినును; ఆమె పిలవగా 'ఎందుకు పనిమీదఉన్నా' అనుచునే పోవును; తాను వండమనిన గారెలు వండక కాంతము ఆమె వండ సంకల్పించిన జిలేబీలే వండినను ఆతడు సరిపెట్టుకొనును. 'కులమింటికోతి' అను కథయందు హాస్యచతురుడై కనుపట్టు ఈ వెంకటరావు - నలుగురు పిల్లలతండ్రి - 'ఇంట్లో విరహం' అను కథయందు వట్టి చేదస్తపుమగనివలె చూపట్టును. నాటకమును చూపి సంతానవతియైన తనభార్యకు విరహవేదన నేర్పచూచిన ఈ ఉపాధ్యాయుని ఉపన్యాసమును 'కాంతం బడికుర్రవాడిలాగ' ఊకొట్టినది. భర్తగను, ఉపాధ్యాయుడుగను ఆత డింతటివాడేనా?

వెంకటరావు ఎంతటివాడైనను ఆతని భార్య కాంతం తెలివైనది, చురుకైనది. కావుననే పాఠకులను ఆమె ఎక్కువగ ఆకర్షించుచున్నది. నాటకమును చూపి తనకు విరహవ్యథలో ప్రథమపాఠములు నేర్ప జూచిన మగని విశేషప్రయత్నమును కేవలము

* ఏడు చిన్న కథల సంపుటి. గౌతమీపుత్రగ్రంథమాలలో రెండవపుస్తకము. గ్రంథకర్త మునిమాణిక్యం నరసింహారావు. క్రౌనుసైజున 72 పుటలు. వెల రు. 0-8-0. వలయువారు గ్రంథకర్తపేర హిందూహైస్కూలు బందరు అని వ్రాయునది.

పైత్యముక్రింద జమకట్టి దానికి పిసుగుడుగా అల్లపుపచ్చడిచేసి తినిపించిన ఆమె తెలివి మెచ్చదగినది. సమీరుడు చెప్పినట్లు ఆమె 'దొడ్డ ఇల్లాలు'. పరస్త్రీతో ఏరకపు సంబంధమైనను ఉండుట మగవానికి కూడదని కాంతము అభిప్రాయము. స్త్రీవిషయకమగు కళంకశంక కలుగగా నమ్మకమైన సేవకుడగు రాముని పనిలోనుండి తీసివేయ మగనిని తొందరలు విడిపించినది; అలవాటును కూడ కాదని సమీరుని సంవత్సరాదికి విందుభోజనమునకు ఆహ్వానింపవద్దని శాసించినది. ఇతరుల విషయములోనే ఇట్లుండ ఆమె మగని విషయమున ఇట్టిశంక కలిగినచో ఎట్లుండునో యోజించుకొనుడు. ఈర్ష్యాకషాయితయై 'దీనివిషయమై నిజంఏమిటో మీరు చెపుతారా? నన్ను ఎందులోనన్నా పడి చావమంటారా?' అని ఆమె మగనితో నన్నది. ఆంగ్లమున ఆమెకుగల జ్ఞానము మిడిమిడియే కాని కవిభార్యయగుటచే ఆమె నేటి తెలుగుకవిత్వముతో కొంత పరిచయము కలిగియున్నది. చురుకైన దగుటచే ఆపరిచయమును ఆమె అవకాశము కలిగినపుడెల్ల ఉపయోగింపగలుగునది. నేటి ఏడుపుకవిత్వపుటునికి ఆమెకు తెలియును. 'కిన్నెరసాని గోదావరి కలిసినయ్యే' అని సారస్యముగ అనగలుగు రీతిని నేటి తెలుగు ఖండకావ్యములను ఆమె చదివినది 'మీ యిష్టము, మీయిష్టము' అనుచునే బిడ్డకు తానుచెప్పినపేరు మగనిచే పెట్టించిన గడుసు ఇల్లాలు కాంతము.

ఇన్నివిధముల పాఠకులను ఆకర్షించుచున్న కాంతమునకు ప్రధానమైన ఆకర్షణ ఆమెపిల్లలు. దంపతులకు 'సుతాకారపు ముళ్ళు ముళ్ళె యఖండసుఖోదయమూలకందముల్' అని ఆమెభావన. 'భార్యాభర్తల ప్రేమకు ఉనికిపట్టు సంతానం. వారిఇద్దరి ప్రేమ నశించకుండా నిరంతరం పోషించేది సంతానం.' అని 'కాంతం' నిర్వచనము. పిల్లలను పోషించు శ్రద్ధలో ఆమెకు ఒకనాడైన నాటకముచూడ ముచ్చటపుట్టదు. 'నాకు ఇంట్లో నాటకంచాలు. మనకు వేఱనాటకం ఎందుకు?' ఆమెదృష్టిలో విరహిణి సత్యభామ 'పిల్లా జెల్లా లేని ముండ.' సంతానముపొందని కమల, రామకృష్ణుల దాంపత్యము ఆమె పెదవివిఱుపుకు గురియైనది. 'ఇంతలు నంతలునగు తన సంతానము చంటవెంట సందడిసేయన్' కాంతము మనకు కనిపించు ఈగ్రంథమునందలి తుది రెండు కథలును అతిమనోహరములని చెప్పవచ్చును. 'కులుమింటికోతి' అను కథయందు పిల్లలకొఱకు జిలేబీలువండే కాంతమును, 'నామకరణం' అను కథలో పురిటాలు కాంతమును దర్శింపవలసినదే!

ఈకథలలో మొదటినుండి తుదివఱకు తెలుగుతనము - నేటి మనచిన్నకథలలో చాలవఱకు కానరానిది - నిండారియున్నది. ఇందలి ఒకటిరెండుఘట్టములు అపారమని వేదాంతులు పేర్కొను సంసారమును సారమైనది అనిపింపజాలియున్నవి. గ్రంథకారుని ఉపజ్ఞ విశదముగను, ఉపదేశము విరళముగను ఈకుటుంబవినోదకథలయందు కానవచ్చుచున్నది. ఈకథకుడు తనభావిరచనములయందు ఫొటోగ్రాఫరుకు కొంచము దూరముగను, ఆర్టిస్టుకు మఱికొంత చేరువుగను పోయి 'కాంతం' అను పాత్ర అవలంబనమున ఆంధ్రస్త్రీహృదయమునకు అక్షరరమ్యరూపమును ఇచ్చునుగాక!

—ఆంధ్ర శేషగిరి రావు, బి ఏ,

# గాలివిమానాలు

## తెలుగుదేశం : విమానపుటపా.

గన్నవరంలోను, విశాఖపట్టణంలోను ఆగుతూ మదరాసునుంచి కలకత్తాను, కలకత్తానుంచి మదరాసుకు టపా కొనిపోవడానికి ఇపుడు గాలివిమానాలు ఏర్పడ్డంతో తెలుగుదేశానికి కూడా విమానపు టపా భాగ్యం కలిగింది. 1890-వ సంవత్సరంప్రాంతాలలో రైలు ఇంజనుకూతను కోకిలకూతకంటే అప్యాయంగా వినేవారు తెలుగువారు. ఇపుడు వారికి అదే ఇంజనుకూత గాడిద ఓండ్రకంటె కఠోరంగా ఉంది 1910 ప్రాంతాలలో మోటారునుచూస్తే తెలుగువారు బెల్లమ్ముక్కకు ఈగలు ముసిరినట్లు దానిచుట్టూ మూగేవారు; పడుచు పెళ్ళాం పాలబుగ్గలను నిమిరేజాగ్రత్తతో దానిరంగు రేకులను నిమిరి చూచేవారు. ఇపుడు— కయ్‌బాయ్‌మనే ఆమోటారులను ఆంధ్రదేశంలో మనుషులు పక్కనుంచి తోకఝాడించుకుంటూపోయే కుక్కలకంటె నీచంగా చూస్తూవున్నారు. మనుష్యులుగాక ఎందుకు? ఎర్రబట్టను చూచి బెదిరే ఆంధ్రదేశపు సంతపశువులుకూడా ఇపుడు మోటారుకార్లను ఖాతరుచెయ్యటంలేదు. 1930 ప్రాంతాలలో గాలివిమానపుసవ్వడి కొంచెం వినిపించిందా అంటే గెడ్డంగీసుకొంటూవున్న కాలేజీవిద్యార్థులు, పరిషించి ప్రాణాయామములుగొంటూవున్న పరమబ్రాహ్మణోత్తములు నీళ్ళగదిలో తలంటుకుంటూవున్న పడుచుపిల్లలు, నట్టింటకూర్చుని జడలు అల్లుకుంటూన్న ప్రౌఢస్త్రీలు, వసారాలోకూర్చుని వత్తులుచేసుకుంటూన్న ముసలమ్మలు, సావిట్లో కొత్తగానూరిన పొడుంలో సున్నము, నెయ్యి కలుపుకుంటూఉన్న తాతలు, ఉల్లిపాయపులుసుతో అన్నంతింటూన్న కుఱ్ఱాళ్ళుకూడా ఇల్లు వదలి బయటికివచ్చి ఊర్ధ్వదృష్టులు బఱపేవారు. ఇపుడిపుడు గాలివిమానాలు మనవారికి బాగా పరిచయమగుతున్నాయి. విలాసార్థము విమానాలు ఎక్కిన ఆంధ్రులుకూడా—తగ్గిపోయిన తాలూకాబోర్డు మెంబర్లవలె— చాలామంది లెక్కకొస్తున్నారు. ఒకరిద్దరు తెలుగుదేశపు జమీందార్లకు సొంతగాలివిమానాలుకూడా ఉన్నాయి. కొలదికాలంలో గాలివిమానాలు ఆంధ్రదేశంలో కారులకంటె కనాకష్టమై పోతవని రైళ్ళ, మోటార్ల చరిత్రలనుబట్టి సులభంగాచెప్పవచ్చు.

## పురాణాలలో విమానాలు

కళ్లతో చూడ్డంఅంటే క్రొత్తగా ఉందికాని చెవులతో వినడానికి విమానాలంటే మనవారికి క్రొత్తకాదనే చెప్పాలి. మనపురాణాలలో కావలసినన్ని విమానాలు ఉన్నాయి. పురాణకథలలో విమానాల ఉపయోగము మనపూర్వులు ఎంతవఱకు కొనిపోయినారో తెలుస్తుంది. రావణుడు సీతను విమానంమీదనే ఎత్తుకుపోయినాడు. దమయంతీస్వయంవరానికి ఇంద్రాదిదేవతలు విమానంమీదనే భూలోకానికి వచ్చారు. ఇట్లు స్త్రీలను అపహరించడానికి, స్త్రీలను వరించడానికి మాత్రమేగాక పురాణవ్యక్తులు తమకు ఒండొరులయెడ ఉన్న ప్రేమను గౌరవాన్ని తెలుపుకోడానికి కూడా విమానాలు ఇచ్చి పుచ్చుకోవడాలు వుండేవి. ఇప్పుడు పట్టణాలలోని గొప్పవారు తమయింటికి ఎవరేనా చుట్టాలుగాని, చుట్టాలవంటి స్నేహితులుగాని వస్తే వారికి స్వాగతంచేయడానికి స్టేషనుకు మోటారుకారు పంపినట్లు పూర్వంకూడా గొప్పవారు తమకు నచ్చినవారికి తమవిమానాల్ని పంపుతూ ఉండేవారు. రావణుణ్ణిచంపినతరువాత రాముడ్ని అయోధ్యకు కొనిరావడానికి కుబేరుడు తన పుష్పకవిమానాన్ని పంపాడు. లంకాపురంనుంచి అయోధ్యకు పుష్పకవిమానంమీద పోయేటప్పుడు రాములవారు, సీతామ్మవారు ఇప్పుడు ఆంధ్రదేశంలో విమానాశ్రయస్థానములుగా ఉన్న బళ్ళారి, గన్నవరము, విశాఖపట్టణములలో ఎక్కడేనా ఒకతావున ఆగినారో లేక ఏకాఏకీని వెళ్ళిపోయారో ఆంధ్రచరిత్రపరిశోధకులు ఇంకా నిర్ణయించలేదు. తెలుగుదేశానికి తిరిగి విమానదర్శనము ఇపుడిపుడే కలుగుచున్నది కాబట్టి ఇకముందైనా ఈవిషయమై తీవ్రపరిశో

ధన జరుగుతుందని అనుకుంటాను. సరే దీనికేమి అసలు విషయానికి వద్దాము. భూలోకంలోంచి బొందితో కైలాసానికి తీసుకునిపోవలసిన వ్యక్తులకొఱకు పూర్వకాలపు పుణ్యపురోజులలో దేవతలు విమానాలు పంపేవారు. పోలి అనేఆమె ఇట్లా పంపబడిన విమానంలోనే స్వర్గానికి పోయివుందని మనదేశంలో ముసలమ్మలకుకూడా తెలిసినముచ్చటే. ఇట్లు స్త్రీలను అపహరించడానికి, స్త్రీలను వరించడానికి, ఒండొరులయెడ ప్రేమ గౌరవములను తెలుపుకోవడానికి, కొందఱుమనుష్యుల్ని బొందితో కైలాసానికి తీసుకొనిపోవడానికి మాత్రమేకాక యుద్ధముచేయడానికికూడా పురాణవ్యక్తులు విమానాలను ఉపయోగించియున్నారు. దీనికి నిదర్శనాలు ఎన్నైనా చూపవచ్చు కాబట్టి అసలే మానివేస్తాను.

## విమానాలు : ఇప్పటి ఉపయోగాలు

మొన్నటి భూకంపమప్పుడు కలిగిన నష్టము అంచనాకట్టుటకు విమానాలు ఉపయోగపడ్డ విషయం పత్రికాపాఠకులకు తెలిసేఉంది. నాలుగైదు ఏళ్లక్రిందట అమెరికాదేశంలో నదులుపొంగి కొంతదేశం జలమయం అయింది. పల్లెలచుట్టూ నీళ్లు - మోటార్లు పోవడానికి మోకాలిలోతు బురద. పడవలువెళ్ళడానికి తగినలోతు నీళ్లులేవు. అప్పుడు పాలడబ్బాలు, ఆహారపదార్థాల పొట్లాలు విమానాలమీదుగా పైకితీసుకొనిపోయి పైనుంచే విచ్చలవిడిగా విరజిమ్మేవారు. వరదలమధ్యపడి వనటబొందే క్రింది మనుష్యులు అల్లా పైనుంచిపడ్డ పాలడబ్బాలను, ఆహారపదార్థాలమూట్లను దొరికినన్ని తీసికొనేవారు. మొన్న రంగూనులో ఎలక్షను ప్రచారంలో పైనుండి కరపత్రాలు పడవేయడానికి విమానాలు ఉపయోగింపబడ్డాయి. దున్నినపొలాలలో విత్తనాలు చల్లేటందుకు రష్యాలో విమానాలు ఉపయోగిస్తున్నారు. విమానాల ఈ ఉపయోగాలు ఏవీ పురాణపురుషులకు తెలిసినట్లు కనబడదు. వారు ఎంతసేపు విమానాలను ఎగరడానికిమాత్రమే ఉపయోగించి ఉన్నారని చెప్పవచ్చును. పాలడబ్బాలను పడవైచి క్రిందవారికి సాయపడ్డం - కరపత్రాలురాల్చి క్రిందవారిలో ఎలక్షను ప్రచారంకావించటం-దున్నినపొలాలలో విత్తనాలు చల్లడం - మొదలగు పనులు చేయకపోయినా మరిఒక విధముగానైనా పౌరాణికవైమానికులు క్రిందివారితో సంబంధము పెట్టుకొని ఉండలేదని నిష్కర్షగా నిర్ణయించడానికి జంకవలసిన అవసరంఏమీ లేదు. కాని ఈనిర్ణయానికి ఒకటి, రెండు మినహాయింపులుమాత్రం ఉన్నాయని కొందరు అనవచ్చు. పౌరాణికవైమానికులలో ఒకడైన గయుడు తనవిమానాన్ని కృష్ణుడి అర్ఘ్యంపట్టిన చేతిలో ఉమ్మివేయడానికి ఉపయోగించినమాట నిజమే. కాని గయుడు తెలిసి తన విమానాన్ని బుద్ధిపూర్వకంగా అందుకు ఉపయోగించలేదు. కేవలం అది ప్రమాదవశాత్తు జరిగింది. కాబట్టి మన నిర్ణయానికి ఈమినహాయింపు ఏమాత్రమున్నూ అడ్డు రాలేదు. మనుష్యుల్ని బొందితో కైలాసంకొనిపోవడానికి విమానాలు రావడంలో క్రిందివారితో సంబంధంఉండితీరాలి. కాని అవి రావడంవల్ల కొందఱు వ్యక్తులకు క్రిందివారితో అసలే సంబంధంలేకుండాపోయింది. తమ శవాల్నైనా క్రిందివారికి వదలకపోవడంచేత—అందుచే పౌరాణికవైమానికులు క్రిందివారితో సంబంధం పెట్టుకొనిఉండలేదనటం ఎట్టి మినహాయింపులు గాని లేనిమాట. విమానాలను పలురీతులగాను, క్రొత్త రీతులగాను ఉపయోగించడంలో నేటివారు పురాణపురుషులను తలతన్నినారని చెప్పవలసిఉంది.

## నేటివిమానాలు మోసే వింతసామగ్రి

ఉపయోగింపబడే రీతిలోనేగాక మోసేసామగ్రిలోకూడా పూర్వపు విమానాలకి ఇప్పటి విమానాలికి చాలాతేడా కనిపిస్తోంది. పూర్వపు విమానాలు స్త్రీపురుషులకు అన్యమైన వస్తువులను మోసి యెరగవు. ఆకాశంలో టపటపలాడ్డమేకాని పూర్వపు విమానలకు ఇప్పటి విమానాలవలె టపాలుమోయవలసిన యోగం లేదు. కలికాలమహిమచేత కాబోలు ఇప్పటి విమానాలకు టపామోయటంతో తీరడంలేదు. కోతుల్ని, నత్తల్ని, ఈగల్ని, ఎండ్రకాయల్ని, ఆవుల్ని, కోళ్లని, ఒంటెల్ని, కుక్కల్ని, పందుల్నికూడా నేటివిమానాలు మోయవలసివస్తూంది. ఎండ్రకాయలు చెడిపోకుండా ప్రత్యేకమైన తొట్లలో పెట్టబడి వివిధదేశాలికి కాలం

కూడివచ్చేటందుకు గాలివిమానాలమీద పంపబడుతూ ఉన్నవి. దిగుమతిఅయినతోటే వంటపాత్రలోకెక్కి ఉడకబెట్టబడనున్న ఈ ఎండ్రకాయలు గాలివిమానాలలో ఉన్నంతసేపు అగ్నిప్రమాదాలకు, భూపతనప్రమాదాలకు లోనుగాకుండా ఉండుటకు ఇన్సూరుచేయబడుతూ ఉండడం విచిత్రమైందే. ఎల్లాలేదన్నా ఏడాదికి ప్రపంచమంతటి అన్ని గాలివిమానాలలోను ఇరవై లక్షల నత్తలు మానవుని ఉపయోగార్థం ప్రయాణం చేస్తున్నాయని షుమారీయులు కొందరు మదింపు వేసి ఉన్నారు. హిందూదేశంలో ఉన్న యూరపియన్లకొరకు ఈ దేశంలో దొరకని కూరలుకూడా గాలివిమానాలు మోసుకొస్తూఉన్నాయి. విమానాలలో ఒకదేశంనుండి మరిఒకదేశానికి తేనెటీగల్ని పంపడం ఇప్పుడు బాగా ఆచారమైఉంది. క్రాయిడన్ నందలి విమానాశ్రయస్థానమునకు ఈమధ్య ఓవర్‌కోటు తొడుక్కున్న వికృతమానవస్వరూపం ఒకటి ప్యాసెంజరు టిక్కెట్టుతో వచ్చింది. దాన్నిచూచి అచటి బుక్కింగుక్లార్కు కాగితంమీదకలంపెట్టి ఎరుగని సంపాదకుడి తీండ్రింపులతోను, ఆదరణపొందని క్రొత్త వ్యాసకర్తల తిట్లతోను, అక్షరాభ్యాసానికినోచని కంపోజిటర్లు అనుగ్రహించిన ప్రూఫులతోను నలిగి చివికిన ఒకసహాయ సంపాదకుడో—లేక షష్టిఘటియలు లైబ్రెరీలో పుస్తకాలతో కుమ్ములాడ్డంలో నవకంగోల్పోయిన కాలేజీ ప్రొఫెసరో-లేక దీపం నిద్రపోయినా తాను నిద్రపోక రాగిరేకులలోపడి కొట్టుకొనే ప్రాచ్యదేశపు శాసన పరిశోధకుడో అనుకున్నాడు. కాని దగ్గరకుపోయి చూచునగదా ఆస్వరూపం లండను జంతుప్రదర్శనశాలలో క్రొత్తగా చేర్చుకోబడడానికి వచ్చిన 'చింపాంజీ' అను ఒకజాతికోతి అని తేలింది. ప్రూఫులు దిద్దుకుంటూకూడా తన బొంగురు గొంతుకతో కూనురాగాలు తీసే ఒకానొక సచిత్రమాసపత్రిక సంపాదకుడిలాగ అప్పుడాబుక్కింగు క్లార్కుకూడ 'వందనంబు వందనంబు వానరేంద్ర!' అని కూనురాగంతీసి ఉంటాడు.

## విమానాలలో జరిగిన కొన్ని విడ్డూరాలు.

ఒకసారి ఒకడు ఉబలాటంపుట్టి కోడిపెట్టను విమానంఎక్కించాడు. విమానంఎగరడం ప్రారంభించింది. విమానం ఎక్కించినందుకు తనకృతజ్ఞత క్రియారూపకంగా తెలపడానికో ఏమొ ఆకోడిపెట్ట ఆవిమానంలోనే గుడ్డును పెట్టింది. విమానంలో కోడిగుడ్డుపెట్టిందనే ఈసమాచారం ఆమధ్య మనదేశంలో విమానంలో జరిగిన అట్లాంటిదే మరిఒక సంగతిని జ్ఞాపకంచేస్తోంది. పదేళ్ళక్రితం రాజమండ్రికి రెండువిమానాలు వచ్చి గోదావరిమధ్యను తిప్పలమీద విడిసాయి. పదిరూపాయిలు ఇస్తే మనిషిని ఎక్కించుకొని ఒకసారి ఊరిమీద ఎగిరించేవారు. డబ్బుగల పాలకొల్లు షావుకారొకడు ధైర్యంచేసి ఎక్కాడు. ఎక్కేటప్పుడున్న ధైర్యం విమానంఎగరడం ప్రారంభించేసరికి పాపం షావుకారికి జారిపోయి లోజార్లు ప్రారంభించాయి. విమానం బాగా బహిఃప్రదేశంలోకి వెళ్ళేసరికి షావుకారుగారికి బహిర్దేశం అయిపోయింది. విమానంలో ఒకపక్షి గుడ్డుపెట్టింది! ఒకపురుషుడు ఇంతపనిచేసి తనపురుషకారాన్ని చూపాడు! ఒక పాశ్చాత్యస్త్రీ గాలివిమానం ఎగురుతూంటే అందులో నీళ్ళాడింది. గాలివిమానంలోపుట్టిన శిశువులలో మొదటిదైన ఆశిశువుకు ప్రపంచం పదిదిక్కులనుండి ఆశీర్వచనపరంపరలు వచ్చాయి. దేనికో ఓ,దానికి మొదటివాడు అవడంవల్ల ఇట్టి ఆశీర్వచనాలు రావడం నేటినాగరికతలక్షణం.

## విమానాలు : పక్షులు

ఇంతవఱకు ఆకాశం పక్షులరాజ్యంగా ఉంది. ఆ రాజ్యాన్ని వాటిని సుఖంగా అనుభవించనీయకుండా ఇప్పుడు ఈ గాలివిమానాలు వచ్చాయి. కాబట్టే పక్షులు విమానాల్ని అసూయాదృష్టులతో చూస్తున్నాయి. ఒక శీతాకాలంలో ఆస్ట్రియా, స్విట్జర్లాండులనుండి వేడిప్రదేశాలకు వలసపోతూ పిచికలు కొన్ని చలిచే ఒకచోట పడిపోగా ఓ,గాలివిమానం వాటిని తన మీద ఎక్కించుకుని దూరదేశంలో విడిచిపెట్టింది. పక్షులకు ఈ విధంగాకాని, మరోవిధంగాకాని సాయపడిన గాలివిమానాలు మరేమియెన్నీ లేవు. పక్షిలోకానికి మొత్తంమీద అవి ఎక్కువ హానినే చేస్తున్నాయి అని చెప్పాలి. పైన గాలివిమానం ఎగురుతున్నదా

అంటే కింద చిన్నపక్షులు కిక్కురుమనకుండా ఉంటాయి. ఒకదేశంలో కాకులు సస్యాలను నాశనంచేస్తుండగా రైతులు వాటినిచంపడానికి ప్రయత్నాలు సాగించారు. ఒకచెట్టుమీద కాకులుకూడి ఉన్నాయి. అదే సమయంలో అచెట్టుకుపైన గాలివిమానాన్ని తిప్పే ఏర్పాటు చేశారు. భయంతో గజగజలాడిపోతూ ఒక్కపిట్టకూడా రెక్క విదల్పలేదు. కీలెఱిగి వాతపెట్ట నేర్చిన ఆరైతులు క్రిందనుంచి తుపాకిగుండ్లతో అప్పుడు ఆ పిట్టలనుపేల్చి చంపారు.

పక్షుల ఇట్టి నాశనానికి హేతుభూతాలు కావడంచేతనే పక్షులనుప్రజలను రాజులగు రాంబందులు—ప్రజారక్షణ రాజులకు పరమధర్మం కాబట్టి—వీలైనపుడల్లా గాలివిమానాల్ని డీకొంటూఉన్నాయి. పారిస్‌నుంచి స్పెయిన్‌లోని మాడ్రిడ్‌కు **1911**-వ సంవత్సరంలో గాలివిమానపు పందాలు జరిగాయి. ఆ పందెపుగాలివిమానాల్లో ఒకదాన్ని రాంబందొకటి ఎదుర్కొంది. ఆవిమానచోదకుడు తెలివైన వాడవడంచేత ఉబ్బెత్తుగ క్రిందికిమీదికి విమానాన్ని ఉయ్యాలఊపి ఆరాంబందుని వానాలప్పతిప్పించి గడుసుతనంగా తప్పించుకుని ఈవతల పడ్డాడు. ఆరాంబందు ఆనాడు ఇంటికిపోయి తనబంధుజనులతో తమ ఆకాశరాజ్యంమీద పేరులేని ఒక పెద్ద శత్రురాజు దండెత్తివచ్చేడని, ఆతన్ని తాను ఎదుర్కొని హోరాహోరీగా పోట్లాడానని, తనతో అతడు పోట్లాడలేక తోకముడిచి దక్షిణానికి పోయినాడని చెప్పి ఉంటుంది. సాధారణంగా రాంబందులు విమానాల్ని ఎదటబడే ఎదిరిస్తాయి. కాని జర్మనీదేశపు రాంబందు ఒకటి తాను అన్నిటికంటె ఎక్కువ తెలివిగలదాన్నని అనుకుని అహంభావంతో విమానాన్ని వెనుకవైపునుంచి డీకొంది. ఇట్లు యుద్ధప్రక్రియమార్చడంలో ఈ పక్షియోధుడు పొరపడ్డాడనే చెప్పాలి. ఏమంటే తెగిపోయిన ముక్కుతో అతడు భూమిమీద పడ్డాడు.

గాలివిమానాలంటే ఈ పక్షులకు కిట్టకపోవడం ఈనాటిదికాదు. రామాయణకాలంనుంచి వస్తోంది. సీతను ఎత్తుకొనిపోయే రావణాసురుడి విమానాన్ని జటాయువు అనేపక్షి ఎదిర్చింది. అపక్షి విమానాలంటే తనకుగల ద్వేషంచేతనే అప్పుడాయుద్ధానికి దొరకొందిగాని కేవలం రాముడిమీద ప్రేమచేతగాని సీత ఏడుపు విని కాని కాదని చెప్పాలి. అసలుకారణం కప్పిపెట్టి కవి కావడంచేత వాల్మీకి తనకు మల్లేనే తానుసృష్టించిన రాముడంటే జటాయువుకు కూడా అభిమానం ఉందని చెప్పేడు. వివేచనాజ్ఞానం బాగాప్రబలిన ఈదినాల్లో వాల్మీకిచేసిన మోసం వెల్లడైపోకమానదు. నిజం నిలకడమీద తేలుతుందిగదా!

## విమానాలు: జంతువులు

జంతువులవిషయంలోకూడా విమానాలు దౌర్జన్యంగానే ఉన్నాయని చెప్పాలి. అజ్ఞాతఖండమని పేరుపొందిన ఆఫ్రికా ఖండపు ఘోరారణ్యములమధ్యను ఉన్న సింహాల్ని వేటాడ్డానికి వాయువిమానాలు ఉపయోగింపబడ్డాయి. ప్రభుత్వంవారు నిషేధించారుగాని లేకపోతే ఈ సరికి పక్షిరాజ్యాన్ని ఆక్రమించిన ఈ విమానాలు ఆఫ్రికాఖండమునందలి మృగరాజుల్ని అందరినీ మారణహోమంచేసి ఉండును. ఎగిరే గాలివిమానాల చప్పుడికి గుర్రాలు బెదిరిన నిదర్శనాలు చాలా ఉన్నాయి. డబ్లిన్‌లో ఒకసారి గాలివిమానంవచ్చి ప్రక్కను వాలడంచేత బెదిరిన ఒక నల్లగుర్రం నల్లతోక వెంట్రుకలన్నీ హఠాత్తుగ తెల్లపడిపోయినాయి. ఇట్టి అశ్వవిమానసంఘటనములందు ఒకొక్కప్పుడు గుర్రాలిదికూడా పైచెయ్యి అవడంకద్దు. ఒకపొలంలో ఒకసారి ఒక వాయువిమానం విడిసిఉంది. అశ్వరత్నమొకటి దాన్నిచూచింది. నెమ్మదిగా సమీపించింది. గాలివిమానపు తోకగుడ్డమీద వెనకకాళ్ళతో సత్తువ కొద్దీ తన్నింది. సరదాగా ఉండడంచేత కాబోలు అట్లే మరికొంతసేపు జిమ్నాస్టిక్సుచేసింది. గుడ్డతో చేయబడిన వాయువిమానపుతోక ఊడివచ్చింది. ఇక కాళ్ళు పనిచేయకపోవడం మూలాన్ని—కొట్టలేక తిట్టినట్లు—ఆ గుడ్డను నమిలివేయడానికి ప్రారంభించింది. ఒకవిమానం వచ్చివ్రాలి తనజాతికిచెందిన ఒకగుర్రం నల్లతోకవెంట్రుకలు తెల్లబడచినందుకు కసితీరేటట్లు ఈగుఱ్ఱం ఒక గాలివిమానంతోకని ఎగిరి తన్ని ఊడలాగి గుటకాయిస్వాహాచేసింది. జాత్యభిమానం అంటే ఇల్లాఉండాలి.

## గాలివిమానాలు: ఆంధ్రుల ప్రస్తుతకర్తవ్యం

ఒకగుఱ్ఱం గాలివిమానాన్ని తన్నింది, ఒకపక్షి ముక్కుతో పొడిచింది, పూర్వులకు విమానాల పూర్తిఉపయోగం తెలియదు మొదలగువిషయాలు ఎన్ని తెలుసుకున్నా ఆంధ్రులు గాలివిమానాల విషయంలో తమ ప్రస్తుతకర్తవ్యం తెలిసికొని పనిచేస్తేనేగాని తోడిసోదరలోకంలో అపహాసపాత్రమవుతారు. దొరలను చూడండి—విమానాలను ఎంతగా ఉపయోగిస్తున్నారో. ఆఫ్రికాఅడవులలో మోటారుకారుమీద ఆ మధ్య ప్రయాణంచేస్తూ కారుయంత్రంలో ఏదో విరిగిపోగా ఐదువేళ మైళ్ళదూరంలో ఉన్న లండనుకంపెనీకి కేబిల్ చేసి గాలివిమానంమీద ఆపార్టును తెప్పించుకున్నారు. ఏదైన ఒక క్రొత్తవిషయమై ఉత్సాహంతో పనిచేయడానికి మన ఆంధ్రులతరువాతనే మరి ఒకరనేపేరు మనకు ఈవఱకువచ్చి ఉంది. ఈ విషయంలోకూడా ఆ పేరు నిలుపుకోవాలి. నిలుపుకొంటారనే సూచనలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 10 వ తేదీని మొట్టమొదటి మద్రాసు కలకత్తా రహదారీటపావిమానము గన్నవరంలో దింపినవి 74 ఉత్తరాలే అయినా పైకొన్నవి 128 ఉత్తరాలదాకా ఉన్నాయని పత్రికలలో తెలుపబడ్డది. ఇది శుభసూచన. అయితే విమానపు టపాలో ఎక్కువ ఉత్తరాలు వెయ్యడంతో తృప్తిపడకూడదు. విశాఖపట్టణంజిల్లాలో పేరుమోసిన రేగగ్రామపు పెరుగులోటకూరను, తూర్పుగోదావరిజిల్లాలో ప్రసిద్ధికెక్కిన పెద్దాపురపు మట్టుబచ్చలికూరను, పశ్చిమగోదావరిజిల్లా తణుకుతాలూకాలో ఖ్యాతిగాంచిన కొత్తిమిరిని, కృష్ణాజిల్లాలో వినుతినొందిన కర్పూరపు వంకాయలను, గుంటూరుజిల్లాలో ఖ్యాతిపొందిన గోంగూరను ఏనాటికానాడు గాలివిమానాల్లో మద్రాసు కలకత్తాలకు రవాణాచేసి ఆంధ్రులవ్యాపారనైపుణ్యాన్ని బాగా ప్రదర్శించాలి. గన్నవరంప్రాంతాల్లో ప్రొద్దుట పిండినపాలు ఏనాటికానాడు మదరాసులో ఉదయపు కాఫీకి సరఫరాచేయుటకు వీళ్ళు ఎంతవఱకుగలవో పరిశీలించవలసిఉంది. ముఖ్యంగా ఈ గాలి విమానాలవల్ల తెనుగు దేశస్థులలో చాలామందిని బాధిస్తూఉన్న సమస్యఒకటి తీరుటకు అవకాశంఉందని అనుకుంటాను. మనదేశంలో విశేషంగా పొగాకుపండుతున్నా దాన్ని కమ్మటినశ్యంగా చేయగలనేర్పు మనలోఎవరికీ పట్టుబడలేదు. ఇపుడు మద్రాసునుంచే మనకు నశ్యంరావలసి ఉంటూంది. కాని ఆరావడంలో కొన్నిరోజులకాలము గడిచిపోవుటచే ఆనశ్యం తన కమ్మదనాన్ని కొంత, ఘాటునికొంత, సువాసన్నికొంత గోల్పోతూ ఉంది. దీన్ని తప్పించుకోటానికని కొందఱు ఆంధ్రదేశపు పెద్దలు ఆయా పట్టణాలకు మదరాసునుంచి పొడుంచేసేవాళ్ళని రప్పించి తమపట్టణాల్లో స్థిరవసతులు కల్పించారు. ఇట్లా కేవలం పొడుంచేయడంకోసం మదరాసునుంచి వచ్చినవాళ్ళు ఒక్క హైస్కూలు మాత్రంఉన్న మాతెనాలిలోనే ఇద్దరున్నారు. హైస్కూళ్ళుకాక రెండు మూడు కాలేజీలుకల విశాఖపట్టణం, రాజమండ్రి, బందరు, గుంటూరు మొదలైన తావుల్లో ఇట్టివారు ఎందరెందరున్నారో! పొడుంచేసుకోలేక ఇతర ప్రదేశాలనుంచి మనుష్యుల్ని తెప్పించుకుంటున్నారంటే సాటివారిలో ఆంధ్రుల కెంతనామోషీ? అదీకాక పొడుంకోసం—పాలకోసం రాయమోసినట్లు—దాన్ని తయారుచేసే మనుషుల్నికూడా మనం ఎందుకు ఇల్లిచ్చి, వాకలిచ్చి పోషించడం? విధిలేక ఇన్నాళ్లు వాళ్ళని ఉంచుకున్నాము. ఇక మద్రాసునుంచే మనం గాలివిమానాల్లో సేరుగా పొడుం తెప్పించుకోవచ్చు. మదరాసులో తయారుచేయబడిన ఒకటి రెండు గంటల్లోనే ఆపొడుం మనకు అందుతుంది గనక అప్పుడు కాచిన ఆవునేతి కమ్మదనంవంటి దానికమ్మదనం, బాగావిచ్చిన తరువాత కోయబడిన సంపంగిపువ్వుల పరిమళంవంటిదాని పరిమళం, మినపబద్దలు హెచ్చు పాలుగల కొద్ది మిరపకాయల తాళింపుఘాటువంటి దాని ఘాటు చెక్కుచెదరకుండా వుంటాయి. కాబట్టి క్రొత్తసంవత్సరాది నాటినుంచి గాలివిమానాల్లో మదరాసు నశ్యం విరివిగా దిగుమతిచేసే ఏర్పాట్లు చేసుకోవడం వాంఛనీయమని మనవిచేస్తున్నాను. భావసంవత్సరప్రభావం ఈవిషయంలో ఆంధ్రులకు నసాళమంటునుగాక!

—ఎ. శేషాచలపతి, బి. ఏ.

# సంసారము

౧

కాపరానికి వచ్చిన క్రొత్తలో.

'ఇదిగో తాంబూళం'

'..................'

'నింపాదిగా వేసుకువెళ్ళుదురూ'

'పదిమ్ముప్పావు అయింది, కమలా !'

'ఒక్క అయిదునిముషాలు వుందురూ'

భార్య అందించుచుండగా గిరి ఒకటి తరువాత ఒకటి నమలుచూ 'అప్పుడే నెల రోజు లైంది. నిన్నవచ్చినట్లు వుందికదూ?'

'అవును. నిముషాలలాగ వెళ్ళిపోతున్నాయి రోజులు. ఆఫీసే లేకపోతే ఎలాగ వుండునో ?'

'సాయింత్రము నేను వచ్చేదాక మా చెడ్డ కష్టంగావుంటుందనుకొంటాను నీకు.'

'అసలు వస్తారా అనిపిస్తుంది—లేచారేమిటి?. అయిదునిముషాలు అయిపోయాయా? ఉండండి. ఫ్లాస్కులో యింకా కాస్త కాఫీ పోసియిస్తాను.'

'చాల్లెద్దూ. వేళయిందిమరి.'

'టిఫిన్ కారియరు సైకిలుకు కట్టినాను. ఏకత్రొంద రయిపోయింది. బాగుంటుందో లేదో ?'

'బాగుండక పోవటము కూడానా?'

'ఒక్కక్షణము వుండండి. నేనుకూడా గేటువరకూ వస్తాను.'

'రా, మరి.'

గేటుదగ్గిర సైకిలుఎక్కిపోవుచూ మాటిమాటికి వెనుకకుతిరిగి చెయ్యి ఆడించుచూ మలుపుతిరిగి వెళ్ళిపోయెను. కమల ఆతడు అదృశ్యుడగువరకూ చూచుచూ, కన్నులలో నిలచిన రెండు అశ్రుబిందువులను పమిటితో తుడిచికొని సూర్యాస్తమయమునకై వేచియుండెను.

౨

పిల్లలుపుట్టినతరువాత

'ష్,... ...ఇదిగో ...ఓసేయి... మాట.'

'ఎందుకండీ!'

'పదిమ్ముప్పావు అయింది తెలునునా ?'

'అయితే'

'పంచ ఏదీ'

'అదేం. ఎదురుగుండా పెట్టుకొని'

'ఇది కట్టుకుపోనా?'

'దాని కేమండీ?'

'మొఖంతుడుచుకోటానికి ముక్కుతుడుచుకోటానికి నాపంచలే కావాలి కాబోలు అందటికి ?'

'ఇప్పు డెవరు ముట్టుకున్నారు ఈపంచ?'

'యిదేమిటిది ?'

'కిష్టడు జిడ్డుచెయ్యి దీనికి తుడిచాడు కాబోలు !'

'యింకొకటి తెచ్చిపెట్టటము వుందా ? లేదా ?'

'కాస్త చూసుకొందురూ, చిట్టిని అన్నానికి కూర్చోపెట్టి వచ్చాను. విస్తరిలో కాలు పెట్టుతుంది.'

'ఆఫీసుకువెళ్ళేటప్పుడే వస్తాయి అన్ని పనులూ నీకు.'

'యిప్పుడేమిచెయ్యాలేమిటి నేను?'

'పెట్టెతీసి పంచతీసి యివ్వాలి.'

'అంటుచెయ్యి. కొత్త పెట్టెమూతతీసి తీసుకోలేరు'

గిరి పెట్టె తెరచెను. అందు చీరలు, జాకెట్లు, పిల్లల చొక్కాలు, అక్కడక్కడ తన పాతకోట్లు కనిపించెను.

'అలా కలిపెయ్యకండి. పంచ లేదు కాబోలు.'

చటాలున లేచి గిరి భార్యబుగ్గ పట్టుకొనెను.

'వూరుకొందురూ. ఏదో ఒకదానికి ఎప్పుడూ కోపమే.'

గిరి కోటుతొడుగుకొంటూ 'ఎలాగవుందో యిల్లు. సాయంత్రానికి సర్ది వుంచు.'

'అలాగే లెండి. తలుపు వేసుకు వెళ్ళండి.'

...తలుపుదభాలునమూసిన చప్పుడయ్యెను.

## ౩

### ముసలితనములో

'ఏమేవు - నీకు జ్ఞాపకమువుందా మన పెళ్ళి?'

'సరిసరి. అది జ్ఞాపకమువుండక పోవాలి. రేపటికి సరిగ్గా 50 ఏండ్లవుతుంది.'

'అప్పుడెలాగవుండేదాన వనుకొన్నావు?'

'ఎలాగవుండేదాన్ని?' అని దగ్గరకు జరుగును.

'చక్కగబొమ్మ. సుఖమంటే అదీ సుఖము. ఒకరోజైనా పోట్లాడుకొన్నామా?'

'చలిగాలి వేస్తూంది. పైబొత్తాముకూడా పెట్టుకోండి' గిరి గుండీపెట్టుకొనబోగా వ్రేళ్ళు వణకును. భార్య పెట్టును.

'యాభై ఏళ్ళు - యాభై నిముషాలుకదా. ఒకరోజైనా ఎందుకొచ్చిన పెళ్ళాముురా అని అనుకోలేదు.'

'ఆ ఎర్రఫ్లేనలు గుడ్డ ఏదీ- దానిమీద కూర్చున్నారా. చెవులకు చలిగాలి తగులుతుంది'

కమల ఫ్లేనలుగుడ్డ తలకు కట్టెను. గిరి ఆమెచేతులను తడుముచూ, మెల్లిగా, గొణుగుచూ, 'యాభై ఏళ్ళు -ఒకటికాదు. రెండు కాదు. యాభై ఏళ్ళు. ఒకనాడైనా విచారించ లేదు కదా.'

'జాగ్రత్తనుమండీ. వెలుతురువుండగానే తిరిగిరండి పశువులువచ్చే సమయము కూడాను. బంగాళాదగ్గిర రోడ్డు బాగుచేస్తున్నారు. రాళ్ళు అవి వుంటాయి. చూసుకొంటూ వెళ్లండి...(గేటుదగ్గిర) మీరు వచ్చేదాక యిక్కడే వుంటాను.'

—ఇరువంటి విష్ణురావు, బి.ఏ.,బి.ఎల్.



మ. "పటసమ్మార్జనగీత...ప్రహ్లోనశబ్దంబు లొక్కట నోరన్వెడలంగ బట్టలుతుకన్..."

# సినీవాలి

## ౧

'నాథా!...

నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళిపోతారా...మీరు! మన వివాహవేళ,—మాతండ్రి జనకరాజు మీచేతిలో చేయి వేసి నన్ను ఎప్పుడూ ఎడబాయవద్దని తోడునీడగా మెలగమని అప్పగించలేదూ? అవిఅన్నీ మరచిపోతారా? పోనీ; మన చిన్ననాటి చెలిమినైనా...'

... ... ...

సత్యానికి, ఏవో వెనుకటివన్నీ తలపువచ్చి ఉలిక్కి-పడ్డాడు. కాని అంతలో మళ్ళీ తెలివితెచ్చుకుని తన తొట్రుపాటును ఎవరన్నా గమనించారేమోనని అటూ ఇటూ చూశాడు.

...నాటకం నడిచిపోతూన్నది. సీత, రాముని అనేకవిధాల బ్రతిమాలుకుంటూంది, తన్నుకూడా వెంట అడవికి రానీయమని మధ్యమధ్య ఆ రఘుకులతిలకుడు, ఆ అమ్మాయి మాటలకు అడ్డువస్తూ పాటలతోనూ, పద్యాలతోనూ, రావడానికి వీలులేదని, ఉన్న సాధక బాధకాలన్నీ వివరించి చెపుతున్నాడు. ప్రేక్షక మహాశయులందరూ, ఎవరికి వీలయినపోజులో వారు కూర్చుని,—నాటకం చూస్తున్నారు.

—మనసంతా చెదిరిపోయింది; లేచి వెళ్ళిపోదామనుకున్నాడు. లేవబోయినాడు; మళ్ళీ, ఏమనుకున్నాడో, ఏమో, కూర్చుని, జేబులోనుంచి కేసు వెదకి తీసుకుని, సావకాశంగా సిగరెట్టు ముట్టించాడు. కూర్చుని, అలాగే నాటకం చూస్తున్నాడు. కాని ఏమీ తెలియడంలేదు ఏమో అంతా అయోమయంగా ఉన్నది.

'డ్రింక్ తీసుకోరూ?'

సత్యం చప్పున తెలివితెచ్చుకుని ప్రక్కకు తిరిగి చూశాడు. మంజరి నవ్వుమొగంతో అతన్ని పలుకరిస్తూంది. అతడు ఏమీ అర్థంకాక, ఆమె చేతిలో గ్లాసు వంక,...తరువాత నెమ్మదిగా తలఎత్తుతూ చివరకి ఆమెవంక తేరిపార జూశాడు. మంజరి సాభిప్రాయంగా ఆతన్ని వీక్షిస్తూన్నది. సత్యం ఆచూపుకు నిలువలేక తల తిప్పేసుకున్నాడు.

'కొంచెంసేపు బయట తిరిగివద్దాము రారూ?'

నాటకం అతనికి తెలియకుండానే సగం అయిపోయింది. ఇంటర్‌వల్‌లో, అందరూ, బయటికి వచ్చేస్తున్నారు. తమిళసోదరులందరూ, ఆ అవకాశాన్ని వ్యర్థం చేయకుండా, పొందానులు బయటికితీసి కరువుదీరా, కసితీరా వెత్తిల్‌కన్యలకు దంతక్షతాలు చేస్తున్నారు.

మంజరి లేచినిలుచున్నది. సత్యంరానని తలతిప్పాడు.

'రారూ అబ్బ! మళ్ళీ ఇప్పుడే వద్దాంకాదూ. నాకు చాక్‌లెట్‌లు కావాలి'- సత్యం ఆమెమాటకు జవాబు చెప్పకుండానే అక్కడ తిరుగుతూన్న ఒకపిల్లవాడిని పిలిచి వానిచేత కావాలిసినవి తెప్పించి ఆమెకు ఇప్పించాడు. తానుమళ్ళీ తన ఆలోచనలోపడి పోయినాడు. మంజరిమాటే మరచిపోయినాడు. ఆమె అక్కడకూర్చున్నదో లేదో, అధ్యాసేలేదు అతనికి.

ఎంతసేపు నాటకమాడారో, ఎప్పుడు అయిపోయిందో సత్యానికి తెలియనే తెలియదు. మంజరి అతన్ని బలవంతాన మేలుకొలిపి బయటికి తీసుకువచ్చింది.

అప్పటికప్పుడే చాలామందివెళ్ళిపోయినారు. సత్యం తిన్నగా తలవంచుకుని నిదురమబ్బుతోనే, మంజరివెంట వచ్చేశాడు. ఒకరిద్దరు ఎవరో పలుకరించినా వినిపించుకోలేదు. వారివంక చూడనైనాలేదు ఏలాగో బయట పడి కారులో ఎక్కికూర్చున్నాడు మంజరి తనంతతానే ఎక్కి అతని సరసనుకూర్చున్నది.

'నిద్రా? అప్పుడే.'

మంజరి అతనికి దగ్గరగాజరిగి ఆనుకుని కూర్చున్నది-చాలా దగ్గరగా.

సత్యం ఏమీ జవాబు చెప్పకుండా కొంచెంమసిలి మళ్ళీయథాప్రకారం మౌనముద్ర వహించాడు.

'ఎందుకూ మాట్లాడరు? కోపమా....'

సత్యం బలవంతాన మెలుకువ తెప్పించుకుని మనసు

లో చేతనంతా మాటుమడచుకుంటూ చిరునవ్వుతో 'కోపమా నీమీద' అని మంజరిని మరీదగ్గరకు లాగుకున్నాడు. ఆమె ప్రసన్నవదనంతో తన బాహులతను అతనికి పెనవేసి మోవి అందించింది.

'చూడండి ఎంత వెన్నెలగా ఉందో, అప్పుడే యింటికా? వద్దు. బీచికి వెళ్ళుదాము.'

'నాకు నిదురవస్తూన్నది.' అని మత్తుతోనే అన్నాడు సత్యం.

'మరి, నాకు రావడంలేదు. మీరు...మీరుకూడా నిద్రపోకూడదు.'

'చాలా పొద్దుపోయింది. ఇంటికి వెళ్ళవద్దూ? మీ వాళ్ళు ఏమనుకుంటారు?'

'ఏమీ అనుకోరు, వాళ్ళకి తెలియదూ మనమిద్దరమూ ఎక్కడో షికార్లు కొడుతూంటామని!—'

'తప్పు కాదూ ?'

ఇంకోమాట రాకుండా, మంజరి తన పెదవి అడ్డుపెట్టింది. సత్యమూ అది గ్రహించి అంతటితో ఊరుకున్నాడు.

ఇంటికి వచ్చేశారు. మంజరి దిగి మెట్లమీద నిలుచున్నది. సత్యం ఒక గంతులో ఆమెదగ్గరకు ఉరికి 'నేను వెళతాను' అన్నాడు.

మంజరి తెల్లబోయింది వణుకుతూ గాద్గదికంతో— 'ఇప్పుడా! వెళ్ళిపోతారా?' అన్నది.

సత్యం, ఆమెవంక ఉన్మత్తుడిలాగా చూసి వెనుకకు నడిచి వెళ్ళిపోయినాడు. మంజరి చేష్టలుడిగి, అతడు పోయినవైపే చూస్తూ నిశ్చలంగా నిలుబడిపోయింది.

'సత్యం... సత్యం'

అతన్ననుసరించి వెళ్ళబోయింది. తెలివితప్పి క్రిందపడబోతూంది.

—ఎవరో తలుపు తెరిచారు.

౨

ఉదయిస్తున్న సూర్యుడివంక చూస్తూ సత్యం మేడమీద కిటికీవద్దనిలుచుని ఉన్నాడు, షేవ్ చేసుకుని, చక్కగా స్నానంచేసి ఎప్పుడెప్పుడంటూ, కాఫీకోసం ఎదురుచూస్తూ. ఉబుసుపోవడానికి, అపరధ్యానంలోనే ఏదో ఈలతో పాడుకుంటూ నిరీక్షిస్తున్నాడు.

మెట్లచప్పుడయింది. అతిసావధానంగా వింటున్నాడు. ఎప్పుడా దేవీమూర్తి ఎదుటపడుతుందా అని తహతహలాడుతున్నాడు. రావడంతోనే, తనివితీరా కసితీరా.

'బావా.'

సత్యం చాలా విసుగుతోనూ, చిరాకుతోనూ వెనుదిరిగి చూశాడు. మోహినికాదు. చిన్నిమరదలు. అల్లరిపిల్ల రమణ. కాఫీ ట్రేబల్లమీద పెడుతూ అతనివంక కొంటెగా నవ్వుతూన్నది.

మాటాడకుండా, బల్లదగ్గరకువచ్చి కూర్చుని కప్పులోది కాఫీయో, కషాయమో గమనించకుండానే రుచికోసమైనా నిదానించకుండా, ఒక గ్రుక్కతో అఖరు చేసేశాడు. ఆకులు వేసుకోనని, కొంచెం వక్కమాత్రం తీసుకుని, అలవాటుచొప్పున అనుకోకుండానే, సిగరెట్టు అందుకుని ముట్టించాడు. ఊతంగా మొదటిదమ్ము లాగి అల్లరికి రమణమీద ఊదాడు.

'చాల్లే బావా! నీవు ఎప్పుడూ ఇంతేను. ఏంపనీ లేదూ? ఎప్పుడూ సిగరెట్టు కాల్చడమేనా? ఉండు. అక్కయ్యతో చెప్పి నిన్నేంచేయిస్తానో?'

—సత్యం, తప్పించుకొనిపోవాలని చూస్తూన్న రమణను ఒడిసిపట్టుకున్నాడు - గులాబీరేకులలాటి బుగ్గలుముద్దిడుకుంటూ.

'ఈమాటకూడా చెపుతావుకామా మీ అక్కయ్యతో?' అన్నాడు నవ్వుతూ.

'అబ్బ! వదులు. ఏమిటీ ఊరికే. ఇదిగో వదలవేం.'

రమణ ఏలాగైనా వదిలించుకోవాలని పెనుగులాడుతూంది. సత్యం నవ్వుతూ విడువకుండా ముద్దిడుకుంటున్నాడు.

'...రమణా!...'

గుమ్మంలో నిలుచుని, ఈ అల్లరంతా చూస్తున్నది మోహిని—ఎప్పుడు వచ్చిందో సత్యం గమనించనేలేదు. —రమణవంక చురచురచూస్తు

'ఏమిటి అల్లరి!' అన్నది.

రమణ ఏమి మాటాడకుండా ఊరుకున్నది. సత్యం భార్యను క్రీగంట వీక్షిస్తున్నాడు, తనవైపుచూస్తే కను

సైగతోనే పలుకరించాలని తెప్పవాల్చకుండా ఆ అమ్మాయి వంకే చూస్తున్నాడు. కాని, ఆ పిల్ల ఆతన్ని తలఎత్తి చూడలేదు. అంతలోనికి పెదబొంగరంగానే రమణ చేయి పుచ్చుకుని 'క్రిందికి వెళుదామురా, అమ్మ పిలుస్తున్నది.' అని వెనుదిరిగింది. సత్యం మోహిని పైటచెంగు లాగాడు. రమణ ఇది గమనించి తప్పించుకుని నవ్వుకుంటూ క్రిందికి పారిపోయింది.

మోహిని ఏమీ మాటలాడలేదు. సత్యం ఆ అమ్మాయిని సమీపించి కౌగలించుకున్నాడు.

'ఎందుకూ కోపం?'

మోహిని మాటాడలేదు. ఆతనివంక సరిగా చూడనైనాలేదు.

'మాటాడవూ?'

'... ... ...'

'నీవు వస్తావని ఇందాకటినుంచి కనిపెట్టుకుని కూర్చున్నాను.'

'పోనీ కాఫీ అయినా నీవు తెచ్చి పెట్టకూడదూ?'

—ఎన్నివిధాల పలుకరించినా మోహిని మాటాడలేదు. కోపమేమో అనుకుని అనేక సాంత్వనోపాయాలు ఆలోచించాడు. సిగ్గేమోనని చనవుచేసుకోవలెననిచూశాడు. కాని మోహిని మాటాడలేదు.

'సరే క్రిందికివెళ్ళు' అని చాలా విసుగుతో ఆమెను వదిలాడు సత్యం. మోహిని సావకాశంగా మెట్లుదిగి వెళుతూ మలుపుతిరుగుతూ సత్యం వంక తమాషాగా చూసి చకచకా క్రిందికి వెళ్ళిపోయింది.

ఆ చూపుతో సత్యానికి మత్తెక్కిపోయింది. ఆకపటాభినయాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయినందుకు తన్నుతాను నిందించుకున్నాడు. మోహినికి తనమీద చాలా ప్రేమ ఉన్నదని తెలుసును కాని ఇంకా చిన్నపిల్ల గనుక ప్రౌఢలాగా నాయకుణ్ణి అలయించే సత్తా ఉన్నదని గ్రహించలేకపోయినాడు. ఈమారు కనబడినప్పుడు —మళ్ళా మధ్యాహ్నం కాఫీ తెచ్చి పెడుతుంది కాదూ— కనిపెడతాను...

...కాని రోజల్లా మోహిని కనబడనేలేదు. భోజనంచేసి పైకివచ్చేశాడు. బల్లమీద పక్కపొడి తమలపాకు చిలకలు పెట్టి ఉన్నాయి. మోహిని చాలా చక్కగా చిలకలు చుడుతుందని ఆతనికి తెలుసును. కాని, ఆ అమ్మాయి తానే తీసుకునివచ్చి ఇచ్చేభాగ్యం లభిస్తుందేమోననుకున్నాడు. అదీ రాలేదు, కాఫీ వేళకు కూడా ఆతను నిద్రలో ఉండగానే ఎవరో అన్నీబల్లమీద అమర్చి ఆతన్ని మేలుకొల్పకనబడకుండా వెళ్ళిపోయినారు. మోహినియో, రమణో సత్యం చూడలేదు.

—సాయంకాలముకూడా మోహిని కనబడలేదు. రాత్రిభోజనంచేసేటప్పుడు ఆతని మామగారు భార్యతో మాటలాడేధోరణిలో సత్యం— మోహినీ, రమణా సినీమాకు వెళ్ళారని గ్రహించాడు. చాలా కోపంవచ్చింది. ఆపూటకు, ఏదో సాకుచెప్పి భోజనం చేయకుండానే లేచి వెళ్ళిపోయినాడు.

మేలుకుందామనుకున్నాడు. కాని తెలియకుండానే నిద్రపోయినాడు. మెలకువ వచ్చేటప్పటికి చాలా ప్రొద్దెక్కింది. మళ్ళా కొంచెంసేపటికి కాఫీ అందించడానికి రమణ ప్రత్యక్షం.

మామగారిని సమాధానపరచి, ఆపూటే బయలుదేరినాడు సత్యం అక్కడనుంచి. పండుగకని వచ్చినవాడు ఎందుకు వెళ్ళిపోతున్నాడో అత్తమామలు గ్రహించలేకపోయినారు. ఎంత బ్రతిమాలినా ప్రయోజనం లేదని తెలిసి మామగారు అనుమతించాడు ఆతని ప్రయాణానికి.

సత్యం మోహినికోసం ఎంతోసేపు నిరీక్షించాడు, రాలేదు. చివరికి బండిలో ఎక్కుతూ ఏ కిటికీలో నించైనా చూస్తున్నదేమోనని అంతటా కలయజూశాడు. లేదు.

## 3

మన్మథుడివిజయపతాకలాగా ఆ అమ్మాయి పైటచెరగు గాలికి ఎగురుతూన్నది.

—కారు చాలావేగంగా పోతున్నది, బీచిఒడ్డున ఆ అమ్మాయి ఏలాఉందో చూడటానికి, అవకాశం లేకపోయింది సత్యానికి. కాని, జరీపనిచేసిన చీరచెరగు మాత్రం విస్పష్టంగా కనపడుతూన్నది. ఎంతదూరాన్నుంచైనా ఇంకా ఎగురుతూనే ఉన్నది. పిలుస్తూనే ఉన్నది; రమ్మని...!

సత్యం పరవశుడైపోయినాడు. ఆమె, కారూ కను చూపుమేరదాటిపోయేదాకా, అలాగే నిలువబడి పోయినాడు. తరువాత ఆఅమ్మాయిఎవరోతెలుసుకోవాలని ఆమెను చూడాలనే ఆవేశంలో, చీకటిపడేదాకా బీచిఅంతా వెదికాడు. కాని కనుబడలేదు. పోయే ప్రతి కారువంకా ఆఅమ్మాయిఉంటుందేమోనని, చూశాడు. చివరకు నిరాశతో పారీస్ కార్నరుదగ్గర బస్సుఎక్కి ఏమీతోచక అప్పుడే ఇంటికిపోడానికి మనసుఒప్పక వెల్లింగ్టన్ దగ్గర దిగాడు.

—లోపలకువెళ్ళి కూర్చున్నాడు. చీకటిలో మెల్లిగా దోవచూసుకుంటూ. ఏదోకథ నడుస్తూంది. సత్యం ఏదో ఆలోచించుకుంటూ, తనధోరణిలో తానున్నాడు.

...అయిపోయింది కాబోలు ఉన్నట్లుండి దీపాలు వెలిగినాయి. సత్యంకూడా ఊహాజగత్తులోంచి బయట పడి లేవబోతున్నాడు.

...ఆచీరచెరగు !...

సత్యం ఆశ్చర్యంతోనూ సంభ్రమంతోనూ పక్కకు తిరిగిచూశాడు. ఆఅమ్మాయి అతనిచెంతనే, అతన్ని తానుతాకూర్చునిఉన్న... దిగ్భ్రమతో నిలుచున్నవాడు అలాగేఉండిపోయినాడు.

ఆఅమ్మాయి...ఎంతోబాగుంది !

—సత్యంవంక ... చూసి అతనిముందునుంచే నడచిపోయింది. అతడు ఆమె వెళ్ళిపోయేదాకా అలాగే నిలుచుని కదలలేక పోయినాడు.

అందరూ బయటికివెళ్ళిపోతున్నారని స్పృహ తెచ్చుకుని సత్యంకూడా బయలుదేరబోయినాడు. స్టాలుదగ్గర దాహంతీర్చుకుని పోవాలని వెనుదిరిగి అంతలో ఆగిపోయినాడు

ఆఅమ్మాయికూర్చున్న కుర్చీపక్క కుర్చీమీదను పర్సూ, పుస్తకమూ అతన్ని ఆకర్షించి గమననిరోధము కలుగచేసినాయి.

సంశయించనన్నాలేదు. అవి ఆమెవేనని ఏలాగో వాటిని చూడగానే తోచింది. చేయాలని చేసిందో నిజంగానే మరచిపోయి వదలిపెట్టిందో అని అయినా ఆలోచించలేదు. వాటిని పుచ్చుకుని ముందుకు దుమికేశాడు. డ్రింకొ సంగతే తలపెట్టలేదు. చెంగు చెంగున రెండుమూడు అడుగులలో బయటికివచ్చేసి ఆమెకోసం అంతటా కలయచూశాడు.

ఉప్పొంగిపోయాడు. ఆమె వెళ్ళిపోయిందేమో అన్నభయం మాయమైంది. ఆఅమ్మాయి. అప్పుడే కారులోకి ఎక్కబోతున్నది.

సంశయించకుండా సమీపించాడు. అంతలో సిగ్గు అడ్డపడ్డది. ఏలాపలుకరించాలో తోచక అక్కడే నిలుచున్నాడు.

ఆఅమ్మాయి అతనివైపుచూసింది. నవ్వుతూపలుకరించి అవి అందుకున్నది.

ఆమెవంక చాలాసేపుచూశాడు. ఆమెచూపుకు ఆ కటాక్షవీక్షణాలకి ఆగలేక తలవంచుకున్నాడు. అప్రయత్నంగానే పుస్తకంమీద 'మంజరి' అన్నపేరు గమనించాడు. తరువాత ఆపుస్తకం ... రచించిన 'అల్లరిపిల్ల' అని గుర్తించాడు. ఆవేళ ...సిన ఫిలిమ్ ఆ కథే !

చిరునవ్వు పెదవులపైనే కనుసైగతో ఒకచూపుతో అతన్నిముగ్ధునిచేసి సెలవొసగి ఆఅమ్మాయివెళ్ళిపోయింది. సత్యం తన తెలివితక్కువను ...దించుకుంటూ నడచిపోయినాడు.

చాలారోజులయి పోయినాయి. 'మంజరి' మళ్ళా కనబడనేలేదు సత్యానికి. కాని కనబడదనే నిరీహ మాత్రంకలగలేదు అతనికి. మొందటి... చూసినప్పటినుంచీ కూడా ఎందుకనో... ఆమె, త... వితకుసుమాన్ని ఆమధుసౌరభాన్ని ...రులుకొని మ... మధుపాంగనగా అవుతుందని ఆశకలిగింది. ఎంత ...లము కనబడక పోయినా ఆమెను మరువలేకపోయి...డు. ఆఉత్సాహమూ పోలేదు.

—సర్కసు ఆవరణలో అనేకవిన్యాసలీలలు జరుగుతున్నాయి. సత్యం అందరితోబాటు తానుకూడా మెర్రీగోరౌండులో ఎక్కాడు. అన్ని ...ల్లలోను చాలావరకూ దంపతులు కూర్చున్నారు. సత్యం ఒక్కడే రతీవిరహమనుభవిస్తున్న రమాకుమారిడిలాగా ఒంటరిగా ఉన్నాడు.

—కనబడుతుందనుకోలేదు. ఆవేళ అంతభాగ్యమబ్బుతుందని ఆసపడలేదు. కాని మంజరి ఆచక్రభ్రమణంలో ఆతనికి కొంచెముక్రిందుగా ఆతనిలాగే ఒంటరిగా కానిపించింది.

ఆగకపోతే ఆ ఆవేశంలో దుమికేవాడేమో తెలియదు. దిగగానే జనాన్ని తోసుకుంటూ ముందుకుపోయినాడు. మంజరిని సమీపంలోనే కలుసుకున్నాడు.

ఆమెకూడా ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు అక్కడనే నిలుచున్నది. సత్యం ఆమెనుచూడగానే మంజరిని తప్ప మిగతా అక్కడున్న అందరినీ తాను లెక్కడున్నదీ మరచిపోయిపోడు. తనివితీరా ఆమెవంక చూస్తు ఆమె కోమలకరపల్లవాన్ని అందుకుని చాలా నాజూకుగా 'మంజరీ' అని పలుకరించాడు.

ఆ అమ్మాయి ఆతన్నిచూచి ఆశ్చర్యపడలేదు. ఆతని చేయి వదలించుకోలేదు. ఏమీ మాటపలుకలేదు. కాని ఆచూపులో ఆమె ఆహ్వానాన్ని సత్యం అందుకున్నాడు.

అదీ వారిరువురి మొదటి ప్రణయయామిని!

## ౪

'సత్యం!'

—అప్పటికి మూడురోజులయింది ఆతడు మంజరిని చూసి. రోజూ ఎన్నిసారులు ఫోనుచేసినా జవాబు చెప్పకుండా తప్పించుకుంటున్నాడు. ఒకటి రెండు మారులు, ఆమె చూడడానికివచ్చినా నౌకరుచేత లేడనిపించి ఆమె సందర్శనభాగ్యంకూడా—చేయలేక చేయలేకఎంతో వేదనపడుతూనే—లేకుండాచేసుకున్నాడు. మధ్యమధ్య మనసు చలించేది. మంజరిమీది ప్రణయావేశంలో మోహినిని సాఫుగా మరచిపోయేవాడు. కాని మనసు దిటవుపరచుకుని మంజరినివదలి తన భార్యను మోహినిని చూడవలెనని పోవ సంకల్పించుకున్నాడు.

ఆరుగంటలుదాటింది.సత్యం ఆవేళ మెయిలుకుబయలుదేరవలెననే నిశ్చయంతో సామానుసర్దుకునిసిద్ధంగా ఉన్నాడు. భోజనానికి వెళ్ళిరాబోతూ ఎదురుగా బల్లమీద ఉన్న మంజరి ఫోటోను చూడకూడదని కొనుగులాడుతూనే చూస్తూ నిలువబడినాడు. తెలియకుండానే సమీపించి దాన్ని అందుకుని ముద్దిడబోతున్నాడు.

మంజరి సాక్షాత్కరించింది.

ఆమె పిలుపువిని సంతోషంగా తిరిగి చూశాడు. మంజరి నవ్వుతూ గుమ్మంలో నిలుచుని ఉన్నది.

సత్యాన్నికదిసి కౌగలించుకున్నది బాహులతను ఆలా పెనవేసి. ఆతని వంకచూస్తూ 'సత్యం' అనిమళ్ళీ పలుకరించింది.

ఆతడు ఆమె కౌగిలివదలించుకోబోయినాడు. కాని మంజరి ఆ ప్రయత్నాన్ని గమనించి మరీ పెనవేసింది.

'ఎందుకూ సత్యం!' అన్నది.

మంజరివైపైనా చూడకుండా బలవంతాన ఆమెను విదిలించుకుని బిరబిర నడచిపోయి సోఫాలో కూలబడ్డాడు. ఆమె ఒకనిమిషం ఆతని వంకచూసి తానుకూడా ఆతని సరసనుచేరి మీదచేయివేసి సత్యం ముఖం తనవైపు తిప్పుకుంటూ, 'ఎందుకూ అంతకోపం' అని లాలనతో అడిగింది. సత్యం బదులు చెప్పలేదు.

కొంచెంసేపటివరకూ ఇరువురూ మాటాడలేదు.

ఆమె 'భోజనంచేయవూ?' అని మరల కదిపింది.

సత్యం 'ఊహు' అని తలఊగించి మళ్ళీమౌనముద్ర వహించాడు. మంజరి ఊరుకోలేదు.

'నేనుకూడా నీతో భోజనం చేస్తాను. ఎంతకాలమైందో కులాసాగా ఇద్దరమూ ఒకచోట కలిసితిని ఫోనుచెయ్యి హోటలుకు' అన్నది. సత్యం ఏమనుకున్నాడో ఫోను దగ్గరికివెళ్ళి గర్జిస్తూ హోటలువానికి ఆజ్ఞాపించాడు. మళ్ళీ తిరిగివచ్చి మామూలుచోట కూర్చున్నాడు.

మంజరి ఆతనికి సిగరెట్టు అందించింది. ఆమె ప్రసాదించిన వెలుగుతోనే అంటించుకున్నాడు. సగంవరకూ ధూమరూపాన ఆస్వాదించాడు. అంతలో తటాలున ఆమెవైపు తిరిగి 'మంజరీ' అన్నాడు.

ఆమె తల ఊపింది ఔనని.

'నేను వెళుతున్నాను.' అని తడబడుతూ, ఇంకా ఏమో చెప్పబోయి మళ్ళీ ఊరుకున్నాడు.

ఆమె ఈ విశ్రమాన్ని గమనించినా ఏమీ చూడనట్లుగానే—'ఎక్కడికి?' అని సరసంగా, సావకాశంగాఅడిగింది సత్యం ఊరుకున్నాడు. కాని ఆమె గ్రహిం

చింది 'మోహిని దగ్గరకా' అని మళ్ళా అడిగింది.

'అవును!'

'ఎప్పుడు వెళుతావు'

'ఈవాళే'

మంజరి ఓ క్షణం ఏమీ అనకుండా ఊరుకున్నది. తరువాత 'పోనీ రేపు బయలుదేరరాదూ' అని అందుకున్నది.

'ఊహుఁ'

'వల్లకాదు.'

'నీ యిష్టమా?'

'కాదాఁ'

మంజరి మళ్ళా అతన్ని కౌగిలితో తనవద్దకులాక్కుని 'చూడు సత్యం! నేను ఆమాత్రం కోరతగనా?'

'నేను వెళుతాను'

'ఈ ఒక్కరోజు'

'ఊహుఁ'

మంజరి అతన్నివదలి దూరంగా నిలుచుని 'సరే' అని వెళ్ళిపో ప్రయత్నంచేసింది. సత్యం ఒకదాటున ఆమెకు అడ్డమై పరిష్వంగంలో ఉక్కిరి బిక్కిరిచేస్తూ 'మంజరీ! నిన్ను వదలలేను' అన్నాడు.

ఆమె అతన్నిచూడకుండానే 'వద్దు వెళ్ళు' అని వదలించుకున్నది.

'వెళ్ళను.'

'తప్పదు వెళ్ళాలి.'

'మంజరీ! నీకు న్యాయమేనా?'

'ఆ !'

'ఉండవూ'

'ఏం!'

మంజరి అతన్ని తేరిచూస్తూ 'మోహిని వస్తుంది కాదూ' అని, నవ్వి, ఇక అక్కడ ఆగకుండా క్రిందికి దిగిపోయింది.

కారు చప్పుడయింది.

సత్యం భోజనమాటే మరచిపోయి స్టేషనుకుబయలుదేరాడు.

మెయిలుఆవేళ కొంచెం ఆలస్యమయింది.

మంజరి కారులోకూర్చుని సత్యం ఎప్పుడువస్తాడా అని ఎదురు చూస్తూంది. క్రిందటిరాత్రే, వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు. బయలుదేరుతాడని తెలుసు. ఒక్కడే తయారవుతాడనికూడా తెలుసును.

మెయిలు ఆగింది. రైలులో ఉండగానే సత్యం, మంజరిని చూశాడు. దిగి తిన్నగావచ్చి ఆమెప్రక్క కూర్చున్నాడు. పోర్టరు సామాను తెచ్చి వెనుక వేశాడు.

మంజరి కారు స్టార్టుచేసింది.

ఇంటికి జేరుకున్నారు. త్రోవలో సత్యం ఏమీ మాటాడనూలేదు. మంజరి అతన్ని పలుకరించనూలేదు.

'ఏమ్మాయ్ సత్యం! ఎప్పుడురావడం!' అని మంజరి అన్న హాలులో ఎదురై కుశలమడిగినా ఆమాట వినిపించుకోకుండా తిన్నగా లోపలికి వెళ్ళిపోయినాడు. మంజరీ, ఆమె అన్నా ఒకరినొకరు చూసి సాభిప్రాయంగా నవ్వుకున్నారు.

స్నానాదికములు ఆచరించి సత్యం కాఫీ పుచ్చుకుంటున్నాడు. మంజరి అతని సరసను నిలుచుని ఉన్నది. కొంచెం త్రాగినతరువాత సత్యంవారిస్తున్నా లెక్కచేయకుండా కప్పు మరల నింపుతూ 'సత్యం!' అన్నది. అతడు ఆమెవైపు చూశాడు.

'మోహిని ఏదీ?'

'రాలేదు'

'ఏం?'

'ఏమో. ఇదుగో మంజరీ నీవు ఇక ఆమాట ఎత్తవద్దు.'

'ఎందుచేతనో'

'మోహిని నా భార్యకాదు.'

మంజరి నవ్వింది. సత్యం అది గమనించకుండానే 'నామీద ఆ అమ్మాయికి ప్రేమలేదు. యిష్టంలేదు.'

'నీకు ఏలా తెలుసూ?'

'ఆమాత్రం తెలియని పసిపాపనా? నాతో మాటాడితే మాటాడటానికే ఇష్టంలేదు మోహినికి.'

'సిగ్గుపడిందేమో.'

'సిగ్గు అయితే హద్దు ఉంటుంది. మరి వైముఖ్యానికి'

'నీతో అసలు మాటాడనేలేదా?'

'ఊహుఁ'

'పోనీ కనపడిందా'

'మొదటి రోజున.'

'తరువాత'—

'అంతర్ధానమయింది'

'వెతకలేక పోయినావా? ఎవరినీ కనుక్కో—లేక పోయినావా?'

'ఎందుకులేస్తు, మంజరీ! అంత ఇష్టంలేని ఆ అమ్మాయి మీద హక్కు— ఉన్నదికదా అని అధికారం చెలాయిద్దామనిలేదు. కులాసాగా ఉండనీ!'

'చాలా సరసంగా ఉన్నది.'

'మరి ఏంచేయనూ?'

'నీ భార్యకాదూ.'

'అవును. అగ్నిసాక్షిగా కాని మనసు.'

'నీమీదనే ఉన్నదేమో.'

'పాపం! నామీద మనసుతోనే నేను కనబడగానే కంటికికూడా కనబడకుండాపోయింది.'

'అయితే ఆ అమ్మాయి సంగతేమిటి?'

'ఆమె యిష్టం.'

'నీ అభీష్టమో?'

సత్యం జవాబు చెప్పకుండా ఆమెవంక చూశాడు. ఆమె నవ్వింది.

...సాయంకాలందాకా ఏలాగో వేగిరించారు ఇద్దరూను. తిరిగి తిరిగి యింటికి మంజరి యింటికే చేరుకున్నారు.

—వెన్నెల బాగావచ్చింది. మంజరీ, సత్యం తాంబూలా లేసుకుంటూ కూర్చున్నారు.

'చూడు సత్యం మరి మోహినిమాట...'

'నీ కెందుకూ?'

'ఎందుకోలే. నీకు మోహినిమీద ప్రేమఉన్నదా?'

'నీమీద,'

'సరేలే. మోహినిని చూడాలని లేదూ?'

'ఊహుఁ'

'అబ్బ ఇదిగో ఈలాచూడు నిజంగా...'

'చూడాలనే ఉంది...కాని'

మంజరి నవ్వింది. సత్యం ఏమీ అర్థంకాక ఆమె వైపూ...తరువాత క్రమంగా ఆశ్చర్యపడిపోయినాడు! మోహిని ఎదురుగా తలవంచుకుని నిలుచుని ఉన్నది!

మంజరి నవ్వు ఆపకుండానే 'చూడు. ఎంత బాగున్నదో. మోహినీ! ఇంకా కొంచెం ముందుకురద్దూ అమ్మా! ఈ పెళ్ళికొడుకు సరిగా చూస్తాడు.' అన్నది. సత్యం తెల్లపోయినాడు. మంజరి మోహినిని దగ్గరకు రమ్మని సైగచేసింది. ఆ అమ్మాయి లజ్జాభరంతోనే మెల్లిగా అడుగులిడుతూ వచ్చి మంజరి ప్రక్కను నిలుచుని ఆమె బలవంతానా ఒదిగి కూర్చున్నది.

'మోహిని మాచెల్లెలు' అన్నది మంజరి. సత్యం అర్థంకాక ఆమెవంక చూశాడు.

'అవును చెల్లెలే. మా అమ్మ చెల్లెలి—మా పినతల్లి—కూతురు...'

'నీవు మరి...'

'మరిలేదు గిరిలేదు. నాకన్న ఎంతచక్కగుందోచూడు. పాపం పలుకరించలేదట. నీవు పలుకరించావు కాదూ?'

'మంజరీ!'

'నాకు తెలుసునులే పలుకరించలేదని పారిపోయి యిక్కడికి వచ్చేశావు. మోహినికోసం నిన్ను నావాడినిగా చేసుకున్నాను. మళ్ళా ఆమెకోసం వెళ్ళి. ఈ మారైనా పలుకరించలేవూ...కనబడలేదేం! ఎక్కడి కక్కడ నీవు వచ్చావ్వకదా అని కాళ్ళకు అడ్డంతగులాలేం. అంత ప్రేమఉన్న భార్యకోసం అక్కడ వెదుకాలో తెలియదూ.'

మోహిని తలయెత్తిచూసి నవ్వింది. మంజరి 'మరలా మోహినీ! అని పిలు వింటాను. ఎంత చక్కగా పిలువగలవో?' అని నవ్వింది.

సత్యం ఎటూ చూడకుండాలేచి ఎక్కడికో పోబోయినాడు. ఏమో!

మరోక్షణంలో తెలివితెచ్చుకుని చూసి మోహిని కౌగిటనున్నానని తెలుసుకున్నాడు. ఆమె అతని పెదవికోసం వెదకుతూ 'సత్యం!' అని కోమలంగా పలుకరించింది. సత్యం పరవశుడైపోయినాడు.

—మంజరి యెక్కడనుంచో నవ్వుతూంది.

—మల్లాది రామకృష్ణశాస్త్రి.

# విడ్డూరములు

### గొఱ్ఱె ఒంటిమీదిబొచ్చులో పక్షిగూడు

ఆస్ట్రేలియాఖండమునందలి బెలంగా అను ప్రదేశమున ఎ. బర్జర్ అనువానికి చెందిన ఒకగొఱ్ఱె ఒంటిమీది బొచ్చును కత్తిరించుచుండగా ఆ బొచ్చులో షార్లింగు అనుబడు ఆదేశపుపక్షిగూడు ఒకటి కానవచ్చెను. ఆపక్షి గూటిలో ఒకగుడ్డుకూడ ఉండెను. ఈవార్తను లోకమునకందించిన 'ఫీల్డు' అను పత్రిక కేప్‌కోలనీలో ఒక గుఱ్ఱపుతోకలో ఒక చిన్నపిట్టగూడు కానవచ్చెననుటను చదువరులకు జ్ఞాపకము చేయుచున్నది.

### నల్లటిమంచుగడ్డ

'మంచుగడ్డ' అనుటతోడనే మనకు తెల్లందనము జ్ఞప్తికివచ్చును. అట్టిచో నల్లటిమంచుగడ్డ కలదనుచో చాలమందికి ఆశ్చర్యముగనుండవచ్చును. స్విడ్జర్లాండు దేశమున ఈనడుమ ఆకాశమునుండిపడిన మంచుగడ్డ నల్లగనుండెను. ఇట్లు నల్లటిమంచుగడ్డపడుట ఆదేశమున తఱుచు జరుగువిషయమే. వాతావరణమునందలి శైత్యమునకు మంచుగడ్డ ఏర్పడునుగదా. అట్లు ఏర్పడునప్పుడు పరిసరమున ఎగురుచుండు నల్లటిపురుగులు ఆ మంచులో ఇఱుకుకొనిపోవుటచే దానికి ఈనల్లటిరంగు కలుగుచున్నదని శాస్త్రవేత్తలు పరిశోధించి చెప్పుచున్నారు.

### పావురములు వార్తల త్వరప్రచురణమునకు తోడుపడుట

ఈ నడుమ జపానునుంచివచ్చిన బెల్జియము యాత్రికులు జపానుపత్రికల రిపోర్టరులు చుఱుకుదనమునందును, తెలివితేటలయందును ప్రపంచమునందలి ఇతర పత్రికల రిపోర్టరుల మించియున్నవిధమును ఇట్లు చెప్పుచున్నారు. హార్బరులోనికి ఓడలువచ్చినతోడనే పోర్టు డాక్టరుతోగూడ పత్రికల రిపోర్టరుగూడ ఓడయెక్కును. రిపోర్టరు కూడ నొక కెమీరాను కొనిపోవును. వచ్చినవారిలో ప్రఖ్యాతపురుషుల ఫొటోలు తీసికొనును; వారితో సంభాషించును; సంభాషించిన విషయములను టైపుచేయును, దానికి ఫొటో ఎత్తును, అంతటిని పోస్టుస్టాంపు అంతమడతలోనికి తెచ్చును. దానిని తన పావురమున కొకదానికికట్టును. ఆ పావురము వెంటనే పత్రికాకార్యాలయమునకు ఎగిరిపోవును. కార్యాలయమునవారు దానిని గైకొని వెంటనే చిత్రపటసహితముగా ఆవ్యాసమును ప్రచురించి పత్రికను హార్బరులోనికి అమ్మకమునకు పంపుదురు అప్పటి కింకను ప్రయాణికులు పోర్టుడాక్టరుపరీక్ష, కస్టమ్సుఆఫీసరుల తనిఖీ తీరి బయటపడరు. తమ ఛాయాచిత్రము, తమతో రిపోర్టరుచేసిన సంభాషణము అప్పటికప్పుడే ముద్రితమై అమ్మకమునకు సిద్ధముగానుండుటకు వారు సంభ్రమాశ్చర్యముల నొందుదురు.

### ఏడువేలరకముల తేనెటీగల భాండారము

ప్రపంచమునందలి తేనెటీగల భాండారముల కన్నిటిలోనికి మిక్కిలి పెద్దదగు భాండారము ఇపుడు పారిస్‌నందలి జంతుప్రదర్శనశాలలో చూపబడుచున్నది. ఈ భాండారమున 100 000 సంఖ్యగల తేనెటీగలు గలవు. ఇవి ఏడువేలరకములవి. ఇన్నిరకములకు చెందిన ఇంత పెద్దసంఖ్యగల తేనెటీగలనుగూర్చిన మహనీయుని నామము హేన్సు(ఫ్రాహిబెర్‌ఫర్. వివిధములగు తేనెటీగలను సమకూర్చుట కీతడు ఇండియా, మలేషియా, ఆఫ్రికా, చైనా, జపాన్, సయామ్, ఉత్తరఅమెరికా, దక్షిణఅమెరికా దేశములందు సంచరించెను.

# ఆంధ్రరాష్ట్రము : హరిశ్చంద్రుడు

అది ౧౯౨౧-వ సంవత్సరము. హరిశ్చంద్రుడుగా రప్పటికప్పుడే వివిధవ్యాపారపరినిష్ఠితులు; వయస్సు ఇరువదెనిమిది. అప్పుడు ఈ వ్యాసరచయిత కళాపరిషత్తున విద్యాపిపాసువు, పదునాలేండ్ల బాలకుడు: విజ్ఞానసంపత్తికోసము హరిశ్చంద్రుడుగారి ఆశ్రయమున, ఆదరానురాగముల పడయుచున్న విద్యార్థి. ఒక్కపరి ఆయానందప్లావితములైన దివసములు స్మృతికి తెచ్చుకొనిన హృదయము ఆనందోత్తేజితము, భక్తిపులకితము అగును. వారి సమ్ముఖమున విజ్ఞానామృతమును గ్రోలి జీవితాదర్శముల ఉద్దీపింపచేసికొనిన మంచికాలమది. పండువలచి చేతనిడినట్లు హరిశ్చంద్రుడుగారు 'క్వీట్ ఇ లైక్ మాన్' 'గోల్డుస్మిత్ వ్యాసములు' మొదలైన ఉద్గ్రంథములలోని సద్భావములు సులలితములైన మాచిన్ని హృదయముల నాటిన రోజులవి.

మరల ౧౯౩౨ లో వారు శాసనసభాభవనమున భావోద్రిక్తులై, ధర్మసాధకులై పేదరైతుల ఇక్కట్టులగూర్చి గర్జించుచున్నపుడు, చిననాడు లేతహృదయముల భక్తిభావముల నెట్లు చూఱగొనిరో, అదేతీరున ఈనాడు మొరటు లోకపు అనుభవము కొంతవఱకు నందిన హృదయమున మానవసేవాభిలాషను ఉద్దీపింపజేసి, దేశమింకను గొడ్డుపోవలేదను మేల్కొలుపు వినిపించిరి.

హరిశ్చంద్రుడుగారి హృదయము సున్నితమైనది, కంఠము మధురమైనది; వారి నేత్రాంచలముల నొకానొక తేజస్సు కలదు. వారు కళోపాసకులు: విజ్ఞానతేజస్వి.

ఎందఱెందరో బీదపిల్లలు వారి పోషణమున అభ్యుదయముగాంచి నేడు తహసీల్దారు పదవులు సయితము నందుకొని యున్నారు. ఎన్నియో సంఘములు, మండలులు గోప్యముగ వారిసాయము నందుకొని యున్నవి. ఎన్నెన్నియో పిపాసావిలమైన నిరాశాహృదయములు వారి మధురలాలనమున, కరుణామయదృష్టులందు ఆశాప్రకాశమును బడసినవి. కళాపోషకులగు వారి అభయహస్తములనుండి నటకులు, కవులు, చిత్రకారులు బాసట చేకొన్నారు.

విజ్ఞానతేజస్వి: వారి చిన్న ముచ్చటగూర్పు గ్రంథాలయము నీక్షించినచో, వారి సద్గ్రంథావలోకనాతన్మయీభావము పరికించినచో ఆనుహృదయమందలి విజ్ఞానసంపత్తి గోచరించును. ఆంగ్లమున మిల్టన్ మొదలుకొని రోమరోలెండు, మాగ్జిమ్ గోర్కీ వఱకును, ఆంధ్రమున భారతము, సీతారామాంజనేయము మొదలిడి కృష్ణపక్షము, కుంకుమభరణి ఇత్యాదులు ఆకావ్యవీథియందు కలవు. కవిశేఖరుడు ఆంగ్లమున జీవనస్మృతిలో 'విశ్వదాతయగు ఈశ్వరుడు ఒక్కచిన్నసందుగుండ విశాలవిశ్వమునంతటిని మనదృష్టి కందించగలడు' అన్నాడు. స్వంతమైన సద్గ్రంథములమూలమున కూడా ఆయావ్యక్తి మానసికలోకము నెఱుంగనగునని నా అభిప్రాయమే కాదు, పెక్కుఱు నుడివియున్నారు.

జీవనపథమున మ్యునిసిపల్ గౌరవోద్యోగి పదవినుండి శాసనసభా సభ్యత్వము, రైల్వేబోర్డు మెంబరుషిప్పు నందుకొని యుం

" ఆంధ్రభూమి "



శ్రీ అద్దేపల్లి హరిశ్చంద్రుడుగారు

డవచ్చును. లక్షల విలువయైన వ్యాపారము, వ్యవసాయము చేసియుండనగును. గొప్ప గొప్ప స్థీమరులపై నధికారము నందియుండ వచ్చును.

లోకులు హర్షించున దేమి? సుశీలత్వము, విశాలభావములు, దయాధర్మనుగుణములు, సత్యసాధన. అట్టి లోకోత్తరపురుషులను గూర్చియే కదా 'భవోహి లోకాభ్యుదయాయతాదృశాం' అన్నారు పెద్దలు.

బీదసాదలకు అనేకులకు విద్యాభ్యసనమున, ఉద్వాహసమయముల సాయముచేసి యుండవచ్చును. ఇతరములైన పరోపకారకములైన కార్యములనుకూడా చేసియుండనగును. తెనుగుసీమకు వారొనర్చిన సేవయేమి ! అదియెట్టిది ?

ఆంధ్రరాష్ట్రము ప్రత్యేకముగా కావలెనని తెలుగువారికి ఆకాంక్ష చాలనాళ్ళనుండి కలదు. ఆవాంఛ దినదినప్రవర్ధమానమగుచున్నమాట నిజమే, కాని విశిష్టులైన శాసనసభాసభ్యుల నడుమ అనైకమత్యభావము ప్రబలియున్నది. ఆంధ్రరాష్ట్రము కావలెనను ఆంధ్రుల ఆశయమును తెలుపు తీర్మానము అట్టి సభామధ్యమున ఏ పంథపట్టునోయని అందఱు ఆత్రముతో నిరీక్షించుచున్నారు.

హరిశ్చంద్రుడుగారు దృఢసంకల్పులై పరమేశ్వరుని ఆశీస్సు బలముతో ఆ తీర్మానమును సభాస్థలి ప్రవేశపెట్టినారు. నేడు మనము ఫలసిద్ధిసన్నాలమున కొంతవఱకైనా అందుకొనగలిగినాము. ఆత్రమువదలి మనస్సులు శాంతినందినవి: హరిశ్చంద్రుడుగారిని గూర్చి 'క్రియాసిద్ధిః సత్వేభవతి మహతాం నోపకరణే' అనుకొని ఆనందించినాము.

ఒక్కొక్క సమయాన మల్లెపూవు తనకు అంతటి మహత్తరమైన మధురపరిమళము న్నట్లు ఎరుగునాయని అనిపించును. ఆవిరుల వలపు నానందించునది ఇతరులే కదా! అట్టి సులలితప్రసూనముల ప్రసాదించిన భగవానునకు అభినుతులు.

"సుచింత్య చోక్తం సువిచార్య యత్కృతం
సుదీర్ఘకాలేపి నయాతి విక్రియాం."

—సత్యసాధకుడు.



"హెచ్చెంచింతయులేని హంసనడతోఁ
బొల్పొందు లేనవ్వుతో
కొమరుంబ్రాయపునాతి వచ్చె నదిగో
కో నేటికిన్ నీటికిన్."

# మణిమాల

## జార్జిచక్రవర్తిగారి తాళముచెవులు

"జార్జిచక్రవర్తిగారి సొంతకాగితము లుంచుకొనుటకు రెండు బీరువాలుగలవు. వీరి తండ్రిగారగు ఎడ్వర్డు చక్రవర్తిగారి వీలునామా మొదలగు కాగితములుగల మూడవబీరువాకూడ వీరి ఒద్దీయందేయుండును. ఈ మూడు బీరువాలవి, మిగిలినవానివి జార్జిచక్రవర్తిగారికి పెక్కు తాళముచెవులుగలవు. ఈ మూడు బీరువాలును ఉక్కు రేకులతో తాపడము చేయబడియుండుటచే వీనికి అగ్ని ప్రమాదముండజాలదు. ఒక్కొక్క బీరువాకు మూడేసి తాళము కప్పలు వేయబడును. ఒక్కొక్క తాళము కప్పకు రెండేసి తాళముచెవులు. ఈ తాళము చెవులు జార్జిచక్రవర్తిగారియొక్క అంతఃపురమున వారిప్రాత గదిలో భద్రముగనుంచబడును. ఈ తాళముచెవులతో ఆతాళములను తీయవలసిన విధానము ఒక్క జార్జిచక్రవర్తిగారికిని, వారి ఆంతరంగికకార్యదర్శికిని మాత్రము తెలియును. ఎడ్వర్డు చక్రవర్తిగారి కాగితములుగల బీరువా తాళముచెవులు ఒక చిన్న ఇనుపపెట్టెలో జాగ్రత్తపఱుపబడును. ఈ ఇనుపపెట్టె తాళముచెవి ఎల్లవేళల జార్జిచక్రవర్తిగారి స్వాధీనములో నుండును. చక్రవర్తిగారి జేబుగడియారపు గొలుసుకుచేరియున్న ఒక బంగారపుఉంగరములో ఈ తాళముచెవి మఱి కొన్నిముఖ్యమైన తాళముచెవులతో వ్రేలాడుచుండును. 1911-వ సంవత్సరమున పట్టాభిషేకసమయమున ఈ బీరువాలు తఱుచు తెఱవవలసిన అవసరమువచ్చుచుండునది. అప్పుడు ఈ బీరువాలను జార్జి చక్రవర్తిగారు స్వయముగా తెఱచుచుండువారు. ఆ తెఱచునపుడు వారి ఆంతరంగికకార్యదర్శి, వారి సొలిసిటరు, వారి తండ్రిగారి సొలిసిటరుమాత్రమే ఉండుటకు అనుజ్ఞ కలదు. కావలసిన కాగితములు శ్రీచక్రవర్తిగారి సమక్షముననే చదువబడవలయును. ఏ కాగితమునకైన నకలు తయారుచేయబడవలసియుండుచో అది సొలిసిటరు స్వయముగ అక్కడకూర్చుండియే చక్రవర్తిగారిఎదుట చేయవలయును. పనితీరిన వెంటనే ఆ కాగితములను చక్రవర్తిగారు స్వహస్తములతో యథాస్థానమున ఉంచి బీరువాకు తాళమువైతురు."

—టైమ్సు ఆఫ్ ఇండియా.

* * *

## చక్కిలిగింత: కామవికారము

"చక్కిలిగింత చంటిపిల్లలకు ఆనందమును పుట్టించును. సమర్త ఈడువచ్చిన ఆడపిల్లలకును, యౌవన ప్రాదుర్భావకాలముననున్న మగపిల్లలకునుకూడ చక్కిలిగింత ఆనందమును కలిగించును. చంటిపిల్లల విషయమున ఉండజాలని ఒకవిధమైన కామవికారము పసుచుపిల్లలకు చక్కిలిగింతవలన కలుగును. 28 ఏండ్లవయస్సుగల ఒకస్త్రీ చక్కిలిగింత విషయమున ఇట్లు చెప్పినది: 'నాకు పది పండ్రెండువత్సరములమధ్య చక్కిలిగింత అమితమైన ఆనందము నిచ్చినది. ఆ దినములలో నేను నా చిన్నచెల్లెలిచే తఱుచుగా కితకితలు పెట్టించుకొనుదానిని. ఇప్పటికికూడ చక్కిలిగింత అనిన నాకిష్టమే. కాని అప్పటియంత ఆనందమును అది నాకిప్పు డిచ్చుట లేదు.' స్టాన్లీహాల్, ఆలిన్ అనువారలు చక్కిలిగింత తత్త్వమునుగూర్చి పలువురి యువతుల అభిప్రాయములను క్రోడీకరించి ఇట్లు తెలుపుచున్నారు: 'యువతులలో ఒక్కొక్క కాలమున కితకితలగుణము హెచ్చుగనుండును. కొందఱికి కడుపుతో నున్నపుడును, కొందఱికి పెక్కుదినములుగ సంభోగములేనప్పుడును, కొందఱికి కడుపునిండ అన్నము తినినప్పుడును; కొందఱికి అనారోగ్యముగనున్నప్పుడును; కొందరికి ఆరోగ్యసమయమునను, కొందఱికి తమకు ఇష్టమైన వారితో కలసియున్నపుడును కితకితలగుణము హెచ్చుగా నుండును. ఈ కాలములలో పెక్కులు సంభోగవాంఛ పుట్టించుటకు అనుకూలములైనవని సులభముగనే తెలిసికొనవచ్చును. సంభోగవాంఛ అతిశయించియున్న సమయ

మున ముఖ్యముగ స్త్రీల అరచేతులకు కితకితల గుణము హెచ్చుగనుండును. వీపుమీద, అరికాళ్ళయందు, నడుటియందు కితకితలు పెట్టుటచే మొదట సంభోగమునకు విముఖులుగానున్న పురుషులు తోడనే సంభోగమునకు సుముఖులైన నిదర్శనములు కొన్ని తెలియవచ్చినవని మోల్ అను నతడు తెలుపుచున్నాడు.'

—అమెరికన్ జర్నల్ ఆఫ్ సైకాలజీ.

* * *

## రూజువెల్టుగారి ఉత్తరములు

“అమెరికాసంయుక్తరాష్ట్రముల అధ్యక్షుడు రూజువెల్టునకువచ్చు ఉత్తరములు దినదినము పెరుగుచున్నవి. అమెరికాసంయుక్తరాష్ట్రములు స్వాతంత్ర్యమును సంపాదించి వైటుహౌసు ఏర్పడినపిమ్మట దానిచరిత్రలో ఎన్నడును ఇంతటి హెచ్చుసంఖ్య ఉత్తరముల,తంతివార్తలరాకను అది యెఱుగదు. ఈ ఉత్తరములవరదకు తావుచూపుటకుగాను కార్యదర్శులకు అదనపు మేజాబల్లలు ఈయబడినవి. వైటుహౌసు ఇపుడొక పోస్టాఫీసు అయి ఉన్నదని చెప్పవచ్చును. రూజువెల్టు 1933-వ సంవత్సరము మార్చినాలగవతేదీని అధికారము స్వీకరించినాడు. నాటినుండి మాసములవారీగా ఆతనికి వచ్చిన ఉత్తరములసంఖ్య ఇచట తెలుపబడుచున్నది:

| | | | |
|---|---|---|---|
| మార్చి : | 180,000 | | |
| ఏప్రియల్ : | 135,000 | సెప్టెంబరు : | 60,000 |
| మే : | 105,000 | అక్టోబరు : | 150,000 |
| జూలై : | 60 000 | నవంబరు : | 240,000 |
| ఆగష్టు : | 45 000 | డిసెంబరు : | 540,000 |

ఈ ఉత్తరములుగాక ఉద్యోగస్వీకరణానంతరము ఆతనికి ఇప్పటివఱకు రెండు లక్షల ఇరవదివేల తంతివార్తలు వచ్చినవి. చిన్నచిన్న బహుమానములుగల పార్సెలులుకూడ విశేషముగనే వచ్చినవి. రూజువెల్టు ఆర్థికచట్టముక్రింద పలువురకు తిరిగి ఉద్యోగములు దొరకుచున్నవి. చిరకాలముగ ఉద్యోగములేక చిక్కుపడుచు రూజువెల్టు ఆర్థికచట్టముయొక్క సత్ఫలితముగ ఉద్యోగమును పొందిన కొందఱు పురుషులభార్యలు తమ కృతజ్ఞతను తెలుపుటకుగాను ఆతనికి కుట్టిన బెడ్డుస్టాపలు, చెమటతుడుచుకొను చేతిగుడ్డలు, అప్పచ్చులు, ఫవుంటెన్ పెన్‌లు మొదలగునవి పంపియున్నారు. వచ్చు ఉత్తరములలో పెక్కు రూజువెల్టు ప్రభుత్వచాకచక్యమును ప్రశంసించును. కొందఱు తమయిండ్ల తనఖాను గూర్చి శ్రద్ధవహింపఁగోరుచు లేఖలు వ్రాయుదురు. కొందరు తమకు ఉద్యోగము ఈయవలసినదనియు, కొందరుస్త్రీలు జీతమువచ్చినరోజున ఇంటివద్ద ఉండని తమమగలకు ఉపదేశము చేయవలసినదనియు జాబులయందు కోరుదురు. కన్యలు కొందరు తమ వివాహముల విషయమున లేఖాముఖమున ఆతని ఆలోచనను అర్థింతురు. కొందరు భార్యలు తమ భర్తలతో తాము విడాకుపొందవలసిన అవశ్యకతనుగూర్చి లేఖలు నింపి పంపుదురు. ఎంతటి విశేషకార్యనిమగ్నుడైయున్నను రూజువెల్టు దినమునకు రెండువందల ఉత్తరములను చదివి స్వయముగా వానికి ప్రత్యుత్తరములువ్రాయును. మిగిలిన వేలకొలది ఉత్తరముల నన్నిటిని బారులుతీరి కూర్చుండు ఆతని కార్యదర్శులు పరిశీలించి ప్రత్యుత్తరములు వ్రాయుదురు. అన్ని ఉత్తరములకంటె రూజువెల్టు అభిమానమునకు పాత్రమైన ఉత్తరమొకటిగలదు. అది దక్షిణమునుండి ఒక నీగ్రోవంటలవాడు వ్రాసినది. రూజువెల్టు ఆర్థికచట్టమువలన తనకు తిరిగి ఉద్యోగము లభించినదనియు,అందుల కాతనికి తన హృదయపూర్వక నమస్కారము లర్పించుచుంటిననియు, వాషింగ్టన్ పట్టణమువచ్చి రూజువెల్టుగారికి కోడిపిల్లలకూరవండిపెట్టి తన కృతజ్ఞత తెలుపుకొనవలెనను వాంఛ తనకు గాఢముగకలదనియు ఆ నీగ్రోవంటలవాడు వ్రాసెను. ఒకానొక మంగళవారమున రూజువెల్టునకు పదకొండువేల ఉత్తరములువచ్చెను. ఆతనికివచ్చు ఉత్తరముల సగటుసంఖ్య దినమునకు ఆరువేలు. భూమి ఖామందులను, గృహయజమానులను వారివారికిగల తనఖాల విషయమై రక్షణ అవసరమైనచో నేరుగా తనకు ఉత్తరములు వ్రాయవలసినదని రూజువెల్టు దేశప్రజలకందఱకును తెలిపియున్నాడు. అప్పటినుండియు ఆతనికివచ్చు ఉత్తరములసంఖ్య (వింధ్యపర్వతమునకువలె) పెచ్చు

పెరిగిపోవుచున్నది. ఈ బాపతు ఉత్తరములను పర్యాలోచించి ప్రత్యుత్తరములు వ్రాసి అవసరమైన కార్యకలాపము నిర్వర్తించుటకు ప్రత్యేకప్రభుత్వశాఖ యొకటి ఏర్పఱుపబడియున్నది. ప్రతి ఒక్క ఉత్తరమును ప్రభుత్వమువారి ప్రత్యేకపరిశీలన మందితీరవలసినదే. ఒక్క దినమున పదునొకండువేల ఉత్తరములు! ఇది యేమి చెప్పును? అధ్యక్షుడు రూజువెల్టును, అమెరికాసంయుక్త రాష్ట్రములందలి ప్రతివ్యక్తియు సోదరులై ప్రభుత్వమున భాగస్వాములై యున్నారనియే కద! దినమునకు పదునొకండువేల ఉత్తరములు!!! ప్రపంచచరిత్రలో ఇట్టిది ఈవఱకు కనబడలేదు, వినబడలేదు. రూజువెల్టు దయార్ద్రమైన మానవహృదయమే కని విని యెఱుగని ఈ విశేషమును ప్రపంచచరిత్రలో కలిగించినది.

—క్రిస్టియన్ సైన్సు మానిటర్.

* * *

## బెర్నార్డుషాగారి వ్రాతగది.

“థేమ్సునదిగట్టున ఉన్న, వైట్‌హాల్‌కోర్టు అను భవనమునందలి ఒకపెద్ద పొడుగుపాటి గదిని బెర్నార్డుషా తన ఆఫీసుగదిక్రిందను, వ్రాతగదిక్రిందను ఉపయోగించుకొనును. ఈ గది గవాక్షములనుండి థేమ్సు స్రవంతి, దానిమీది పలువంతెనలు చక్కగా చూడనగుచుండును. షా స్వంతగ్రంథభాండాగారము మిక్కిలి పెద్దది. ఆగదియందలి బీరువాలన్నియు షా స్వయముగ ఎంచుకొని కొనుక్కొన్న గ్రంథములతో పిక్కటిల్లియున్నవి. షారచితగ్రంథములయొక్క పెక్కు కూర్పులు అందున్నవి. ఆగదియందలి చిత్రములలో షా యొక్క ముత్తాతయగు సాండ్‌పిట్సురకు చెందిన రాబర్టుషాయొక్క నూనెరంగుల చిత్రమొకటిగలదు. ఆరు ఫైలింగుకాబినెట్లు; షాగారి కార్యదర్శి—శ్రీ—బల్ల, టైపురైటరు; సొంపుగ అలంకరింపబడి పరిశుభ్రముగ నుంచబడిన చదునైన షా ఉపయోగమునకు ప్రత్యేకింపబడిన ఒకపెద్ద వ్రాతబల్ల ఆగదియందలి ఇతరసామగ్రి.”

—హేడన్ చర్చి.

## సాక్షాత్కృతి

౧

తల్లీ! ఆంధ్రపురంధ్రి! ఇప్పటికి
మూతల్ వడ్డ నేత్రమ్ము లు
త్ఫుల్లాంభోజము లయ్యె, నీ వనగ
నేమో ఎంచుకోలేని యీ
యుల్లమిన్నంతకు తల్లడిల్లినది; నీ
ఊహాతిపాతాకృతుల్
తెల్లంబైనవి నేటి కీజడుని బుద్ధిన్
ప్రేమవారాన్నిధీ!

౨

తెనుగుం దేశము పుట్టినిల్లు, గురులుం
దిద్దించి నా రోనమాల్
తెనుగుం బాసను; యీశరీర మిది తల్లీ!
పుష్టి చేకొన్న దీ
తెనుగుంబంటల, జుట్టపక్కములు నీ
తెన్గుల్; సమస్తంబు నీ
తెనుగేయంచు నెరింగితిన్ ధనమదాం
ధీభూతచిత్తమ్మునన్

౩

నిలువన్ నీడయు కూడుగూడ కరవౌ
నిర్భాగ్యదేశీయు లా
ర్తుల కంఠమ్మున నీదు వేదన;-వెతల్
దోగాడు నాచూపులన్
చెలువుం బాసిన నీ ముఖమ్ము కను
పించెన్ సత్యమిన్నాళ్ళకుం
దెలిసెన్ నీ కలరూపమెల్లయు నమస్తే
అస్మదాంధ్రావనీ!

—బొడ్డు బాపిరాజు.

# సర్ హెన్రీ రాయిస్

[కూటికొఱకు టెలిగ్రాముల బంట్రోతుగపనిచేసిన యాతడు లక్షలకొలది రాబడిగలవారికికూడ విలాసవస్తువుగనున్న రోల్సురాయిస్ కారును నిర్మించిన విచిత్ర వృత్తాంతకథనము.]

శ్రీపిఠాపురముమహారాజావారు ముందటి వత్సరము తనకుమారుని జన్మదినోత్సవసందర్భమున శ్రీవారికి రోల్సు రాయిస్ కారును బహుమానముగ ఇచ్చియుండిరని ఆంధ్రపత్రికలో చదివియున్నాము. సంవత్సరమునకు పదమూడులక్షల రాబడిగల యొక మహారాజు తనకుమారునకు జన్మదినబహుమానముగ ఈయదగిన ఆ రోల్సు రాయిస్ కారు విలువ ఎంత? నలుబదివేలు. ఒక్క కారు నలుబదివేలు ! కోటీశ్వరులకుకూడ అది విలాసవస్తువే. మోటారులలో కోహినూరు అనదగిన ఆరోల్సురాయిస్ కారు నిర్మాతఎవడో, అతని జీవితచరిత్ర మేమియో తెలిసికొనుటకు పలువురకు ముచ్చటగ నుండక మానదు.

ప్రపంచము ఎందఱో గొప్పవారిని చూచినది. ఆ గొప్పవారిలో ఏ ఒక్కరుగూడ తమజీవితకాలమునందే తమకు శిలావిగ్రహము ప్రతిష్ఠింపబడి గౌరవింపబడుట చూచియుండలేదు. అట్లు చూచినవాడు ప్రపంచ చరిత్రలో ఒక్కడే ఆంగ్లేయుడుగలడు. ఆ అతిలోకుని నామము హెన్రీరాయిస్. శిలావిగ్రహము 1924-లో డెర్బీపట్టణమున ప్రతిష్ఠింపబడి బహిరంగపఱుపబడెను.

ఇట్టి అతిలోకగౌరవమునందిన హెన్రీరాయిస్ 1863 లో పీటర్‌బరో చెంతగల ఆల్టువాల్టన్ నందు పుట్టెను. ఆతడు పుట్టినఇల్లు దారిద్ర్యశార్దూలమునకు విడిదిపట్టు. తండ్రి ఒకపిండిమరకు యజమాని. ఊరిలోని వారికందఱకును రొట్టెలకై పిండియాడించి ఇచ్చుచుండిన రాయిస్‌తండ్రి తనఇంటిలో అందఱికి కడుపునిండ రొట్టెలుకూర్చుటకు తఱుచు చాల కష్టపడుచుండువాడు.

ఎట్లో సగమాకలియైన తీర్పగలుగుచున్న రాయిస్ తండ్రి రాయిస్‌బాల్యముననే చనిపోయెను. ఇక పూటబత్తెముమాత్రమైనలేదు పూటబత్తెమునకే కఱవుఏర్పడినప్పుడు చదువుసంధ్యల కవకాశమేది? చదువుమానెను. 1873 లో తనపదవఏట రాయిస్ వీధులలో వార్తాపత్రికలమ్మి నాలుగుపైసలు సంపాదించుటకు దొరకొనెను. అది అతని మొదటిఉద్యోగము. ఇంగ్లండులో సుప్రసిద్ధమైన న్యూసు ఏజంటులగు వి. హెచ్. స్మిత్ అండ్ సన్ అనువారు యజమానులు. అయితే రాయిస్ గాడిద, గంధపుబస్తాలమోతవలె న్యూసుపేపర్ల అమ్మకము సాగించలేదు. దినములో అమ్మకము మందముగనుండుసమయములందు ఆతడు తనకడనుండు న్యూసు పేపర్లు చదువువాడు, క్రొత్తమాటలకు అర్థము నేర్చుకొనువాడు.

విద్యాకాంక్ష ఉండినది. పదమూడు వత్సరములు నిండులోపల ఆత డెట్లో ఒకసంవత్సరము పాఠశాలకు బోయి విద్యాభివృద్ధి కావించుకొనగలిగెను. న్యూసు పేపర్ల అమ్మకముమాని ఆతడు పోస్టాఫీసులో ఉద్యోగమునకు కుదిరెను. పనిచేయుటయందు ఇష్టము, హుషారు, చుఱుకుతనము చూపువాడు. ఇంటింటికి తంతివార్తలుగొనిపోవుటలో ఆతడు ఆఫీసులోని తనతోడివారలకంటె తృప్తికరముగా పనిచేయువాడు. ఆచిన్నతనమున ఆతనికి ఎప్పటికైన తానొక ఇంజనీరును గావలయునని యుండునది. తంతివార్తలుబట్వాడాచేయు పనిలో మూడువందల అరువదియూరు దినములు ఆతడు వెళ్ళద్రోయునప్పటికి ఆతని అదృష్టరేఖ బయలుపడెను. గ్రేట్ నార్తరన్ రైల్వేవారి డన్‌కాస్టరునందలి వర్కుషాపులో అప్రెంటిస్ ఉద్యోగమును సంపాదింపగలిగెను.

ఒకనాటి ఉదయమున ఆతడు టెలిగ్రాములు బట్వాడాచేయుచుండెను. మరునాటిఉదయమున ఆతడు ఆఫీసుకువచ్చినది తనకు పోస్టాఫీసువారిచ్చిన

యూనిఫారముదుస్తులను ఇచ్చివేయుటకును, తోడిపని వారుగానుండినవారి సెలవుగొనుటకును. పెద్దపెద్ద మెషీనులతో నిండియున్న ఒక విచిత్రప్రపంచమనదగిన రైల్వేవర్కుషాపులో ఆతడిపుడు కోర్కెతీగెలను కొనసాగించుచున్న పౌరుడు.

తాను కాంక్షించినపని ఈరీతిది. కావున ఆతడీ పనిలో తనకున్నశక్తిని, ఉత్సాహమును సమగ్రముగ ఉపయోగించి జయమునందుటకు దృఢనిశ్చయుడయ్యెను. ఆ ఇంజనీరింగు వర్కుషాపులో ఆతడు మితభాషియైయుండి నేర్చుకొనగలదంతయు నేర్చుకొనువాడు. పనిముట్లు మోయువాడు; స్క్రూలుతిప్పి తీయువాడు; వానిని తిరిగి బిగించువాడు. ఇంజనులక్రిందదూరి పని చేయువాడు. ఇంజనులమీదకును ఎక్కువాడు. వానిలో దూరువాడు. రాడ్డులనువిప్పి విడదీయువాడు. సమ్మెటతో పనిచేయువాడు. ఆకురాయి ఉపయోగించువాడు. మెషీనులకు తైలాభ్యంగనము గావించువాడు. ఇంజనులనిన ఆతనికి ప్రాణములకంటె ప్రియతరములు. వానినిగూర్చిన జ్ఞానము దినదినమును ఆతనికి అతిశయించుచుండెను. డన్‌కాస్టరు వర్కుషాపులో నాలుగు సంవత్సరములుండి ఆర్జించిన అనుభవజ్ఞానమే ఆతనిభావి జయమునకు పునాదియయ్యెను.

అప్రెంటిసుగా నుండినంతకాలమును ఆతడు విశేషముగ నేర్చుకొనుచుండెనే గాని విశేషముగ ఆర్జించుటలేదు. ధనము కావలసియుండెను. కావున అప్రెంటిస్‌షిప్పు ముగియకపూర్వమే ఆతడావర్కుషాపును వదలి విశాలవిశ్వమున ఉద్యోగాన్వేషణమునకు దొరకొనెను. వర్కుషాపులోని ఆతని పైఅధికారి ఆతనికి ఒక మంచి యోగ్యతాపత్రమునిచ్చి, కరస్పర్శ గావించి, శుభమగుగాక యని దీవించి పంపెను. రాయిస్ అభివృద్ధి చరిత్రలో మఱియొకప్రకరణము ముగిసెను.

రైలు ఆతనిని లీడ్సుపట్టణమునకు గొనిపోయెను. పదునెనిమిదేండ్ల యువకుడు. ఉద్యోగము దొరుకునని కొండంత ఉత్సాహము. చెంతగల వర్కుషాపులోనికి ఆఉద్యోగాన్వేషి వెళ్లెను. కాని ఖాళీలులేవు. డన్‌కాస్టరు అధికారి తనకిచ్చిన యోగ్యతాపత్రమువలన తనకు ఉద్యోగము దొరకకపోవదను ధైర్యముతో ఆతడు మఱియొకవర్కుషాపులోనికి వెళ్ళెను. ఇచ్చటను నాస్తిశబ్దమే. ఎన్నియోవర్కుషాపులలోనికి వెళ్ళెను. సున్నపుపిడతలే ఎదురయ్యెను. ఉదయమున ఉన్నఉత్సాహము ఇప్పుడులేదు. సాయంకాలము అగుసరికి అలసట మిగిలెను. ఉద్యోగముదొరుకునను ఆశ అడగారెను. కొద్దిపాటి ధనమునకు రాగల ఆహారము - విశేషధన వ్యయమునకు అక్కరలేని పడక. అయ్యు ఆతనికడ నున్న మొత్తము తగ్గిపోయెను. లీడ్సుపట్టణమున ఆప్రథమరాత్రి ఆతడట్టిపరిస్థితులలో నిద్రపోయెను.

మఱునాడును అదృష్టములో మార్పులేదు. ఆమఱునాడును అంతే. ఆశాలేశమునైన చూపకుండ రోజులిట్లే గడచిపోవుచుండెను. కాళ్ళతీత - హృదయభారము. పక్షముదినములు ఆతడు పట్టణమంతయు గాలించెను. ఒక్కచోటకూడ ఆతనికి స్వాగతములేకపోయెను ఆతడు తిరిగి ఇంటికిపోయి యుండును. కాని ఇంటిదగ్గర పొయ్యిలో పిల్లిని లేవగొట్టుటకే గదా ఆతడు లీడ్సువచ్చినది? ఇంటికిపోయి ఏమిచేయును? అంతవఱకు ఆతడు లీడ్సుపట్టణమునసుండి చేసినదేమి? తనతో తెచ్చిన కొద్దిపాటి ధనములో చాలభాగమును వెచ్చించుట. ఆవ్యయమే ఆయువకునకు హృదయవిదారకముగ నుండెను.

పదునాలుగవనాటి ఉదయమున ఆతడు ఉద్యోగముకొఱకు ఒక ఆయుధశాలకుబోయెను. అచటి మేస్త్రీ ఆతనియోగ్యతాపత్రమును చూచెను. 'సరే. మెషీను వాడుముట్లపనిలో చేరుము.' అనెను. ఆమేస్త్రీని ఆతడు హృదయపూర్వకముగ నమస్కరించి పనిలో ప్రవేశించెను. అది **1881**-వ సంవత్సరమున. గడియారము ఉదయమున ఆరుగంటలుకొట్టు సరికి ఇతర పనివారలతో ఆతడు మెషీనుకడనుండువాడు. పగలంతయుపని. గడియారము చిన్నముల్లు తిరిగి ఆరు అంకెమీదకువచ్చునది. అయినను పనివారలకు విడుమరలేదు. రాత్రి పదికొట్టువఱకు పనిచేయుచుండవలసినదే. పైగా ప్రతి శుక్రవారము రాత్రిఅంతయు ఆతడు పనిచేయవలసియుండెను. వారమునకు ఒకరాత్రిఅంతయును, దిన

మునకు పదునారుగంటలునుపని. ఇట్లే ఆతడు పలుమాసములు శ్రమపడెను.

ఎలక్ట్రిక్ దీపముల కవి ప్రారంభదినములు. ఎలక్ట్రిక్ దీపములను వ్యాప్తిలోకి తెచ్చుటకై ప్రారంభింపబడిన ఒకకంపెనీలో నతనికప్పుడు ఉద్యోగము దొరకెను. ఆఉద్యోగసందర్భమున ఆతడు లండను వచ్చెను. ఇద్దరుచేయుపనిని తానొక్కడే చేయుచు శ్రమపడుటకుతోడు ఆతడు ఒక అధ్యాపకుని అభిమానమును చూఱగొని ఆతనివద్ద సాయంకాలములందువిద్యాసముపార్జనము గావించువాడు. బాల్యమున విద్యకు నోచుకొనలేదు. ఆలోపము నాతడు పెద్దవాడై తీర్చుకొనెను. ఏడాదిలో అతడు అద్భుతమైన విద్యాభివృద్ధి నందెను. కంపెనీఅధికారులు ఆతని తెలివితేటలు గుర్తించి ఎలక్ట్రిక్ లైట్ అండ్ పవర్ కంపెనీవారి లివర్ పూల్ బ్రాంచికి ఛీఫ్ ఎలక్ట్రీషియన్ గా నియమించిరి.

దారిద్ర్యమనిన ఏమియో తెలిసినవాడగుట ఆతడు ఎప్పుడును పొదిమిగానుండువాడు. కారణాంతరములచే లివర్ పూల్ కంపెనీ దివాలాయయ్యెను. అప్పుడు రాయిస్ తాను స్వయముగ వ్యాపారము ప్రారంభించుటకు నిశ్చయముచేసికొనెను. మాంచెస్టరుపట్టణమును ప్రధానకార్యస్థానముగ చేకొని అచట 'రాయిస్ లిమిటెడ్' అను నామముతో కంపెనీ స్థాపించెను. డైనమోలు, ఆర్కుల్యాంపులు చేయుట. ఇట్లు ఆతడు వీధులలో విద్యుద్దీపముల నేర్పాటుచేసినవారిలో నొకడయ్యెను.

ఆ యువకుడు ఎంజనీరింగు, మెషినరీశాఖలయందు తనకుగల విశేషవిజ్ఞానమునకు మెఱుగుపెట్టునట్లు విద్యుచ్ఛక్తివిషయమున విశేషానుభవమును సంపాదించెను. ఇట్లు మూడుశాఖలయందు మంచి అభినివేశముగలవారు ఆ రోజులలో పెద్దవాండ్రయందే కానరాకుండిరి. ప్రజలీవిషయమును గుర్తించిరి. రాయిస్ లిమిటెడ్ కంపెనీకి వచ్చు ఆర్డర్లకు మితిలేకుండెను. ఒక్క ఆర్డరుకూడ తొందరలో నిర్వర్తింపబడదు. ఏ మాత్రము అసంతృప్తిగనున్నను తిరిగి చేయవలసినదే. ప్రతిఒక్కపనియు ఆతనిపూర్తిశక్తివినియోగమునకు నోచుకొనుచుండెను.

ఏదైన ఒక్కదానియందు స్పెషలైజ్ చేయుటకు ఆతడు తలంపుగొని పెద్ద ఆకారమున ఎలక్ట్రిక్ క్రేను (కప్పీలయంత్రము)ల నిర్మాణమునకు గడంగెను. అప్పటికి చేయబడుచున్న ఎలక్ట్రిక్ క్రేనుల కెనికిని లేని క్రొత్తసౌకర్యములు రాయిస్ నిర్మించిన క్రేనులకుండెను. అగుటచే ఆ క్రేనులకు ఆర్డర్లు అపరిమితముగ వచ్చినవి. నేటికిని రాయిస్ కంపెనీవారు ఆక్రేనులను చేయుచునే యున్నారు. వాని నుపయోగించినవారు అవి కారులలో రాయిస్ కారువలెనే క్రేనులలో రాయిస్ క్రేనులు ఉత్తమములై యున్నవని చెప్పుదురు.

ఈ ఇంగ్లీషుఇంజనీరునిదృష్టి కారులవైపు మరలిన విషయము విచిత్రమైనది. విఱిగిపోయి రోడ్ల పక్కన పడియుండు—మోటారులకు ప్రారంభదినము లనదగిన ఆనాటి—మోటారులు కొన్ని ఆతనిదృష్టి నాకర్షించినవి. ఆత డొకకారును విలిచెను. నడచుచుండ భరింపరానిశబ్దము. మెషిను తఱుచు చెడుటగలదు. వాని యంత్రనిర్మాణమునందలి లోతబిసీళ్ల అవగాహనమునకు దొరకొనినాడు. దొరకొనినచో ఏదైన పూర్తిగ చేయువఱకు ఆతడు తృప్తిపడువాడుకాడు. ప్రపంచమునందలి ఏదేశమునగాని చేయబడనిరీతిని అతిసుందరమును, అతిబలిష్ఠమును అగు కారును నిర్మించుటకు ఆతడు సంకల్పించెను. నడుచునపుడు శబ్దముండరాదు. మెషిను తఱుచు చెడ దు. రాయిస్ వంటి ప్రఖ్యాతుడగు ఇంజనీరు విషయమునకూడ అది స్వప్నలోకమున బుట్టిన తలంపే అని చెప్పవలసియుండును. కాని ప్రజ్ఞాధురీణుడగు రాయిస్ దానిని నిజమొనర్చెను. తన పనివారలు క్రేనుల చేయుచుండగా తాను రెండు సిలిండరులుగల మొదటి రాయిస్ కారును చేయుటకు పూనుకొనెను.

కారులు తయారుచేయుటకు ప్రారంభించిన ఆక్రొత్త దినములలో రాయిస్ చేత సమ్మెటపట్టుకొని ఫ్యాక్టరీ అంతయు కలయదిరుగువాడు. తనపేరును ఏదైన ఒకటి తగియుండలేదని తలంచునో దానిని సమ్మెటపేటులలో

ఛిన్నాభిన్నముచేయువాఁడు. నేటికిఁకూడ ఆపద్ధతి అమలునందున్నది. అందుమూలమున కంపెనీకి ఏడాదికి ఎన్నియో వేలపౌనులు వ్యయమగుచున్నది. అగుగాక! ప్రతిఅంశమునందును శ్రేష్ఠత్వమునకు నోచుకొనియే కారు ఫ్యాక్టరీనుండి విక్రయశాలకు పోవుచుండెను.


గౌరవనీయుఁడు హెచ్. ఎస్. రోల్సు అను మంత్రియొక్క యువకుఁడు, మోటారువిషయములందు విశేషాభిరుచిగలవాఁడు - ఒక ప్రదర్శనమున రాయిస్ మోటారునొకదానిని చూచెను. ఎంజనీరింగు శిల్పమునకు రూపమనదగిన ఆ రాయిస్‌కారున కాతఁడు ముగ్ధుఁడైనాఁడు. రాయిస్ నిర్మించు అన్నికారులను అమ్మిపెట్టుటకు పూనుకొనినాఁడు. రాయిస్ మోటారులు చేయుచు కొనువారికొఱకు చూచుచుండెను. మోటారువర్తకుఁడు రోల్సు ఫ్రెంచిమోటారులు అమ్ముచు ఇంగ్లండుదేశమున వానితో పోటీకితాళఁగల కారులు తయారగుటను వాంఛించుచుండెను. ఫలముగా 1904 లో రోల్సు రాయిస్ లిమిటెడ్ కంపెనీ స్థాపింపబడెను. కార్లు వారిద్దరి నామములతోడను చెలామణియగుచుండెను. ఒకఁడు గొప్ప శిల్పి, పేరుగాంచిన ఇంజనీరు రెండవయతఁడు మోటారు వర్తకప్రపంచమున చిరప్రతిష్ఠనార్జించినవాఁడు. ఈ భాగస్వాము లిద్దరును కలిసి నేటికి ముప్పదివత్సరములుగ రోడ్లపైరాజై క్రాలుచున్న రోల్సు రాయిస్ కారును లోకమునకు ప్రసాదించిరి.

ఏ ఒక్కరికంటెను తాను చేసినది ప్రశస్తతరముగా చేయుచుండుటచేతనే రాయిస్ జయమునందెను. శ్రేష్ఠమైనదికాని అతనికి తృప్తినీయకుండెను. కావుననే గత ఐరోపా మహాసంగ్రామసమయమున ప్రతి ఎనిమిది ఇంగ్లీషు గాలివిమానములందును ఐదు రాయిస్ ఇంజనులతో—చిన్నతనమున స్వగ్రామమునందు పొట్టకొఱకు వీథులలో వార్తాపత్రికలమ్మినవాఁడు నిర్మించిన ఇంజనులతో—కూర్చబడెను. అట్లాంటిక్ మహాసముద్రమును పదునారుగంటలలో నతిక్రమించిన గాలివిమానమును నడపినది రాయిస్ ఇంజనే. మఱియొక రాయిస్‌ఇంజను ఇంగ్లండునుండి నేరుగా ఆస్ట్రేలియాకు ఎగిరివెళ్ళిన మొదటి గాలివిమానమును నడపెను. రాయిస్ 1907 లో నిర్మించిన ఆరు సిలిండరులకారు ఎడతెగక ఒక్కదమ్మున పదునైదువేల మైళ్ళు పరుగెత్తి నేటికికూడ అతిక్రమింపబడని రికార్డును సంపాదించెను. తన దగ్గర ఉన్న కొద్దిపాటిధనము సెలవైపోవు లోపల ఏదైన నొక ఉద్యోగమును సంపాదించుటకు లీడ్సుపట్టణపు వీథులలో కాళ్ళు అరిగిపోవునట్లు తిరిగిన యువకుఁడే ఈ అద్భుతకార్యములు జరుగుటకు అవకాశము కల్పించెననుట ఆశ్చర్యములలో కెల్ల ఆశ్చర్యమైనది.

రోల్సు రాయిస్ కారులు చేయబడు కర్మాగారము డెర్బీపట్టణమునగలదు. అందుపనిచేయువారిసంఖ్య ఆరువేలు. రాయిస్ విచిత్రచరిత్ర ఇతర ప్రదేశమునకంటె డెర్బీలో బాగుగా తెలియబడియుండుట డెర్బీ పౌరులు హెన్రీ రాయిస్ గౌరవార్థము ఒక శిలావిగ్రహమును ప్రతిష్ఠించిరి. 1930 లో అతనికి బారొనెట్టుహోదా ఈయబడెను. 'చేయదగుపనిని ప్రశస్తతముగ చేయుట లెస్స' అనునీతిని రాయిస్ జీవితము ప్రదర్శించుచున్నది. మోటారు నిర్మాతలలో రాయిస్ సాటిమేటిలేనిరాజు. ఏపనిచేసినను సర్వోత్కృష్టముగా నుండునట్లుచేయుట అతని ఆశయము. లోపరహితత్వము కలిగినగాని అతనికి తృప్తిలేకుండెను. పరిపూర్ణతకొఱకు ప్రయత్నించి అతఁడు ఫలసిద్ధినొందెను.

అతని జీవితము బాలురకును, యువకులకును ఆదర్శముగ చేకొనదగియున్నది. చిన్నతనమున అతనికంటె పేదవారుగనుండువారును, బాల్యమున లీడ్సుపట్టణమున ఆయుధాగారమున అతఁడుపడిన శ్రమకంటె హెచ్చు శ్రమపడవలసినవారును, లండనులో విద్యకొఱకు ఒక్కసంవత్సరము అతఁడుచేసిన పరిశ్రమకంటె హెచ్చు పరిశ్రమ చేయవలసినవారును చాల తక్కువగనుందురు. అయినను ఆ యువకుఁడు పెరిగి పెద్దయై మోటారు ఇంజనీరులలో అతిలోకుఁడయ్యెను; మోటారు ప్రపంచమున, విమానప్రపంచమున శ్రేష్ఠత్వమునకు అతని శిల్పము అవధియయ్యెను.

1933-వ సంవత్సరము ఏప్రిలు 28-వ తేదీని రాయిస్ దివంగతుఁడయ్యెను.




# రాజపాళెయమందలి ఆంధ్రక్షత్రియులు

(తమిళ దేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయము మందలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

దారిద్ర్యమునుండి ఇతరజాతులు సులభముగా తప్పించుకొను మార్గములు కొన్ని మారాజులకు మూయబడియున్నవి. సాగుబడిచేయు భూమి నానాటికిని విభాగింపబడి సన్నగిల్లుచున్నది. జనసంఖ్య అపరిమితముగా పెరిగిపోవుటయు అప్పు లెక్కువగుటయు ఇందుకు కారణములు. అట్టివారి దారిద్ర్యము తొలగవలెనన్న క్రొత్తభూములుండవలెను. కాని సాగుబడికొదగు భూము లన్నియు ముందుగనే ఇతరులచే నాక్రమింపబడి యుండుటచేత, ఇతర గ్రామములలో నున్నభూముల గొనవలసియుండును. అట్లు చేయజాలనివారు దరిద్రదేవతచే పీడింపబడి కష్టములపాలగుచున్నారు. పెద్దచేప చిన్నచేపలను మ్రింగి పెద్దదగు విధమున పెద్దరాజు చిన్నరాజుల మ్రింగి పెద్దవాడగుట తటస్థించుచున్నది. వ్యాపారాదుల కలవాటుపడియుండనివారును వ్యాపారపోటీవలన లాభము గడించలేనివారును తమకున్న స్వల్పభూమినే వ్యవసాయముచేసి జీవింప బ్రయత్నించి అట్లు చేయజాలక అప్పులపాలగుచున్నారు. విదేశముల కేగినగాని బ్రతుకుదోవ కాన్పించుట లేదు.

భూవసతి యెట్లున్నదో గృహవసతియు నట్లేయున్నది. పూర్వము తనకై తాత, కట్టించుకొనిన ఇంటిలో నేడు అయిదారుగురు భాగముల బంచుకొనవలసియుందురు. అది విడిచి వేరొకతావు సంపాదించుకొనుట వ్యయప్రయాస సాధ్యమైనది. ఐనప్పటికిని రాజులవీథిని విడిచిపెట్టి ఇతరజాతులతో చేరయుండుట కొప్పుకొనినగాని అట్టి ప్రత్యేకమైనతావు లభింపదు. అందుల కంగీకరింపక ఆ యైదారు కుటుంబములవారును, ఆచిన్నయింటియందే కాపురముండవలసి వచ్చుచున్నది. వసతిగలిగిన యిండ్లు లేకపోవుటవలన ఎన్నియో అనర్థకములు సంభవించుచున్నవి.

బీదతనమును తప్పించుకొనుటకై యితరజాతులవారు గ్రామాంతరములలో బ్రవేశించి జీవనోపాయము చూచుకొనగలరు. కాని మాగ్రామమందలి రాజుల కాయవకాశముకూడ లేకుండనున్నది. తనబంధుమిత్రులనందరిని వదలిపెట్టిపోవుటయందలి కష్టములేగాక దానిని మించిన ప్రతిబంధకముకూడ ఒకటి గలదు. అది కులకట్టునకు సంబంధించినది. ఈగ్రామముగాక వేరెక్కడను తమకులస్థులు లేనందున, అన్యగ్రామములలో బ్రవేశించగనే వేషభాషాదులును, గుణస్వభావములును మారి క్రమముగా వారియందలి క్షత్రియత్వమే లోపించిపోవును. దీనికి సంసిద్ధులైనుండి అన్యగ్రామమున స్థిరపడువారెవరైననుందురా? కనుక దారిద్ర్యమునే తలపై మోసికొని తమయూరియందే యిడుములగుడుచుచుందురు.

అందువలన కుటుంబసహితముగ బోవ సాహసింపక ఒంటరిగనే అన్యగ్రామములకును, దేశములకును పోయియున్నవారందరో యున్నారు. వీరు అన్యుల భూమిని కౌలుకు తీసికొనియు, అడవులను గుత్తకు గొనియు, ఇతర వాణిజ్యములలో బ్రవేశించియు జీవనోపాయము చూచుకొనుచు అప్పుడప్పుడు ఇంటికి వచ్చుచుందురు.

మా గ్రామపురాజులకు సంబంధించినంతవఱకు గ్రామాంతరపరిశ్రమలలో తేవారమను గ్రామమున యాలకుల తోటలు ముఖ్యముగా జెప్పదగినవి. తిరువాన్కూరు రాజ్యమందలి యేలకకొండలలో మాలోని ధనికులు కొందరు రెండువేల ఎకరములవఱకు తోటలనుకొని, వ్యవసాయము చేసి సహకారసంఘములపద్ధతిని వ్యాపారము చేయుచున్నారు. కాని ఇవన్ని ధనికులు చేయుచున్న పరిశ్రమలైనందున బీదలకే విధముననూ లాభించకున్నవి.

మా గ్రామములో మొత్తము 5 సహకారసంఘము లున్నను, రాజులకుగా ప్రత్యేకింపబడిన "భూపతిరాజు సహకారసంఘము" అను పేరుతో నొకసంఘము అత్యుత్సాహముతో పనిజేయుచున్నది. ఎందఱో బీదక్షత్రియులు దీనివలన ఉపకారము బొందుచుండుటయు, క్షత్రియులయొక్క వ్యావసాయిక పారిశ్రామిక విద్యాభివృద్ధులకుగాను ఈసంఘము గట్టికృషి జేయ సంకల్పించుకొనియుండుటయు సంతసించదగిన విషయము.

## సాంఘిక దురాచారములు

ఆర్థికపతనమునకు కారణములైన దురాచారములు కొన్నియు, ఆర్థికపతనమువలన జనించు దురాచారములు కొన్నియు, వాటియంతటయవియే కొన్నియు మాసంఘమున వ్యాపించియున్నవి. వివాహపద్ధతియందుండు లోపములు ముఖ్యముగా జెప్పదగియున్నవి. తల్లిదండ్రులకు బిడ్డలందరిమీదను ప్రేమయుండినను, అంత్యదశయందు పోషించువాడును, చనిపోయినతరువాత దహనశ్రాద్ధాదికర్మల నాచరించి, నరకమునుండి తప్పించువాడును అగు పుత్రునిమీదనే అధికప్రేమవాత్సల్యములు జూపుట లోకమునందు సహజమై యున్నది. కాని మా క్షత్రియమాతలదృష్టిలో, కొడుకుకన్న కూతురే ముఖ్యమైనదిగా నున్నది. ఇట్టి విపరీతభావమునకు కారణము అల్లునిమీది ప్రేమ మితిమీఱిపోవుటయే. ఆడబిడ్డ పుట్టినప్పటినుండియు తల్లి అమితసంతోషముతో కన్నులకద్దుకొనుచు పెంచి పెద్దదానిని జేయును. కొడుకులు చినిగినబట్టలు కట్టుకొనుచుండినను చూచి యూరకుండగలదు. కాని కూతురిని బంగారునగలతో యలంకరించకపోయిన తల్లి కొకక్షణమైనను నిద్రపట్టదు. శరీరదార్ఢ్యము, బుద్ధికుశలత, విద్యాసంపత్తి మొదలగునవి కుటుంబపోషణమును జేయవలసిన పుత్రునికి ముఖ్యముగ గావలసియున్నను తల్లి వీటిని గమనించక నిర్లక్ష్యము చేయుచున్నది. పెండ్లిజేయుటయే తడవుగా ఇంటిలోని ధనధాన్యాదులు కూతునింటికి ప్రవహింప నారంభించును. కనీసము వెయ్యిరూపాయలైనను స్త్రీధనముగా నివ్వనిదే యేపేదయిల్లాలును, తనకూతురికి పెండ్లిజేయ నంగీకరింపదు. పెండ్లిదినములలోచేయు మర్యాదలు చాలక అల్లుని తనయింటనే యుంచుకొనును. మిక్కిలి పేదకుటుంబమైనచో 3 మాసములును, సాధారణమైనదగుచో 6 మాసములను, ఈవిధముగా ఒకసంవత్సరము మొదలు అయిదారు సంవత్సరములవఱకును, ఒక్కొక్కచోట వధూవరులకు బిడ్డలుపుట్టునవఱకునుగూడ మామగారిఇంటియందే అల్లుడు పెండ్లికొడుకుభోగముల ననుభవించుచుండును. ఒకవేళ కూతురిని అత్తింటికిబంపినను పేరునకుమాత్ర మొకటిరెండువారము లుండి తిరిగి భర్తతో సహితముగా పుట్టినింటికి రావలసినదే. అత్త, గౌరవమునకు లోపమువచ్చునేమోయని భయపడి, చాటుచాటుగా నల్లునికిచ్చు ద్రవ్యమునకు లెక్కయేయుండదు. అన్నదమ్ము లెక్కువగా నుండు కుటుంబమయినప్పటికి, ముందు కూతురికిని, అల్లునకు ఖర్చుజేసి, పోగా మిగిలిన ఆస్తితోనే కొడుకులు తృప్తిపొందవలయును.

అవయస్కవివాహములు, తఱువాతిస్థానము నాక్రమించుచున్నవి. ఒక్కొక్కప్పుడు వరునికన్న వధువే చాలయేండ్లు పెద్దదిగానుండును. ధనమునకును, బాంధవ్యమునకును ఆశపడుటవలన యిట్టి వివాహములు కొంతకాలమునుండి తలయెత్తుచున్నవి. అరువదియేండ్లు నిండినపిమ్మట, రెండవ లేక మూడవవివాహము జేసుకొనుట, మాలో పూర్వమునుండి వాడుకలో నున్నను ప్రస్తుతము బహిష్కరించవలసినవానిలో దీనినికూడ జేర్పదగును.

ఇంతతో మా చరిత్ర ముగింపునొందుచున్నది. అన్యరాష్ట్రముననున్నను జాతి, భాష ఏకముగుటవలన ఆంధ్రులు మమ్ము తమలో నొకరిగ భావించుకొందురని నమ్ముచున్నాను.

# ఆరోగ్య విజ్ఞానము

౯. ఎండ వేడిమివలన కములిన చర్మమునకు

మనది వేడిదేశము. అందుచే వేసవికాలమున వేడి దుర్భరముగానుండును. వడగాడ్పులలోకూడ కార్యార్థులమై మనము బయటికి పోకతీరదు. ఎండలో నడచి నడచి వచ్చి నీడపట్టును చేరుటతోడనే చర్మము చిమచిమలాడును, చిఱుమంటలుపెట్టును. అట్టి సమయము లందు మన మేమిచేయవలయును? కొందరు చన్నీళ్ళ స్నానముచేయుదురు. ఇది తాత్కాలికముగ కొంతశాంతి ఇచ్చునట్లు కనిపించినను దేహారోగ్యమునకు భంగము కలిగించునదియని గుర్తింపవలసియున్నది. ఎండలో నడచినడచి వచ్చినవెంటనే చన్నీళ్ళస్నానము చేయుటచే దుర్బలదేహులకు తప్పక పడిసెముపట్టును. వేసవిలో ఎండవేళ చన్నీళ్ళస్నానముచేయుటచే ఒడలు ప్రేలును. ఎండ వేడివలన కములి మంటలుపెట్టు చర్మమునకు క్షీరస్నానము ఎంతయు ఉత్తమమైనది. చిన్న పళ్ళెరమున కొద్దిగ పాలుపోసి ఆపాలను స్పాంజితో గాని, మెత్తనిగుడ్డతో గాని కమలిన, మంటపెట్టు చున్న భాగములమీద నెమ్మదిగ అద్దవలయును. వెంటనే మంట తగ్గిపోవును; కమలిన శరీరము తిరిగి యథాస్థితినొందును. శరీరమునందలి వేడిని తగ్గించుటలో పాలను మించినదిలేదు. సన్నిపాతజ్వరమునందు శరీరము నందలి ఉష్ణమును తగ్గించుటకై రోగి చెంపలమీద పాల పొత్తులువేయ డాక్టరులు ఆదేశించుచుండుటను పలువురు గుర్తించియుందురు. వేడిచేసి కళ్ళుమంటలు పుట్టుట మొదలగు బాధలప్పుడు కళ్ళపై చనుపాల పొత్తులువేయుట ప్రతిసాంసారిగృహిణికిని తెలిసిన వైద్యప్రక్రియయే. ఎండలో వసివాడిన చర్మమునకు పాలు రసాయనమని వైద్యవేత్తలంగీకరించియున్నారు.

పాలుదొరకనిచో దోసకాయబద్దలను కమలిన చర్మభాగమును అద్దుట కుపయోగించుట మంచిది. దోసకాయబద్దలచే నెమ్మదిగ రుద్దుటవలనగూడ మంటలు తగ్గి చర్మము పసినొందును. తాటిముంజెలలోని నీళ్ళు చర్మమునకు పట్టించుటకూడ ఇట్టి సమయములందు చాలప్రయోజనకారిగ నుండును. తాటిముంజెలలోని నీళ్ళు పట్టించుట వలన శరీరము పేలకుండకూడనుండును. కాని ఇవి అనుకున్న అన్నిసమయములయందును దొరకుట దుర్లభము.

౯. సీమరేగుపండ్ల ఆహారపువిలువ

ఆరోగ్యపరిరక్షణమునకు అనుకూలించు ఫలములలో సీమరేగుపండును మించిన ఫలము మఱియొకటి లేదని నిస్సందేహముగ చెప్పవచ్చును. అన్నితత్త్వములవారును సీమరేగుపండ్లను తినవచ్చును. దినమునకు ఒక్కొక్క రేగుపండు తినుటచే డాక్టరుచెంతకు పోవలసినయక్కఱ ఎప్పుడును కలుగదను అర్థమువచ్చు సామెత ఇంగ్లీషులో కలదు. కాని దినమునకు ఒక్కొక్కరేగుపండు తినిన చాలదు. ఆహారపదార్థముగా సీమరేగుపండు రెండువిధములైన సుగుణములు కలిగియున్నది. సీమరేగుపండు ముతకగుజ్జుకలది. మెత్తని ఆహారపదార్థములు పోజాలని కొన్ని భాగములు మనకడుపులో కలవు. అట్టి భాగములకు చొఱబాఱుటకు సీమరేగుపండులోని ముతకగుజ్జు సమర్థమైయున్నది. సీమరేగుపండ్లలో సి. విటమినులు విస్తరించియున్నవి. శిరోజములకు, చర్మములకుకలుగు అనారోగ్యమునుండి మానవుని కాపాడు సి. విటమిను విస్తారము కలిగియుండుటచే సీమరేగుపండు ఉత్తమమైన ఆహారపదార్థమైయున్నది.

౯. మధ్యాహ్నకాలభోజనము

డాక్టరు ఇ. మేబెల్ హొకెన్‌ఫుడ్ అను వారు

'వ్యాపారస్థుల ఆరోగ్యము' అను తమగ్రంథమున 'మధ్యాహ్న భోజనము' అను విషయమును గూర్చి [illegible] ప్రారంభములో [illegible] [illegible] గలవారికే ఆభోజనము ఆరోగ్యప్రదమైయుండును. మధ్యాహ్నకాలభోజనమైనవెంటనే తిరిగి పనిచేయవలసి యుండువారు అందు ముఖ్యముగ మనస్సుతో పరిశ్రమ చేయువారు తమ ఆభోజనమును తేలికగ ముగించుకొని పని నంతటిని తీర్చుకొని సాయంకాలములయందే పుష్టాన్నభోజనమును చేయుట మంచిది. మనస్సు బాగుగా పనిచేయవలయుననుచో పనిచేయునంత కాలమును అది పుష్కలమైన రక్తప్రసారమును కలిగియుండవలయును. జీర్ణకోశమును, దానికి సంబంధించిన ప్రేగులును లెస్సగ వానివానికి విధింపబడిన కృత్యములను నిర్వర్తింపవలయుననుచో వానికిని పుష్కలముగ రక్తము సరఫరా చేయబడవలయును. ఎంతటి ఆరోగ్యవర్ధమాన శరీరమునగాని ఒకేసారి మనస్సునకును, జీర్ణకోశమునకును అవి లెస్సగ పనిచేయుటకు వలసినంత పుష్కల రక్తమును సప్లయిచేయగల సామర్థ్యము, రక్తపుష్టి ఉండజాలదని సుప్రసిద్ధ శరీరశాస్త్రవేత్తలందరును ఎలుగెత్తి చాటుచున్నారు. కాబట్టి జీర్ణకోశమునకును, మనస్సునకును ఒకేసారి మనము పనికల్పించుచో దేనికిని పుష్కలముగా రక్తప్రసారము దొరకక ఆరెండు అవయవములయందును ఏఒక్కటికూడ తనవిధికృత్యమును తృప్తికరముగా నెరవేర్పజాలకపోవును."

### ౬. అకాలమున తలవెంట్రుకలు తెల్లబడుచున్నచో

వయోవృద్ధులమైతి మనుభావము కలుగుదనుక రెండు మూడుతరములపూర్వమువరకును మానవుల తలవెంట్రుకలు తఱుచుగా నెఱయుచుండినవి. కాని ఇప్పుడన్ననో పలువురి తలవెంట్రుకలు బాల్యముననే నెఱయుటకు ప్రారంభించుచున్నవి. దీనికి కారణము ఇప్పటివారికి వలసినంత నిద్ర లేకపోవుటయేనని డాక్టర్లచే కనుగొనబడినది సినిమాలు, నాటకములు మున్నగు వినోదములకు తఱుచు పోవుచుండుటవలనను ; పరీక్షలకుగాను రాత్రులయందు చాలసేపు మేల్కొని చదువుచుండుట వలనను నేటివారికి వలసినంత నిద్ర లేకపోవుటచే వారి తలవెంట్రుకలు అకాలమున తెల్లబడుచున్నవి. ఈ దోషము సంస్కృతవిద్య ప్రశంసించు మనవిద్యార్థులయందు విస్తారముగ కనుపించుచున్నది. తలవెంట్రుకలు తెల్లబాఱుచుండుట గమనించినతోడనే అట్టివారు తమ నిద్రాకాలపరిమితిని హెచ్చింపవలయును. సాధారణము తాము నిద్రపోవు కాలమునకు ఒకటి రెండు గంటలు ముందుగనే పడకను చేరుచుండవలయునని. నిద్రాకాలపరిమితిని హెచ్చించుటకుతోడు పుష్టిగల ఆహారమును గొనుటయందును విశేషశ్రద్ధ వహింపవలయును. అజీర్తి కలిగించు ఆహారములు, విశేషమైనమధుర పదార్థములు, మసాలాదినుసులు, ఉద్రేకమును కలిగించు సినిమా నాటకములు మొత్తిగా దరికి చేర్చకుండనుండవలయును. బిరుసువెంట్రుకలకంటె మెత్తనివెంట్రుకలు చిరకాలము నల్లగనుండునని శిరోజములవైద్యమున లోకప్రఖ్యాతి గడించిన ఒకలండనుడాక్టరు చెప్పుచున్నాడు. దీనివలన బిరుసువెంట్రుకలు కలవారు తమ వెంట్రుకలు అకాలమున నెరయకుండుటకై ప్రత్యేకమైన జాగ్రత్తను వహింపవలసియుండుననుట సులభముగ ఊహింపనగుచున్నది. దీర్ఘకాలము ఏదైన ఒక రోగముచే తీసికొనుట మొదలగు అనారోగ్య స్థితులకు తావలమగుటచే గూడ తలవెంట్రుకలు తెల్లబాఱుట, రాలిపోవుట కలుగుచున్నవి. ఇట్టి సమయములందు డాక్టరులసలహా గైకొనుచో వారు లోహమిశ్రితములైన మాత్రలు, ఆసవములు, అరిష్టములు తినమని చెప్పుదురు. ఈమందులకుతోడు ఇపుడిపుడు డాక్టరులు తలను మంచుగడ్డచే చల్లబఱుచుట కూడ ఈవిషయమున ప్రయోజనకారిగానుండుటను కనుగొని తమతమ రోగులకు ఉపదేశించుచున్నారు. శిరోజములు తెల్లబడిపోవుచుండుటకు సందుగొనుచున్నంత రోగులు ఉత్తగములు ప్రాయము మొదలగు మనస్సునకు కష్టపరిశ్రమను గోరు పనులు చేయునపు తలపై మంచుగడ్డతో నిండింపబడిన టోపీని (ఐస్ క్యాప్) పెట్టుకొనునట్లు డాక్టర్లు ఆజ్ఞాపించుచున్నారు.

# ఇన్సూరెన్సు విషయములు

## జీవిత భీమా : కొన్ని దురభిప్రాయములు

ఇదివరకు ప్రజలకు 'యిన్సూరెన్సు' అననేమో అవగాహనము కాకుండెడిది. అనేకులు యిన్సూరెన్సు నొక వస్తువుగ నెంచుచుండిరి కాని యిటీవల యిన్సూరెన్సు ప్రచార మతితీవ్రముగ జరుగుచుండుటచేత, యిన్సూరెన్సు తత్వము నెరుగుటయే గాక, యిన్సూరెన్సు కంపెనీల ఆశయములను, స్థిరకీర్తిని గడించిన కొన్ని కంపెనీల పేర్లను సైతము, జనసామాన్యము తెలుసుకొనియున్నది. ఇట్టి యిన్సూరెన్సు వ్యాపకమునకు కంపెనీలు తయారు చేయు ప్రకటనపత్రములకంటెను, ప్రతినిధులయొక్క సంతతపరిశ్రమయే యెక్కువ చేయూత నొసగుచున్నదని చెప్పవచ్చును.

ప్రచారముజరిగినది, జరుగుచున్నది. కాని యిన్సూరెన్సు వ్యాపారమున అనుభవము పొందినవారికి తప్ప, యితరులమనసులలో ఇంకను ఇన్సూరెన్సునుగూర్చి సరియగు అభిప్రాయములు చిత్రింపబడలేదు. ఇన్సూరు చేయదలచినవ్యక్తి, కంపెనియొక్క మంచిపేరును, ఆర్థిక స్థిరత్వమును, వ్యవహారములు చక్కగ జరుపబడుచున్న వాయను విషయములను విచారించి సంతృప్తుడై భీమా చేయుచున్నాడు. అప్పటినుండి ఆకంపెని యందలి తన అభిమానమును పోషించుబాధ్యతను కంపెనిపైననే వదలుచున్నాడుగాని, ఇన్సూరెన్సుసూత్రములేవి, కంపెనీలు యెట్లు పనిచేయుచున్నవి, వాటి స్థిరత్వమెట్లు నిశ్చయింపబడినది, అను యిన్సూరెన్సుశాస్త్రవిషయములను గూర్చి చర్చింపడు. చర్చించుటకు వీలును లేదు. ప్రతివ్యక్తియు తనద్రవ్యమునకు తెరువునే గమనించుచుండును వ్యవహారవిషయములలో అతని కెక్కువ జ్ఞానముండును. పాలిసీఅమలులోనున్నపుడు కొన్ని సందేహములు కలుగుచున్నవి. వాటినిగూర్చి పాలిసీదారుని మనసులో ఒకవిధమైన అభిప్రాయముండును. కంపెనిచట్టము వేరువిధముగ నుండును పాలిసీదారుడు ఆశ్చర్యవిచారములకు లోనగుచున్నాడు. ఒక కంపెనీ గూర్చి, దానికి విరుద్ధమగు అభిప్రాయముల పొందియుండుట విచారణీయము. సామాన్యముగ ప్రజలచే నమ్మబడు విరుద్ధాభిప్రాయములేవి అని విచారించి, వాటిని పోగొట్టుట యిన్సూరెన్సుప్రచారకుల విధియై యున్నది.

ప్రజాసామాన్యముయొక్క అభిప్రాయములు విచిత్రముగనున్నవి. చక్కగ ఇన్సూరెన్సువ్యాపారముచేసి, వృద్ధిపొందిన భీమాకంపెనీలచే నిర్మింపబడిన భవనములను చూచి, 'యెంతద్రవ్యము వృథాఖర్చైనది?' అనికొందరు విస్మయపడెదరు. కొందరు, వారికివచ్చు గొప్పలాభములను ఏదోయొకవిధముగ ఖర్చుపెట్టవలెగదా?' యని సమాధానమిడెదరు. ఒకసారి పాలిసీదారుడుకాగానే, మరల యెపుడు భీమా హెచ్చుచేయదలచినను, మొదటి దఫా కట్టిన ప్రీమియముయెంతో, అంతే కంపెనీలు తీసుకొనవలెనని కొందరి అభిప్రాయము. పదివేల రూపాయలకు భీమాచేయదలచినవారు, వెయ్యిరూపాయలకు చేయదలచినవారికంటె పదింతలు హెచ్చు ప్రీమియము కట్టవలెననినచో ఆశ్చర్యపడెదరు. "ఏమి! ఇంతగొప్ప మొత్తమునకు యిన్సూరుచేయునపుడు తక్కువ ప్రీమియముకదా చెల్లింపవలెను!" హెచ్చు కొనుగోలునకు తక్కువధర యివ్వవలెనని వీరిమతము. భీమాకంపెనీలు

సాధారణముగ, 6 నెలలు, 3 నెలలు, ప్రతి నెల కొక సారి ప్రీమియములు కట్టువారివద్దనుండి వార్షికప్రీమియములు చెల్లించువారికంటెను కొద్దిగ హెచ్చు ప్రీమియము వసూలు చేయుదురు. ఇది కొందరికి అర్థముకానేరదు. మరికొందరికి యిన్సూరెన్సు నచ్చదు. 30 దినములు గడువులోపల ప్రీమియము చెల్లింపనిచో కట్టిన ధనమంతయు నష్టమగునని వీరిభయము. ఇదియొక విపరీతపుటాలోచన. మరికొందరి విపరీతము యింకొకతరహా గలది. తనమరణము సంభవింపక కంపెనీకి నష్టము కలుగనందున, తాను ప్రీమియములు కట్టుట మానుకొన్నచో తానిదివరకు కట్టిన కిస్తీలు వాపసుచేయవలెనని కోరుట. ఇట్టి విరుద్ధాభిప్రాయములన్నియు సామాన్యములు. ఏయేజంటయినను తగిన సమాధానమివ్వగలడు. కాని మరికొన్ని సందేహములు అంతశీఘ్రముగ వివరింపదగినవి గావు. అట్టిసందేహములను తీర్చుటకు యిన్సూరెన్సు పరిచయము యెక్కువగ కావలెను. వానిలో కొన్నిటిని పరిశీలింతము.

గొప్పకోశములకు (రిజర్వ్స్) నిమిత్తమేమి? మొదటి పొరపాటు అభిప్రాయమేమనగా: యిన్సూరెన్సు కంపెనీలు పాలిసీదారులకు కలుగజేయు లాభములకుగాను యెక్కువ వసూలుచేయుచున్నది, లేక, యిన్సూరెన్సుకంపెనీల రాబడిసొమ్మంతయు వారికి నిజముగ అక్కరలేదు. సుమారు 40 సం||లకు పూర్వము (అసెస్మెంటు కంపెనీస్) అను కంపెనీలుండినవి. అవి (నేచురల్ ప్రిమియం సిస్టం) అనగా స్వాభావిక కిస్తీ పద్ధతి ప్రకారము ప్రీమియములను వసూలుచేయుచుండెడివి. ఈపద్ధతి చాలాకాలమువరకు పనిచేయజాలదు. ఈకంపెనీలే యిపుడులేవు. ఈ (అసెస్మెంట్) కంపెనీలు (లెవెల్ ప్రిమియం) (సమానకిస్తీలు) కంపెనీల పైపై వ్యతిరేకప్రచారము కొనసాగించినవి. స్వాభావిక కిస్తీపద్ధతిక్రింద మొదటి సంవత్సరపుకిస్తీ, ఆసంవత్సరపు అపాయమునుమాత్రమే వహించుటకు చాలినదైయుండును. ప్రతిసంవత్సరము గడుచుకొలది, పట్టాదారుని జీవితమునకు అపాయము హెచ్చు, (అనగా మరణమాసన్నమగుచుండునుగాన). అందువలన ప్రతి సం||పు ప్రీమియము మునుపటి ప్రీమియముకంటె హెచ్చుగనుండును. ఈవిధముగ ఒక వ్యక్తియొక్క 27 సం||లో నూటికి రూ 10 కట్టిన, మరి 20 సం||లకంతయు రెట్టింపును, 80 సం||ముల వయసు వేళకు నూటికి 210 వంతు హెచ్చుగ కట్టవలసివచ్చును. చేతులుకాళ్ళాడుచు సంపాదనశక్తి కల్గినపుడే ప్రీమియములు చెల్లించుట కష్టమయిన, వయసు కానుకాను, శక్తిలేని సమయమున, అంతహెచ్చయిన ప్రీమియములు కట్టవలెనన్న, మిక్కిలి కష్టముకదా? (నేచురల్ ప్రిమియం) పద్ధతిక్రింద రిజర్వులక్కరలేదు.

(లెవెల్ ప్రిమియం) లేక సమానకిస్తీ పద్ధతివివరము లేవియో గమనింతము. ఈపద్ధతిక్రింద భీమాచేసినవ్యక్తి భీమాచేసిన మొదటిసంవత్సరములోనే మరణించినచో భీమామొత్తము నిచ్చివేయుటకు యిపుడెంతసొమ్ము కావలెను అని తీర్మానించబడును. ఇదేవిధముగ రెండవ సం||లో మరణించిన యిచ్చుటకుకావలసిన సొమ్మును, యిపుడెంతవసూలు చేయవలెను. 3 సం|| 4 సం|| యీ విధముగ మరణపట్టీ (మార్టాలిటీ టేబిల్) లో తెలుపబడిన కాలపరిమితివరకు గణించబడును. ఈ మొత్తములన్నియు కూర్చినచో, మరణకాల మెప్పుడువచ్చినను, భీమామొత్తమును యిచ్చివేయుటకు కావలసిన సొమ్ముయొక్క ప్రస్తుతపువిలువ తెలియుచున్నది అనగా పూర్తి జీవితపు భీమాకు, ఒకేధపాకట్టు కిస్తీయన్నమాట. కాని వార్షికప్రీమియములే కట్టుటకు సులభముగాన, ఒకేదఫాకట్టు కిస్తీకి సమానమగు వార్షికకిస్తీ యేదో జీవితపర్యంతము 'సమానము'గ నుండు కిస్తీయేదో, దానిని కనిపెట్టవలెను. 27-వ సం||న, నూటికి 17 వంతున ఏర్పడుచున్నది. (స్వాభావికప్రీమియం పద్ధతి ప్రకారం నూటికి పదిమాత్రమే అయినపుడు). సుమారు 24 సం||దాటినవెనుకగాని, 'సమాన'ప్రీమియము 'స్వాభావిక' ప్రీమియమునకు సరిపోదు. దానికవతల స్వాభావిక ప్రీమియము త్వరితముగ పెరిగిపోవును. (లెవెల్ ప్రీమియం) లేక 'సమాన' కిస్తీపద్ధతి రెండుభాగములు గలది. (1) రాబోవు ప్రతిసంవత్సరపు అపాయము నెదుర్కొనుటకు కావలసిన ద్రవ్యము (2) అంత్య సంవత్సర

ములలో ప్రతి సం॥ అపాయమునకు తగినంత ద్రవ్యము లేనందున కలుగు నష్టమును ఉపసంహరించుటకు ప్రథమసంవత్సరములలో చేర్చి, నిలువయుంచు ద్రవ్యము, ఈ రెండును చేర్చిన, మొత్తపుధనము వచ్చుచున్నది. ఈ సూత్రము ప్రాచీనకాలమునుండి వాడుకలోనున్నది. పుష్కలకాలమున ఐశ్వర్యమును దాచి క్షామకాలమున వాడుకరణి యున్నది యీపద్ధతి.

రిజర్వునిధి ఆవశ్యకతను మరియొకదెసనుండి విచారింతము. జీవితపు కంపెనిబాధ్యత, ఖర్చులు అప్పుడప్పుడు తనిఖీచేయబడుచున్నవి. పాలిసీయిచ్చినపుడు పాలిసీ కంట్రాక్టును సంబంధించిన యిరువురి (కంపెనియు, పాలిసీదారుడును) బాధ్యతలును సమముగనే యుండును. అనగా మరణకాలమున యిచ్చుటకు కంపెని ఒప్పుకొన్న సొమ్ముయొక్క ప్రస్తుతపు విలువయు, పాలిసీదారుడు చెల్లించుటకు ఒప్పుకొన్న ప్రీమియముల ప్రస్తుతపు విలువయు, సమముగానుండును. కాని ఒక్కొకసంవత్సరము గడుచుకొలది భీమామొత్తము యివ్వవలసిన కాలము సమీపించుటచే కంపెని బాధ్యత హెచ్చగుచుండుటయు, కట్టవలసిన ప్రీమియములు తగ్గుటచే పాలిసీదారుని బాధ్యత తగ్గుచుండుటయు సంభవించుచున్నది. వీటికిగల తేడాయేదో అదే ఆపాలిసీక్రింద కంపెని నిలువయుంచవలసిన సొమ్ము. ఈప్రకారము ప్రతి తరగతి పాలిసీల విషయములో గణించిన, కంపెనీ బాధ్యతలను నిర్వహించుటకుగాను కావలసిన మూలధనము యింతయని తెలియుచున్నది

రిజర్వులను సంబంధించిన యీ ప్రశ్ననే మరొకవిధముగ కొందరు అడుగుచున్నారు. "హక్కుల పరిష్కారమునకు (క్లెయిమ్సు) ప్రతిసంవత్సరము వచ్చు ప్రీమియముల రాబడి చాలినపుడు, ధనమునేల కూడబెట్టుచురావలెను?" అనేకకంపెనీలు రాబడికన్న హెచ్చుగ క్లెయిములివ్వవలసిన స్థితికిరాలేదు. రాబడికిని, క్లెయిములకునుగల సంబంధము ఆకస్మికమైనదని గట్టిగ చెప్ప నవసరములేదు పాలిసీలు తీసుకొనుకాలమున పాలిసీదారుల వయసు, తీసుకొన్న భీమాతరగతులు, కాలపరిమితి, మొదలగు అనిశ్చయములును, కంపెని స్వాధీనమున లేనట్టియు యగు కారణములపై ఇది ఆధారపడియున్నది. తనిఖీజరుగు సంవత్సరములో అమలులోనున్న పాలిసీలవిషయమున, అదివరకు పెరిగిన రిసర్వులేగాక, రాబోవు ప్రీమియముల మొత్తముగూడ (వడ్డీసహా) కలిపినగాని, మరణముచేగాని, భీమాకాలపరిమితి పూర్తియగుటచేగాని యివ్వవలసిన క్లెయిములకు చాలదని యిదివరకే తెలుపబడినది. ఒక కంపెనీలో పాలిసీలన్నియు బాల్యావస్థలోనుండవచ్చును. అపుడు ప్రీమియములనుండి రిజర్వులు నిలవబెట్టబడుటచే, కంపెని మూలకోశము వృద్ధియగుచుండును. మరియొక కంపెనీలో పాలిసీలు చాలకాలముగ నుండియుండవచ్చును. అపుడు వాటి రిజర్వులు పూర్తిగ పెరిగియుండును. తదుపరి ప్రీమియములలోగల నష్టమును సరిపుచ్చుటకు రిసర్వులనుండి ద్రవ్యము తీయవలసివచ్చును. మూలకోశము యిట్టిస్థితిలో వృద్ధికానేరదు. ఏవిధముగ భీమామొత్తము సమకూర్చబడినను, అనతికాలములోనో, నిదానముగనో క్లెయిములిచ్చుటకు రిజర్వుధనము కంపెనీలు వాడవలసియున్నది. కొత్తవ్యాపారము కొనసాగుచుండుకొలది, ప్రతిపాలిసీక్రింద ప్రత్యేకమగు రిజర్వు పెరుగుచుండును గాన ఎంతవ్యాపారము హెచ్చిన అంత రిజర్వు పెరుగును.

రాబడినుండి క్లెయిములిచ్చుటకు చాలనిస్థితి వచ్చుటకు చాలకాలముపట్టునని దీనిరహస్యము. అందువలననే నిజముగ దివాలాతీయుస్థితిలోనుండు కంపెనీలు, చూపరులకు మిక్కిలి ఉన్నతస్థితిలో నుండునట్లగుపడును. రాబడిద్రవ్యమునకును క్లెయిములకును సంబంధమేర్పరచి వాటివలన కంపెనీ మంచిచెడ్డల నెన్నుట యెంత పొరపాటో యిందువలన తెలియుచున్నది అట్టివారిని రక్షించుట కంపెనీలవిధియైయున్నది. వెనుకటి తరమువారికి కీడుకల్గించునట్లు యీతరమువారికి లాభమొనగూర్చుటకు యత్నించి, మన ఆర్థికస్థితిని బలహీనముగచేసికొనుటకు మనము ఒప్పుకొనరాదు.

—సశేషము.

—ఆలూరు రామచంద్రయ్య, బి. ఏ.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౫౮. కార్మికసంఘం

కార్మికసంఘప్రచురణము. నెం. 2. రైతు అగు వెంకటసుబ్బయ్యకు అతనికొడుకు రామకృష్ణయ్య జీతగాళ్ళ 'నాదాల' విషయంలోగల అన్యాయమును చూపి కార్మికసంఘములో సంచలనము, సంస్కారము కలిగించి వారికష్టసుఖాలుచూచి రైతులుకూడ 'సిగ్గుపడేటట్లుచేసి, తమదగ్గర పనిచేసేవాళ్ళని తమవాళ్ళవలె చూడడమే ధర్మమనుకొనేటట్లు' రైతులోకమును మార్చుట ఇందు చమత్కారముగ వర్ణింపబడినది ప్రస్తుత దేశస్థితికి అవసరమైన గ్రంథము. క్రౌనుసైజున 18 పుటలు. దొరకుచోటు : కార్మికసంఘము, అనంతవరము, గుంటూరు జిల్లా.

## ౫౯. వేదకాలపు స్త్రీలు

పశ్చిమగోదావరిజిల్లా కొవ్వూరునందలి ఆంధ్రగీర్వాణవిద్యాపీఠాధ్యక్షులగు శ్రీజటావల్లభుల పురుషోత్తముగారు, బి. ఏ. రచియించినది. వేదకాలపు స్త్రీలనుగూర్చి ఈగ్రంథమున—స్త్రీసంతతి : పురుషసంతతి ; వివాహము ; సవతులు ; వితంతువులు ; దాంపత్యము ; స్త్రీలు : గృహకృత్యములు ; స్త్రీలు : బాహ్యప్రపంచము ; స్త్రీలు : విద్యలు, వృత్తులు ; స్త్రీలు : కర్మకాండ ; స్త్రీలు : ధనము ; స్త్రీలప్రకృతి : స్త్రీలస్థానము ; వివిధవిషయములు —అను శీర్షికలక్రింద వేదవాక్యప్రమాణములతో వ్రాయబడినది. వివాహముకాకుండ కొందఱుస్త్రీలుండిపోవుట ; సంతతిలేని వితంతువు మఱదివలన సంతానము బడయుట ; కొంతమంది స్త్రీలకు ఘోషాయుండుట ; స్త్రీలు ప్రత్యేకసభలను, చేసికొనుట ; సత్యభామవలె యుద్ధముచేసిన స్త్రీలును సుభద్రవలె యుద్ధములో రథమునడపిన స్త్రీలును ఉండుట మొదలగు విషయముల నెఱుంగుట కెంతయు చిత్రముగనుండును. స్త్రీవిద్యాభిమానులెల్లరును అభినందింపదగిన ఉత్తమగ్రంథము. లెస్సగ పరిశోధించి విషయమును చక్కగ ప్రస్తరింపగలుగుటను ఈగ్రంథరచనముచే ప్రస్ఫుటముచేసిన శ్రీపురుషోత్తముగారు సూత్రకాలపుస్త్రీలనుగూర్చియు, పౌరాణికయుగస్త్రీలనుగూర్చియు గ్రంథములను రచియించుట వాంఛనీయము. ఈ గ్రంథముద్రణము సుందరముగ నున్నది. క్రౌనుసైజున 200 పుటలు వెల పది అణాలు. వలయువారు గ్రంథకర్తకు వ్రాయునది. సుప్రసిద్ధులు శ్రీవఝ్ఝూరి సూర్యనారాయణరావుగారు ఈగ్రంథమునకు పీఠిక వ్రాసియున్నారు.

## ౬౦. హౌటు సెలక్టు ఎ లైఫ్ ఆఫీస్

ఇన్సూరెన్సువ్యాపారవిషయకములగు గ్రంథములను ప్రచురించుచున్న భారతీయులలో నొకరగు శ్రీ యస్. యన్. గుప్తా గారు ఈగ్రంథరచయితలు. జీవితమును భీమాచేయదలచినవ్యక్తికి ఇన్సూరెన్సు కంపెనీలయందు ఏయే మంచిగుణములు ఉన్నవో లేవో చూచి కొనవలయునో ఈగ్రంథము చక్కగ బోధించుచున్నది. హిందూదేశమునందలి అయిదు పెద్ద భీమాకంపెనీలకు చెందిన వ్యాపారము ఇందు అంకెలతో నిరూపింపబడినది. ఆంగ్లమున వ్రాయబడిన ఈగ్రంథమునందలి విషయములు దేశభాషలలో కూడ ప్రచురింపబడుట లెస్స. ఈగ్రంథమూల్యము 8 అణాలు. వలయువారు గ్రంథకర్తపేర 47-1, హజ్రారోడ్డు, కలకత్తా అని వ్రాయునది.

## ౬౧. శృంగారగాధేయోపాఖ్యానము

లింగనకవితనూభవ అనంతనార్యప్రణీతమైన 'శృంగార గాధేయోపాఖ్యానము' అను విశ్వామిత్రచరిత్ర రూపకమగు అయిదాశ్వాసముల ప్రబంధములో ని

పంచమాశ్వాసమిది. అంబరీషుని యజ్ఞ్వరమునకు నరపశువుగాబోవు శునశ్శేఫుని విశ్వామిత్రుడు రక్షించుట, బ్రహ్మర్షిత్వమునర్థించి విశ్వామిత్రుడు 'కఅకుశీలంబున' 'ఏకాగ్రసమగ్రమతిని' తపమున్నొనర్చికొనియు మేనకకు దగుల్కొనుట, తెలివితెచ్చుకొని తిరిగి ఘోరవీరతపమునకు దొరకొని ఈసారి చిత్తముచెరుపవచ్చిన రంభను శపించి బ్రహ్మను ప్రత్యక్షముచేసికొని బ్రహ్మర్షిత్వము బడయుట ఇందు వర్ణింపబడినవి. విశ్వామిత్రునికడకు రంభను పంపుటకుముందు రంభకును, ఇంద్రునకును జరిగిన సంభాషణ కొంత ముచ్చటగనున్నది. గ్రంథము మంచి ఫెదరువెయిటు కాగితములమీద చక్కగ ముద్రింపబడియున్నది. క్రౌనుసైజు 64 పుటలు. వెల ఒక రూపాయి. వలయువారు విజయనగరమునందలి కళ్యాణీకార్యాలయమునకు వ్రాయనగును.

## ౬౨. పూర్వగాథాలహరి

ఇది పురాణగాథల అకారాది నిఘంటువు అని చెప్పవచ్చును. యనమండ్ర వేంకటరామయ్యగారిచే వ్రాయబడిన 'పురాణనామచంద్రిక' అను గ్రంథమును, 1917 లో పి. సూర్యనారాయణ అను వారిచే ప్రచురింపబడిన 'పురాణకథలు' అను గ్రంథమును, 1922 లో ప్రకటితమైన 'పురాణమణిమంజరి'యు దీనికి సాదృశ్యముగల తెలుగు గ్రంథములు. ఇది 1928 లో ప్రచురింపబడెను. ఆ మూడు గ్రంథములకంటె ఇది చాల విపులమైనదిగను, ఉపయోగమైనదిగను ఉన్నది. ఈ గ్రంథమును కూర్చిన శ్రీ వేమూరి శ్రీనివాసరావుగారు దీని రచనమునకు 1917 లో పూనుకొని దాదాపు నలుబదిపురాణములను చదివి అందలి సారమునుగ్రహించి తొమ్మిదియేండ్ల పరిశ్రమఫలముగ ఈ గ్రంథమును తెలుగువారికి ప్రసాదించిరి. ఒక్కొక్క విషయమునుగూర్చి వివిధపురాణములలో ఏమేమి చెప్పబడినదో ఒక్కచోట చేర్చి ఆ విషయములనన్నిటిని అకారాదిగకూర్చి ఇందు అందీయబడియున్నది. విద్యాప్రియులకు ఇది నిఘంటువువలె పాయరానిమిత్రముగ నున్నది. దీనిని కలిగియుండువానికి అష్టాదశపురాణములందలి కథలును కరతలామలకమై యుండును. ఏదైన నొక పౌరాణికవ్యక్తినిగూర్చి తెలిసికొనదలచినచో పెద్దపెద్ద పురాణములకొఱకుపోయి ఆ విషయమును వెదుకుకొనుటలో విశేషకాలమును వెచ్చింపవలసియుండును; అదియునుగాక పలుపురాణముల సంపాదించుటయు విశేషవ్యయమూలకము. ఈగ్రంథము అట్టి వృథాకాలహరణమును, విశేషవ్యయమును తొలగించి విద్యాప్రియుల కెంతయో నుపకరించును. ప్రతి గ్రంథాలయమునందును, ప్రతి విద్యాలయమునందును వినియమముగా నుండదగిన రిఫరెన్సు పుస్తకములలో నిది యొకటి. ఈ గ్రంథము రాయలుసైజున మంచి దళసరి తెల్లకాగితములమీద ముద్రింపబడియున్నది. ఆరువందలపుటలు. దిట్టమైన కాలికో అట్టవేయబడెను. వెల ప్రతి ఒక్కంటికి రు. 7-8-0. గ్రంథములు దొరకుచోటు: శ్రీకనుపర్తి మార్కండేయశర్మగారు, 82 పూనమల్లిహైరోడ్డు, కీల్పాక్ పోస్టు, మదరాసు. ఆంధ్రభూమి చందాదారులకు కొంతకాలము ఈ ఉత్తమగ్రంథమును తగ్గింపుధర కీయవలసినదిగా శ్రీ శర్మగారిని కోరియుంటిమి. 'ఆంధ్రభూమి'యందలి అభిమానముచే వారు దయతో అందులకు అంగీకరించిరి. 1934 ఏప్రియలు నెలాఖరులోపున ఈ పుస్తకమునకు దరఖాస్తుచేయు ఆంధ్రభూమి చందాదారులకు ప్రతి ఒక్కంటికి రు 6-0-0 కే ఈయబడును. మా చందాదారులలో పలువురు ఈ సదవకాశమును జారవిడువకుందురని నమ్ముచున్నాము.

## ౬౩. హరిజననాయకుడు

రైతుగ్రంథమండలిలో ప్రథమగ్రంథము. గ్రంథకర్త ప్రొఫెసరు రంగనాయకులుగారు, బి.లిట్ (ఆక్సుఫర్డు) నేటి తెలుగువారి సాంఘికజీవితమునకు ఈ గ్రంథము కొంతవఱకు దర్పణమని చెప్పవచ్చును. మొన్న మొన్నటివఱకును ఆంధ్రకర్షకస్త్రీలు వ్యవసాయపుపనుల నెట్లు సమర్థతతో నిర్వహించుచుండిరో ఈ గ్రంథమున చక్కగ వర్ణింపబడినది. ఆ ఘట్టములు చదువునపుడు శ్రీరంగనాయకులుగారు కవులుగ మనకు అగుపడుదురు. వారు రాజకీయనాయకులే గాక గొప్ప సంఘసంస్కర్తలనుటకు ఈ గ్రంథమునందలి పెక్కు ప్రకరణములు నిదర్శనములై యున్నవి. గ్రంథమున ప్రవాహ

వేగముగల వాడుకభాష ఉపయోగింపబడినది. నిరంతర కార్యనిమగ్నులై యుండియు శ్రీరంగనాయకులుగా రిట్టిగ్రంథరచనముచే ఆంధ్రభాషాయోషను సేవించుట స్తుతింపదగియున్నది. క్రౌనుసైజున 176 పుటలు. వెల రు 0-8-0. వలయువారు మేనేజరు, రైతుగ్రంథమండలి, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా, అని వ్రాయునది.

## ౬౮. పూలమాల

'గృహలక్ష్మి' పత్రికామతల్లిమూలమున నేటి తెలుగు మాగాణికి ఎఱుకపడిన శ్రీమతులు మదపుంచి అనంతమ్మ, తుమ్మల వసంతాదేవి, కొల్లూరి రాజేశ్వరి, ఓలేటి నిత్యకళ్యాణమ్మ మున్నగు కవయిత్రులలో ఈ పూలమాల రచయిత్రి శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారొకరు. ఆమె లేఖినినుండి జాలువాఱిన పదునాలుగు ఖండకావ్యకణముల సంపుటి ఈ గ్రంథము. పతిసందర్శనము; సుమన: శాండిలి; కృష్ణునితో పాంచాలి; కుంతీసందేశము మొదలగు పూలు స్త్రీహృదయమును గుబాళించుచున్నవి. 'గుమ్మడు' ఒక ప్రశస్తపుష్పము.

"మొల్ల తఱిగొండ వెంగమ్మ ముద్దుపళని
అచ్చమాంబయు మొదలుగా నాంధ్రమహిళ
లమిత విఖ్యాతిఁ గాంచు టీయవనిలోన
క్రమకవితామృతాస్వాదకలనఁ గాదె?"

అని నమ్మిన ఈ మాసోదరి సౌరభము వెదజల్లుభావములుగల ఇట్టి పూవులను పెక్కింటిని తెలుగు తల్లికి అర్పించుచుగాక యని కోరెదము. గ్రంథముద్రణము సుందరముగనున్నది. వలయువారు స్థానాపతి రుక్మిణమ్మ, మెయిన్ రోడ్, విశాఖపట్నం అని వ్రాయవలెను.

## ౬౯ జీవరసాయనచికిత్సావిధానము

'జీవరసాయన చికిత్సావిధానము' డా. విల్ హెలమ్ హెన్‌రిచ్ షూస్లర్ గారిచే 1873 లో కనిపెట్టబడినది. 'మానవశరీరము పన్రెండు విధములైన లవణములతో కూడుకొనియుండుననియు, ఈ లవణములలో దేనియొక్క భాగముతగ్గినను శరీరమున కస్వస్థతచే కూరుచున్నదనియు జీవరసాయనశాస్త్రజ్ఞులమతము... జీవరసాయన చికిత్సావిధానము ప్రపంచమంతయును అల్లుకొనిపోవుచున్నది. కారణము దురూహ్యముకాదు. ఏవైద్యమువలన రోగములు నివారణయగుచున్నవో ఆ వైద్యమునే జనులు కోరెదరు. జీవరసాయన చికిత్సావిధానము లోకమున విస్తరించుటకు ఇదియే కారణమనిన సత్యమునకు దూరముకాదు.' అని శ్రీ టంగుటూరి జానికరాంగారు ఈ గ్రంథపీఠికలో వ్రాసియున్నారు. గ్రంథరచయిత డాక్టరు తోలేటి పేర్రాజుగారు. శ్రీవారికి 1929 లో చాల జబ్బుచేసెను. అల్లోపతిక్ వైద్యులు పెదవి విరచిరి. అప్పటికే జీవరసాయనశాస్త్రమునందు పరిచయముండుటచే పేర్రాజుగారు సాహసించి ఈ మందుల వాడకమునకు గడంగి అద్భుతముగా రోగవిముక్తులయిరి. నాటినుండియు ఇట్టి అమూల్యచికిత్సావిధానము వెల్లడిచేయు కుతూహలురై ఇపు డీగ్రంథమును ప్రచురించిరి. ఇది ప్రథమభాగము. ద్వాదశలవణలక్షణదీపిక. ఇందు ఒక్కొక్క లవణము లోపించుటచే శరీరమునందలి వివిధావయవములయందు ఎట్టి మార్పులు గలుగునో వివరింపబడినది. పెక్కు అమూల్యగ్రంథములు పఠించి అందలి అంశములను గ్రహించి వ్రాయబడిన ఈ గ్రంథమును విరివిగకొని మిగిలిన భాగములనుకూడ త్వరలో ప్రచురింప గ్రంథకర్తకు ప్రోత్సాహమీయ ఆంధ్రమహాజనులను కోరెదము. క్రౌనుసైజున 160 పుటలు. వెల 1 రూపాయి. వలయువారు పశ్చిమగోదావరిజిల్లా నరసాపురమునందున్న గ్రంథకర్తకు వ్రాయవలెను.

## ౬౬. శ్రీ కుముదవల్లి

రాయలసీమ నేటి తెనుగు కవులలో నొకరగు శ్రీయుత సీరిపి ఆంజనేయులుగారు రచించిన మూడు అంకములుగల చక్కని చిన్న దృశ్యకావ్యము. తమ శిష్యురాలు ఒకతె తమ పాఠశాలాపత్రికలో ప్రచురించిన అభినవసుందోపసుందులు అను కథను ఆధారముగ గొని ఒక గంటలో ప్రదర్శింపబడుటకు అనువగునట్లు రచియింపబడిన నాటకమిది. ఈ నాటకమునకు పీఠిక వ్రాయుచు విద్యారసికులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ఇందలి ప్రధానపాత్రనుగూర్చి ఇట్లు వ్రాసిరి: "ఆమె శీలమును దీర్చుటయందు కవి గొప్ప ప్రతిభను కనుపరచినాడు. విద్యావతి, స్వతంత్ర వివాహవిభవో

పేతయగు శీలవతి, సతీపదము సార్థకపరచునుగాని వ్యర్థపరుపదని నిరూపించుటయందితడు చేసినకృషి, నేటి స్త్రీలసభ్యజీవనమును హేళనముగావించు ఛాందస కవులకు, దగిన ప్రతికృతిగ వెలుంగుచున్నది. 'కరమువ' శీలపోషణము నిశ్చయముగా శ్లాఘాపాత్రము.'' నీతి దాయకమగు ఈ నాటకము స్త్రీలును, స్త్రీవిద్యాభి మానులును చదువతగియున్నదని మా అభిప్రాయము. ఆంటిక్ కాగితములు క్రౌనుసైజు. 104 పుటలు. కృష్ణ దేవరాయగ్రంథమాలలో తొమ్మిదవ పుస్తకము. ప్రతు లకు అనంతపురమునందలి గ్రంథకర్తకు వ్రాయునది.

## ౬౭. గోపాలకృష్ణుని చాటువులు

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఒక అద్భుతమైనవ్యక్తి. చమత్కారసంభాషణవిషయమున వారితో దొరయుపాటి నాయకులు నేడు తెలుగు వారిలో మరి యెవ్వరును లేరనుట అతిశయోక్తిగాదు. అట్టివారి చాటూక్తులు గ్రంథరూపమునంది ప్రచురణ యగుట ఎంతయు సముచితముగనున్నది. 'చదువు మోసైనచానలు' అను శీర్షికగల వారి చాటువును చదువుడు:

సీ. ప్రక్కలకుపోవళ్ళు నిక్కిన ముక్కొళ్ళు
వాడిపోయినమోము బీడుకళ్ళు
ఎండిపోయినచళ్ళు పండిపోయినముళ్ళు
కాళ్ళను మేజోళ్ళు కళ్ళజోళ్ళు
ముళ్ళుగట్టినజుట్టు ముళ్ళుపెట్టినకట్టు
నక్కికుట్టినబట్ట నడుముతిట్ట
సందుచేసినచంక కందిపోయినడొంక
పలుచంబాతీవతొడ పలకలమెడ

గీ. గూనిరెక్కలు చుక్కాని లేనివాణి
పనిడి పళ్ళును కళ్ళిన ముసలి పెదవి
చదువుమోసైన చానల చందమార
రామ నగరీనరేంద్ర ! శ్రీరామచంద్ర !

ఇట్లే తక్కిన పద్యములును మృదుమధురమగు శైలిలో చెప్పిలు హాస్యరసములో ఒప్పుచున్నవి. వెల 3 అణా లు. బెజవాడలోని శ్రీమదాంధ్రవిద్యాపీఠగోష్ఠివారిచే ప్రకటితము.

## ౬౮. దూరదేశుడు

అనే నవ్వుతాలు. గ్రంథకర్త: ఏ. కే. రాయకవి అను పేరుగల అలపాటి కామేశ్వరరాయకవి. 1. పరమానందయ్య భావకవిత్వం, 2. భావకవి మండలి వార్షసభ, 3. ఉద్దండకవిచంద్రుడి ఉపన్యాసం, 4. భావకవిత్వం ప్రదర్శనం, 5. గీతపద్యాలు, 6. పద్య వ్యాసం, 7. శీర్షిక, 8. ఉపాయాలు, 9. కులమింటి కోతి మీద విమర్శనం, 10. బస్తీమేసవాల్, 11. దూరదేశుడు, 12. అఖరు అను తలపేరులతో వ్రాయ బడిన హాస్యరసవిషయకములగు వ్యాసముల సంపుటి. అనేకవిషయములనుగూర్చి హాస్యద్యోతకమగు విమర్శ గలదు. క్రౌనుసైజు 92 పుటలు. వెల ౧ రూ. విజయ నగరమున సుబ్రహ్మణ్యపేటలోనున్న గ్రంథకర్తకు వ్రాసి ప్రతులను బడయవచ్చును.

# క్రొత్త పత్రికలు

## ౧౩. ప్రజామిత్ర

తెలుగువారి తిలకనగరమగు బెజవాడలో పుట్టువు గన్నది. మండలప్రజలను మహనీయముగ సేవించినది. రాజధాని తిలకనగరమగు చెన్నపురి చేరినది. ఆకృతిని విస్తరించినది; ఆశయములను విశాలపఱచినది. రాజా గారిధనమునను; రామబ్రహ్మముగారి సామర్థ్యమునను; ఆంగ్లవిద్యాధికులు, జర్నలిజములో జాణైన అనుభవ మును సంపాదించిన ఆంధ్రయువకులలోనగు లక్ష్మీనరసు య్యగారి ఆలోచనాబలమును తోడుచేసికొని ప్రజా మిత్ర పరిపుష్టినొంది ఆంధ్రులకు సచిత్రవారపత్రికలేని లోపమును దీర్చివైచినది. అంతర్జాతీయవిషయములకు ప్రాధాన్యమిచ్చుచు ఈపత్రిక తెలుగువారిలో విశేష విజ్ఞానవ్యాప్తికి తోడుపడుచున్నది వయస్సునపిన్నయే యయ్యును ప్రజామిత్రతో దొరయుపాటి వారపత్రిక తెలుగున మఱియొకటి లేదనుట పొగడిచెప్పుటగాదు. రుచివిస్తృతిగల ఇట్టి పత్రికలవలన తెలుగువారిలో పత్రికాపఠనాభిలాష పెంపొందగలదు. మహారాష్ట్రు లకు 'కేసరి'వలె, అరవవారికి'ఆనందబోధిని'వలె ఆంధ్రు

లకు 'ప్రజామిత్ర' గర్వింపదగిన పత్రిక కాగలదనుటకు ఇంతవఱకు ప్రచురితములైన ఐదు సంచికలు సమర్థములైయున్నవి. సాలు చందా మూడురూపాయలు మాత్రమే. కార్యస్థానము : 1-4 ఉడ్వరోడ్డు, మౌంటురోడ్డు పోస్టు, మదరాసు. ప్రజామిత్ర చిరంజీవియై వర్ధిల్లును గాక !

## ౧౪. రంధ్రాన్వేషి

ప్రతి బుధవారము నెల్లూరునుండి ప్రచురింపబడు సంచిక ఒక్కంటికి కానీ వెలగల పత్రిక. సమర్థత ఉండియు పత్రికా సంపాదకవర్గమునుండి కారణాంతరములచే తప్పుకొనియున్న నేటి ఆంధ్రయువకులలో శ్రీ యమ్. కోదండరామరెడ్డిగారొకరు వారు తమ సామర్థ్యమును నిరుపయోగ మొనర్పక తిరిగి సంపాదకకార్యమునకు గడంగి ఇపుడీ 'రంధ్రాన్వేషి'ని ప్రచురించుచున్నందులకు మేమెంతయు ఆనందపడుచున్నాము. పత్రికలో గొప్ప విలక్షణత గలదు. 'ముల్లు : మొగ్గ' అను వ్యాసశకలములు ముల్లువలె నిశితముగా గుచ్చుకొనుచున్నను మొగ్గవలె నిసర్గముగా సువాసనను ఈనుచున్నవి. వెల స్వల్పముగావునను, విషయములు హాస్యరసమిళితములై చవులు నింపుగానున్నవి గావునను ఈ పత్రిక విశేషప్రచారము నందు ననుటకు సందేహము లేదు. సంవత్సరపు చందా నెల్లూరులో 0-12-0 అణాలు; బయటఊళ్ళలో 1-8 0.

## ౧౫. డక్కన్ కేసరి

సికిందరాబాదునుండి వెలువడు సచిత్రాంధ్రాంగ్లేయ మాసపత్రిక మొదటిసంపుటపు రెండవసంచిక 1933 డిసెంబరుమాసమున వెలువడినది. సంపాదకుడు : ఎ. వి. దత్తాత్రేయశర్మ. నిజామురాష్ట్రమున 'ఆంధ్రాభ్యుదయము,' 'సుజాత' మొదలగు పత్రికలు ఈవఱకు ప్రచురింపబడి తెనుగును సేవించినవి. ఇపుడారాష్ట్రమున్న తెనుగుమాసపత్రిక ఒక్కటియు లేదు. డక్కన్ కేసరి ఆలోటును తీర్చునని నమ్మెదము. సురవరము ప్రతాపరెడ్డి (బి.ఏ.,బి.ఎల్.); విద్వాన్ సరిపల్లె విశ్వనాథశాస్త్రి యం.ఏ. ప్రమున్నగు విద్యాధికుల వ్యాసములతో ఈ సంచిక ఒప్పుచున్నది. క్రౌను క్వార్టో సైజు. 42పుటలు. సాలు చందా రు. 3-0-0.

## ౧౬. గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రప్రజాలోకమునకు బాగుగా పరిచయమైన పత్రిక. గ్రంథాలయోద్యమప్రచారము గావించుటకు తోడు శారద, భారతి మున్నగు సచిత్రమాసపత్రికలు ఉదయమునొందక పూర్వము తెలుగువారి సచిత్రమాసపత్రికయై వరలిన, రాయప్రోలు సుబ్బారావు మున్నగు తెలుగు భావకవులకు ఆశ్రయభూమియై ప్రకాశిలిన గ్రంథాలయసర్వస్వము పునరుద్ధరింపబడి తిరిగి తన ప్రచారము సాగింపనుండుట సంతోషకరవిషయము. తొమ్మిదవ సంపుటపు తొలిసంచిక ఈజనవరిమాసమున వెలువడినది. ఆంధ్రదేశపు గ్రంథాలయోద్యమాచార్యులు అయ్యంకి వేంకటరమణయ్యగారు ఈపత్రికకు ప్రధానసంపాదకులు. గ్రంథాలయోద్యమప్రచారవిషయమున ఆంధ్రులు తిరిగి మేల్కొన్నారు. ఈప్రబోధసమయమున ఈపత్రిక చేయవలసినపని అనంతముగ గలదు. క్రౌను క్వార్టో సైజు. 50 పుటలు వార్షికమూల్యము ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ సభ్యులకు రు. 3-0-0; ఇతరులకు రు. 5-0 0. విడిసంచిక రు. 0-8 0. కార్యస్థానము బెజవాడ.

## ౧౭. అనంతపురబాలికాపాఠశాలాపత్రిక

రాయలసీమలోని అనంతపురమునందలి బాలికాపాఠశాలాపత్రిక వార్షిక సంచిక. 1933-వ సంవత్సరము జూనుమాసమున ప్రచురితము. విద్యార్థినులు వ్రాసిన ఆంధ్రాంగ్ల వ్యాసములు, పాఠశాలకు సంబంధించిన చిత్రపటములు గలవు. ఇట్టి పత్రికలవలన విద్యార్థినులలో చిన్ననాటనే రచనాభ్యాసంగము కలుగును. ఈ పాఠశాలలో తెలుగుపండితులుగానున్న సీరిపి యాంజనేయులుగారు విద్యార్థినులలో తెనుగు వ్యాసరచనాభ్యాసంగమును కలిగించి వారిచే చక్కని వ్యాసములు వ్రాయించి ఈసంచికకు సారస్వతపుష్టి కూర్చియున్నారు. ఇందులకు వారెంతయు అభినందింపదగియున్నారు.

# సంపాదకీయ సమాలోచన

**భూకంపము : బీహారు రాష్ట్రపు బడ్జెట్టు :—**

విశ్వప్రయత్నములు చేసినాడు. బీహారు రాష్ట్రపు ఆర్థిక సభ్యుడు నారాయణ సిన్హా బడ్జెట్టులో ఆయవ్యయములను సరిపెట్టుటకు విశ్వప్రయత్నములు చేసినాడు. తుదకు సరిపెట్టినాడు. జనవరి 15-వ తేదీ సోమవారము ఉదయమున శాసనసభవారిచే దానిని ఆమోదింపజేసినాడు. ఆమోదింపబడిన పిమ్మట నూటముప్పదియైదు నిముసములకు భూకంపము వచ్చినది. అనుకున్న ఆదాయమునకు విఘాతము వచ్చినది. అనుకోనని వ్యయములు విఱుచుకొని మీదబడినవి. క్షణము మనది కాదనుటకు మఱియొక నిదర్శనము. సాధారణవ్యయములకు తట్టుకొనుటకే తల్లక్రిందులగుచున్న బీహారు ఈ అసాధారణ వ్యయములనెట్లు ఎదుర్కొనగలదు? భారత శాసనసభలో కేంద్రప్రభుత్వమువారు బీహారుకు ఆర్థికసాహాయ్యము చేయవలయునను తీర్మానము ఏకగ్రీవముగ ఆమోదింపబడినది; దేశజులు యథాశక్తిని ధనసాహాయ్యము చేయుచున్నారు ఎందఱు ఎంతగ సాయము చేసినను ఇప్పటిభూకంపము వత్సరములుగ బీహారురాష్ట్రపు బడ్జెట్టు సరిపెట్టుటలో అడ్డుతగులుచునే యుండునని ఒప్పుకొనక తీరదు.

**జపానుకు తోడు సయాము :—**

మదరాసు రాజధాని ముఖ్యమైన పంటలలో వరియొకటి. ఈ రాజధానియందలి ప్రజల వినియోగమునకు సరిపోగా ఇంకను ఎంతయోధాన్యమును ఇతరప్రదేశములకు పంపుటకు వీలుకలదు. తన్వేడుధాన్యపుగింజ యైనను ఇతర ప్రదేశములనుండి తెచ్చుకొనవలసిన అవసరము ఈ రాజధానికి లేదు. అవసరము లేకపోయినను జపానుండి బియ్యము వచ్చిపడుచున్నవి: జపాను బియ్యమునకు ఇపుడు సయాముబియ్యముతోడైనవి. ఈ రాష్ట్రమునందలి బియ్యముకంటె జపాను. సయాము దేశములనుండిదిగుమతియగుచున్న బియ్యము కారుచౌకగానున్నవని మద్రాసు మెయిలు వాకొనుచున్నది. తాజాస్థితియందే తన బియ్యమునకు డిమాండు లేకున్నదని వగచుచున్న ఈ రాష్ట్రపురైతు ఈ పులిమీద పుట్రనెట్లు ఎదుర్కొనును? సయాము దేశమున ఈ నడుమ సంఘటిల్లిన అశాంతికి అచ్చటిధాన్యముధర పడిపోవుట యొక కారణమని తెలిసికొనియున్నాము. ఇక్కడి ధాన్యపు ధరను ఇంకను పడిపోనిచ్చుట ఇచ్చట అశాంతి నాహ్వానించుటయగునుగదా? ప్రభుత్వమువారేమి చేసెదరు?

**టోలుగేట్లు తిరిగి పుట్టుచున్నవి:—**

స్థానికస్వపరిపాలనమన నేమి? ఇతర రాష్ట్రములందు స్థానికస్వపరిపాలనమన ఎట్టి అర్థము ఉన్నదో మనము సూటిగ చెప్పజాలము గాని మన మదరాసురాష్ట్రమున స్థానికస్వపరిపాలన మన ఆ శాఖలో ఒకడు చేసినపనిని వాని తరువాత వచ్చినయతడు మార్చివైచుటయేయని నిస్సందేహముగ అర్థము చెప్పవచ్చును. వెనుకటి మదరాసు స్థానికపరిపాలనశాఖ మంత్రి శ్రీ మునిస్వామినాయుడు గారు రెవెన్యూతాలూకాకు ఒక్కొక్క

బోర్డును ప్రసాదించిరి; టోలుగేట్లను ఎత్తివైచిరి. వారియనంతరము బొబ్బిలిరాజావారు మదరాసు స్థానికస్వపరిపాలనశాఖకు మంత్రులైరి మనరాజధానియందు స్థానికస్వపరిపాలన మనగ నెరుకటివారు చేసినదానిని తరువాత వచ్చినవారు మార్చివేయుట యేగదా! కావున బొబ్బిలిరాజావారు తాలూకాబోర్డులకు స్వస్తిచెప్పిరి; టోలుగేట్లను తిరిగి ప్రతిష్ఠింప ప్రయత్నించుచున్నారు. ధాన్యము మొదలగు పంటసరుకులకు ధరలపడిపోగా కూరగాయలు, ఫలములు బండ్లమీద సంతలకుగొనిపోయి విక్రయించుకొని రైతులు నేడు తెచ్చుకొనుచున్న నాలుగు డబ్బులలో ఒకటి రెండు డబ్బులను ఈ టోలుగేట్లు మ్రింగగలవు టోలుగేట్ల పునరుద్ధరణము రైతునోట మరియొక కరక్కాయగొట్టుటయే. రైతుసరకులకు సంతమార్కెట్టు సౌకర్యములైన లేకుండజేయుట ఈ రోజులలో బొత్తిగా అన్యాయమనకతీరదు. టోలుగేట్ల పునరుద్ధరణము ఇతరుల నెవ్వరిని బాధించనంతటి తీవ్రముగా రైతుజనులను బాధించుననుట నిజము. రైతుల ప్రతినిధులమనుచు చెప్పుకొని గర్వించు మనశాసనసభ్యులు ఈయవసరమున ఎట్లుమెలంగెదరో?

కీ. శే. ఎ. రంగస్వామి అయ్యంగారు:—

ఎంతటి స్థిరస్థితినందియున్నను పది వత్సరములలోపల ముగ్గురు సంపాదకులను గోల్పోవుచో ఆ పత్రికకు కలుగునష్టము అపారమని చెప్పుట స్వభావోక్తికి సమీపమగును. సంపాదకుడు, స్వామ్యదారుడు కస్తూరి రంగయ్యంగారు మరణించిన లోటు లేకుండ ఎస్. రంగస్వామి అయ్యంగారు హిందూపత్రికను సమర్థతతో సంపాదించిరి. వృద్ధుడగు కస్తూరి రంగయ్యంగారి లోకానుభవము, సమర్థత యువకులగు రంగస్వామిఅయ్యంగారికి రాజాలదని పలువురు భయపడిరి. కాని యస్. రంగస్వామి అయ్యంగారు పత్రికను అద్భుతముగ నడపి లోకమువారిచే ఆహా అనిపించుకొనిరి. క్షయరోగము వారిని కబళింపగా ఎ. రంగస్వామిఅయ్యంగారు హిందూపత్రికాసంపాదకులైరి. యువకులుగారు, 'స్వదేశమిత్రన్' సంపాదకులుగా దేశమున పేరుగడించినవారు కాని వీరి హయాములో హిందూపత్రిక జ్యోతివలె వెలుగలేదు. దేశమును ముంచెత్తిన శాసనోల్లంఘనోద్యమును వీరు తీవ్రముగ పాటించినట్లు వీరువ్రాసిన ఒక్క సంపాదకీయముకూడ చెప్పుటలేదు. కేవలము మితవాదపత్రికయగు 'లీడరు' ప్రతిఘటించినపాటియైన హిందూపత్రిక ప్రభుత్వమును ప్రతిఘటించలేదు యస్. రంగస్వామి అయ్యంగారి శైలికిగల ఆకర్షణగాని, మార్దవముగాని వీరిశైలికిలేదు. మరణించినపిమ్మట ఆంధ్రుల విశేషసానుభూతినిపొందిన ఈ అయ్యంగారు బ్రతికియుండి ఆంధ్రసమస్యలయెడ సానుభూతిచూపలేదు. ఈయన గొప్ప మేధావియేకాని గొప్ప సంపాదకుడు మాత్రముకాడని చెప్పవలసియున్నది. సి. వై. చింతామణి, కోటంరాజు పున్నయ్య మొదలగు సంపాదకమహాశయులను ప్రసవించిన జాతికిచెందిన మన ఆంధ్రులు ఈ మేధావిని గొప్పసంపాదకుడుగా పరిగణించుటచూడ మాకు చాల ఆశ్చర్యముగనున్నది వీరి మరణమువలన హిందూపత్రికకుకంటె హిందూదేశమునకే ఎక్కువనష్టము. కాన్‌స్టిట్యూషనల్ లాయందు వీరితో దొరయుపాటివారు నేటి హిందూదేశమున మఱియొకరులేరు. రాజ్యాంగసంస్కరణములు రానున్నఈ సమయమున వీరిమరణము మఱింత విషాదమునకు కారణమగుచున్నది. శ్రీ అయ్యంగారి పవిత్రాత్మ శాంతిధామమున నెలకొనునుగాక!

**ఆంధ్రయూనివర్సిటీ: ప్యాస్ కోర్సులు:—**


ఆంధ్రయూనివర్సిటీవారు ప్యాస్ కోర్సులకు ప్రత్యేకకళాశాలలను స్థాపింప ప్రయత్నములు సాగించుచున్నారని తెలియవచ్చుచున్నది. సాశ్రమవిశ్వవిద్యాలయములు తమ పోషణక్రింద ప్యాస్ కోర్సులకు కళాశాలలను నిర్వహించుటకలదుగాని ఆంధ్రవిశ్వవిద్యాలయమువంటి అఫీలియేటింగు యూనివర్సిటీ ప్యాసుకోర్సులను ప్రత్యేకకళాశాలలను నడుపుట ఇదివఱకు ఆచారముగనుండలేదు. అనేకవిషయములందువలెనే ఈ విషయమునందును ఆంధ్రవిశ్వవిద్యాలయము విలక్షణతను సంపాదింప కాంక్షించుచున్నదేమో! తాను ప్రత్యేకము స్థాపించిన కళాశాలపై విశ్వవిద్యాలయము ప్రత్యేకాభిమానమును చూపుట సహజము. అపుడు ఇతరకళాశాల విద్యార్థులకు అనేకవిషయములలో నష్టము కలుగును. కావుననే ఆంధ్రవిశ్వవిద్యాలయమువారి ఈతలంపునకు విశాఖపట్టణము, విజయనగరము, రాజమండ్రి మున్నగు ప్రదేశములందు ప్రతికూలతీర్మానములు చేయబడినవి. ప్యాసుకోర్సులకు కళాశాలలున్నవి; దానివిషయమై విశ్వవిద్యాలయము విశేషశ్రద్ధను చూపవలసిన అవసరము లేదు. అవసరముగల ఇతర పోస్టుగ్రాడ్యుయేటుకోర్సుల విషయమున శ్రద్ధవహించుట లెస్స

**రాయలసీమ: ఆంధ్రవిశ్వవిద్యాలయము:—**

రాయలసీమపౌరులలో కొందఱు ఆంధ్రవిశ్వవిద్యాలయమున చేరక మదరాసు విశ్వవిద్యాలయముననే తగులుకొనియుండుటకు అభిలషించుచుండిరనుట వెల్లడికి వచ్చినది. పూర్తి సాంబారుమూర్తియైన సత్యమూర్తిగారు ఈ విషయమున వారికి ఉపదేష్ట. పెదవికి బెల్లమురాచుకొని ఆసాంబారుమూర్తి తనకు రాయలసీమ ఆంధ్రులయెడగల అభిమానమును పెద్దపెట్టున వాక్రుచ్చినాడు. కాని ఆతనిహృదయమును బయలుచేసి ఆతని ఆంధ్రాభిమానమును, ఆతడు ఆంధ్రులకు చేయగలసాయమును లోకమునకు తెలిపిన విషయమొకటి ఈనడుమ జరిగినది. మద్రాసు ఆంధ్రవైశ్యప్రముఖులలో నొకరును, కార్పొరేషనును ఇరువదియైదువత్సరములు సేవించుచున్నవారును అగు శ్రీ సుంకు సుబ్రహ్మణ్యశ్రేష్ఠిగారికి కార్పొరేషను రెవెన్యూఆఫీసరు ఉద్యోగమునిచ్చుటకు సభవారు సంకల్పింపగా సత్యమూర్తిగారు ప్రతిఘటించిరి. సత్యమూర్తిగారి సాంబారునందు తాళింపులోనైన ఆంధ్రాభిమానము లేదనుటకు ఈఒక్కనిదర్శనమును చాలును. సత్యమూర్తిగారి సత్యస్వరూపమును ఇపుడైన తెలిసికొని వారిప్రక్కచేరి ఆంధ్రుల ఐక్యతకు అడ్డుతగులుచున్న రాయలసీమ ఆంధ్రసోదరులు కర్తవ్యమాలోచింతురుగాక!

**గ్రంథాలయోద్యమము: ఆంధ్రభూమి:—**

గ్రంథాలయోద్యమప్రచారవ్యాప్తికి ఆంధ్రభూమి ఇంతదనుక చేసిన స్వల్పసేవకే అల్పసంతోషులగు విశాలాశయులు పలువురు ప్రశంసలనంపుచున్నారు. రేపల్లె తాలూకా గ్రంథాలయసంఘమువారు ఆంధ్రభూమిని ఆశీర్వదించుచు ప్రత్యేకతీర్మానమును గావించి ఆ తీర్మానమును మా కార్యాలయమునకు బంపియున్నారు. పెక్కుగ్రంథాలయములు తమ చందాధనమును పంపి ఆంధ్రభూమి ఆర్థికపుష్టికి తోడుపడుచున్నవి. అవకాశము కలిగినతోడనే ఆంధ్రభూమి పుటలను పెంచి గ్రంథాలయోద్యమవిషయములకు ప్రతిసంచికయందును కనీసము నాలుగు పుటలను ప్రత్యేకింప సంకల్పించియున్నాము



జనవరి, ౧౯౩౮.

౧౭:—కర్నూలు. శ్రీమతి వై. సీతమ్మగారు గౌరవ మేజిస్ట్రేటుగ నియమింపబడిరి.

౨౦:—కాకినాడ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ. శ్రీ వేమవరపు రామదాసుపంతులుగారు అధ్యక్షతవహించిరి.

౨౨:—గవర్నరు సర్ స్టాన్లీగారి గంజాంమండల సంచారము.

౨౪:—పెదపల్లి. రాజా పటేల్ ఖానా వెంకటరామస్వామి జమీందారువారి మరణము.

౨౬:—బరంపురము. రావుసాహెబు ఉన్నవ బుచ్చిరామలింగంపంతులుగారి మరణము.

౨౭:—అనంతపురము. జిల్లాబోర్డువారొసంగిన సన్మానపత్ర సందర్భమున రాయలసీమ విద్యాభివృద్ధిపట్ల ఆంధ్ర విశ్వవిద్యాలయముయొక్క శ్రద్ధను గూర్చి సర్. యస్. రాధాకృష్ణన్‌గారు వివరించి ఉపన్యసించిరి.

:—మదరాసు. రాయలసీమ మహాసభ. ఆంధ్ర విశ్వవిద్యాలయమునందు చేరుటకు ప్రాతికూల్యము.

౨౮:—మదనపల్లి. కళాశాలలో సర్. యస్. రాధాకృష్ణన్‌గారు ఆంధ్రవిశ్వవిద్యాలయ సమస్యలనుగూర్చి ఉపన్యసించిరి.

౨౯:—రాజమండ్రి. పి. వెంకటచలపతిరావు, కందుల జగన్నాథం, పి. సుబ్రహ్మణ్యంగార్లఅరెస్టు.

౩౦:—పెద్దాపురము మునిసిపాలిటీకి కమీషనరు నియామకము.

ఫిబ్రవరి, ౧౯౩౮.

౧:—మదరాసు శాసనసభలో రైతువారీభూముల ప్రాంతములందు భూమిశిస్తును నూటికి 25 వంతున తగ్గించవలయునను తీర్మానము.

౨:—మదరాసు శాసనసభలో తాలూకాబోర్డుల సెత్తివేయు ప్రతిపాదన సెలక్టుకమిటీకి పంపబడెను.

౬:—గోవాడ. గొల్లపూడి సీతారామశాస్త్రిగారి నిరాహారదీక్ష ప్రారంభము.

౧౦:—నెల్లూరు. మాక్మిలన్ కంపెనీ ఛీఫ్ ఏజెంటు రేబాల శేషగిరిరావుగారి మరణము.

:—కలకత్తా మదరాసు గాలివిమానపు టపా ప్రారంభము.

౧౪:—రాజమండ్రి. తాలూకాబోర్డు ప్రెసిడెంటు, పబ్లికు ప్రాసిక్యూటరుపనుల నిర్వహించిన నేతి సోమయాజులుగారు (85 ఏండ్లు) మరణించిరి.

౧౫:—మదరాసు. ఆంధ్రవైశ్యప్రముఖులు శ్రీ సుందరసుబ్రహ్మణ్యచెట్టిగారు కార్పొరేషను రివిన్యూ ఆఫీసరుగ నియమింపబడిరి.

:—గోవాడ. గొల్లపూడి సీతారామశాస్త్రిగారు నిరాహారదీక్షను విరమించిరి.

౧౬:—బెజవాడనుండి కాకినాడమీదుగా విశాఖపట్టణమునకు టెలిఫోనులైను ఏర్పఱుపబడెను.

౧౯:—నంద్యాల. మదరాసు రెవెన్యూబోర్డువారు కర్నూలు జిల్లాయందు సర్వేయు, రీసెటిల్మెంటు వెంటనే చేయించవలెనని ఉత్తరువు చేసిరి. ఆయాప్రాంతములందలి తాసిల్దారులందరును యథోచితకార్యములను ప్రారంభించిరి.

:—మదరాసు. ఆంధ్రమహాసభ. దత్తమండలములను, చిత్తూరుజిల్లాను ఆంధ్రవిశ్వవిద్యాలయ యాజమాన్యముక్రింద తిరిగి చేర్చుటకు అంగీకరించుచు తీర్మానము.